సత్యమేవ జయతే

సాక్షి


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 36

శుక్రవారం 28-4-2023


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బలహీన విధానాలతోనే..
ఇవే అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభానికి కారణం: ఆర్‌బీఐ గవర్నర్ - 13లో



గ్రేడ్ 'సి'లో మేఘన, అంజలి
బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ప్రకటన. ఆంధ్ర మహిళా క్రికెటర్లకు చోటు. - 12లో


విద్యుత్ కాంతుల్లో మెరిసిపోతున్న నూతన సచివాలయం


సీఎం చాంబర్


రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం

సాగర తీరాన ధగధగల సౌధం

ఇండో-పర్షియన్ నిర్మాణ శైలి ● ఆధునిక హంగులతో అద్భుత కట్టడం

ఆరు అంతస్తుల్లో తెలంగాణ కొత్త సచివాలయం ● ఎన్నో విశేషాలు.. మరెన్నో ప్రత్యేకతలు

సాక్షి, హైదరాబాద్‌: హుస్సేన్‌సాగర్ తీరాన ఓ భారీ భవన సముదాయం.. ఇండో-పర్షియన్ నిర్మాణ శైలి.. నిలువెల్లా సాంకేతికత.. గుమ్మటాలతో సంప్రదాయ రూపు..ఆధునిక హంగులతో కూడిన అద్భుత కట్టడం. చూడగానే తాజ్‌మహల్, మైసూర్ ప్యాలెస్‌ను తలపించే శ్వేతసౌధం ..635 గదులు.. 30 సమావేశ మందిరాలు..34 గుమ్మటాలు.. అదే తెలంగాణ రాష్ట్ర కొత్త సచివాలయం. ఈ నెల 30న ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిని ప్రారంభించనున్నారు.

మొత్తం 28 ఎకరాల్లో..

- సచివాలయ ప్రధాన భవనం ఆరు అంతస్తుల్లో ఉంటుంది. ప్రధాన గుమ్మటం వద్ద మరో ఐదు అంతస్తులతో 11 అంతస్తుల నిర్మాణంగా ఉంటుంది.
- సచివాలయ ప్రాంగణం 28 ఎకరాల్లో ఉంటుంది. ఇందులో భవనాల విస్తీర్ణం రెండున్నర ఎకరాలు. ముందువైపు 10 ఎకరాల్లో పచ్చిక మైదానం ఉండగా, కోర్ట్‌యార్డులో 2 ఎకరాల్లో లాన్ ఏర్పాటు చేశారు. వెరసి 90 శాతం స్థలం ఖాళీగా ఉంటే, పది శాతం మాత్రమే భవనాలున్నాయి.
- ప్రాంగణంలో మొత్తం నిర్మిత స్థలం దాదాపు 10 లక్షల చదరపు అడుగుల మేర ఉంటుంది. దేశంలోని అతిపెద్ద సచివాలయాల్లో ఇదీ ఒకటి. ఢిల్లీలో కొత్తగా నిర్మించిన పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టా కూడా దాదాపు ఇంతే విస్తీర్ణంలో ఉంది.
- ఈ భవనాన్ని 26 నెలల్లో పూర్తి చేశారు. మధ్యలో కోవిడ్ కారణంగా ఆరు నెలలు వృథా అయింది. అంటే 20 నెలల్లోనే భవనాన్ని సిద్ధం చేసినట్టయింది.
- నిర్మాణ పనుల్లో 3 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. చివరలో

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ ఔన్నత్యం.. పాలన వేగం: ప్రశాంత్‌రెడ్డి 2లో

ఓఆర్ఆర్ ప్రైవేటుకు!

టోల్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ పద్ధతిన 30 ఏళ్లకు లీజుకిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

- రూ. 7,380 కోట్లకు టెండర్ పొందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్
- దేశంలోని అతిపెద్ద టీఓటీ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఓఆర్ఆర్ లీజు రికార్డు
- ఇకపై టోల్ వసూళ్లతోపాటు రోడ్డు మరమ్మతుల నిర్వహణ ఐఆర్‌బీదే



సాక్షి, హైదరాబాద్‌: భాగ్యనగరానికి మణిహారమైన 158 కి.మీ. నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)ను రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లపాటు లీజుకు అప్పగించింది. టోల్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) ప్రాతిపదికన ఓఆర్ఆర్ నిర్వహణ లీజు కోసం హెచ్ఎండీఏ బిడ్‌లను ఆహ్వానించగా 11 అంతర్జాతీయ స్థాయి నిర్మాణ సంస్థలు పోటీపడ్డాయి. చివరకు నాలుగు సంస్థలు అర్హత సాధించగా జాతీయ రహదారుల నిర్వహణలో అతి పెద్ద సంస్థగా పేరొందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 7,380 కోట్లకు ఈ లీజును పొందింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌బీ సంస్థకు లెటర్ ఆఫ్ అవార్డ్‌ను (ఎల్ఓఏ)ను అందజేసింది. దేశంలోని అతిపెద్ద టీఓటీ ప్రాజెక్టుల్లో ఇది ఒకటి కావడం గమనార్హం. ఈ బిడ్‌ను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు

మిగతా 5వ పేజీలో ▶

యుద్ధ విమానం స్వదేశీ గర్జన

'సాక్షి'తో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్



రక్షణ పరిశోధన సాంకేతిక రంగంలోకి కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలను ఆహ్వానిస్తోందని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ తెలిపారు. 2028 నాటికి స్వదేశీ యుద్ధ విమానం సిద్ధమవుతుందని చెప్పారు. నేవల్ బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగం విజయవంతం కావడం శుభపరిణామమన్నారు. అగ్రదేశాల సరసన నిలిచి ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో చేరడం గర్వకారణమన్నారు. రక్షణ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

- వివరాలు 10లో

వసూళ్ల చిట్టా ఉంది.. జాగ్రత్త!

దళితబంధు నా ఆత్మబంధువు.. అవినీతికి పాల్పడితే అడ్డంగా నరికేస్తా!

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో సీఎం కేసీఆర్

- అక్రమాలకు పాల్పడితే టికెట్లు ఇవ్వకపోవడం కాదు.. పార్టీ నుంచే పంపేస్తా
- అనుచరులు అవినీతికి పాల్పడినా ఎమ్మెల్యేలదే బాధ్యత
- ఎన్నికలకు మిగిలింది నాలుగు నెలలే.. వంద సీట్లు సాధిస్తాం
- జనంతో మమేకం అయ్యేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోండి
- పార్టీ కేడర్‌లో అసంతృప్తి తగ్గించేలా పనిచేయండి
- విభేదాలు ఉంటే ఓ మెట్టు దిగి సర్దుకుపోవాలి... వచ్చే నెల రోజులు వరుసగా అధికారిక కార్యక్రమాలు.. తర్వాత పార్టీపైనే పూర్తి దృష్టి
- త్వరలో ఒక్కో ఎమ్మెల్యేతోవ్యక్తిగతంగా మాట్లాడుతానని వెల్లడి
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశవ్యాప్త పర్యటనలు చేస్తానని వెల్లడి

"దళితబంధులో రూ.10లక్షలకుగాను రూ.రెండు లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తున్న వారి చిట్టా నాదగ్గర ఉంది. వెంటనే సరిదిద్దుకోని పక్షంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కాదు కదా పార్టీ నుంచే బయటకు పంపిస్తా.. దళితబంధులో అనుచరులు అవినీతికి పాల్పడినా ఎమ్మెల్యేలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- సీఎం కేసీఆర్

2లో



న్యూస్‌రీల్

మోదీని నిలదీసినందుకే రాహుల్‌పై కక్ష



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌పై అనర్హత వేటును నిరసిస్తూ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు.

- వివరాలు 3లో

విమర్శల నడుమ గ్యాంగ్‌స్టర్ ఆనంద్ విడుదల



రెమిషన్ అమలుకు సంబంధించి జైలు మాన్యువల్‌ను నితీశ్ ప్రభుత్వం 'మార్చడం'తో రాజకీయ నేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ గురువారం బిహార్ కారాగారం నుంచి విడుదలయ్యారు.

- వివరాలు 6లో

దేశంలో మార్పు దిశగా ఉద్యమించాల్సిందే

తెలంగాణ మోడల్ అమలుకు సమయం ఆసన్నమైంది: కేటీఆర్

- స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా తాగు, సాగునీటి కోసం కొట్లాటలే..
- భారీ రిజర్వాయర్లతో నీటి సమస్యను తీర్చుకోవచ్చు
- ఆ దిశగా బీఆర్ఎస్ పురోగమించాలని పిలుపు
- పార్టీ ప్లీనరీలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

3లో



ఘనంగా ఆవిర్భావ దినోత్సవం 2లో

'కల్యాణం' ఎవరికో?



కల్యాణ (హైదరాబాద్) కర్ణాటక కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తూ వస్తోంది. రాష్ట్రంలో బీజేపీ రెండుసార్లు 100కు పైగా స్థానాలు ఒడిసిపట్టినా మెజారిటీ మార్కును దాటలేకపోవడానికి ఈ ప్రాంతంలో పట్టు లేకపోవడమే ప్రధాన కారణం. దాంతో ఈసారి రెండు పార్టీలకూ కల్యాణ కర్ణాటక కీలకంగా మారింది. పట్టు కొనసాగించాలని కాంగ్రెస్, కోటను ఎలాగైనా బద్దలు కొట్టాలని బీజేపీ పట్టుదలగా ఉన్నాయి. ఇక్కడ ఎప్పుడూ ఐదు స్థానాలకు మించి గెలవని జేడీ(ఎస్) ఈసారి బీజేపీ, కాంగ్రెస్ రెబెల్స్‌ను బరిలో దించి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది...

- వివరాలు 6లో

మొక్కజొన్న కొనుగోలుకు సర్కారు నిర్ణయం

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- క్వింటాలుకు మద్దతు ధర రూ. 1,962



సాక్షి, హైదరాబాద్‌: యాసంగి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తక్షణం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగిలో దాదాపు 6.50 లక్షల ఎకరాలలో మొక్కజొన్న సాగైంది. 17.37 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో ప్రధానంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇప్పటికే పంట మార్కెట్లోకి వస్తోంది. వాస్తవంగా మొక్కజొన్న క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.1,962 ఉండగా, మార్కెట్‌లో వ్యాపారులు రూ.1,650కే కొంటున్నారు. మొదట్లో రూ. 2 వేలకు పైగా ధరతో కొనుగోలు చేసిన వ్యాపారులు తర్వాత ధరలు తగ్గించి కొంటున్నారు. అంతేకాకుండా గత నెల నుంచి కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో అనేకచోట్ల మొక్కజొన్న పెద్ద ఎత్తున పాడైపోయింది. దీంతో ధరలు పతనమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీఎం ఆదేశాల నేపథ్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి నిరంజన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోనే మొక్కజొన్న కొనుగోలు జరుగుతుందని అధికారులు తెలిపారు.

అవినాశ్ అరెస్టుకు సీబీఐ అత్యుత్సాహం

ఆయన లక్ష్యంగానే దర్యాప్తు సాగుతోంది.. కానీ, కిరాయి హంతకుడు మాత్రం బయట..

- సీబీఐ తీరు చట్ట విరుద్ధమన్న ఎంపీ అవినాశ్ న్యాయవాది
- 'హియర్ సే ఎవిడెన్స్' ఆమోదయోగ్యం కాదు
- కేసు సీబీఐకి బదిలీ తర్వాత దస్తగిరి 2 నెలలపాటు ఢిల్లీలోనే..
- వివేకా కుమార్తె సునీత మాటమార్చారు
- లేఖను ఎందుకు దాచారన్న దానిపై దర్యాప్తు ఏదీ?
- ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తి
- వివేకా హత్య కేసులో అవినాశ్ పిటిషన్‌పై వాదనలు

10లో



ఏకపక్షంగా విచారణ
వివేకా హత్యపై సోషల్ మీడియాలో వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో వైరల్

పంటలు అస్తవ్యస్తం.. ఊహకందని నష్టం



నాలుగైదు లక్షల ఎకరాలే కాదు... ఇంకా ప్రభావం ఎక్కువే

- 75% ఊడ్చుకుపోయిన మామిడి పంట
- 12 లక్షల టన్నులకు మూడు లక్షలే చేతికి వస్తాయని అంచనా
- లక్షలాది ఎకరాల్లో నేల రాలిన వరి గింజలు...
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు...

5లో

ఇదండీ సంగతి



అబ్బే అదేం కాదు! ఈ నియోజకవర్గం అభ్యర్థి.. ఇంట్లో పని ఏదైనా ఉంటే చేసి పెడతానంటున్నాడు!

'చిరు' ప్రయత్నం ఫలించింది..!


- చిరుధాన్యాల ప్రోత్సాహం దిశగా తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలిచ్చాయన్న నీతిఆయోగ్
- ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెంలో సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారని వెల్లడి
- పథకం అమలు చేసిన ప్రాంతాల్లోని పిల్లల్లో రక్తహీనత వంటి సమస్యలు తగ్గాయని నివేదిక



సాక్షి, న్యూఢిల్లీ: రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు వినియోగించేలా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా తెలంగాణలో చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయని నీతిఆయోగ్ వెల్లడించింది. ఎంపిక చేసిన జిల్లాలు, ప్రాంతాల్లో చిరుధాన్యాలపై అవగాహన పెంచేలా చేపట్టిన కార్యక్రమాలతో బహుళ ప్రయోజనాలు కనిపించాయని నీతిఆయోగ్ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరగ్గా, మరికొన్ని ప్రాంతాల్లో రోజువారీ వినియోగం పెరిగిందని, ఇంకొన్ని చోట్ల చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పారని వివరించింది. దేశంలో చిరుధాన్యాల ఉత్పత్తి, ప్రాసెసింగ్, వినియోగానికి సంబంధించిన వివిధ అంశాలలో రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు అనుసరించిన వినూత్న పద్ధతులను వివరిస్తూ నీతిఆయోగ్ నివేదిక విడుదల చేసింది. ఇందులో తెలంగాణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది.

సాగు, వినియోగం రెండూ పెరిగాయి...

తెలంగాణలోని ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో ఐసీడీఎస్ కింద చిన్నారులు, గర్భిణీలు, తల్లులకు అంగన్‌వాడీల ద్వారా చిరుధాన్యాల ఆధారిత వంటకాలను అందించారు. ఇదే సమయంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారని నీతి ఆయోగ్ తెలిపింది. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చిరుధాన్యాల సాగుపై ఆసక్తి పెరగడంతో పాటు ప్రాజెక్టు చేపట్టిన పరిధిలో వెయ్యి ఎకరాల మేర సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపింది. రబీ సీజన్‌లో చిరుధాన్యాల విత్తనాలకు డిమాండ్ పెరిగిందని, ఆసిఫాబాద్ జిల్లాలో 80 శాతం లబ్ధిదారులు, వారి కుటుంబాలు రోజూవారీ భోజనంలో ఒకసారి కచ్చితంగా చిరుధాన్యాలను వినియోగిస్తున్నారని తెలిపింది. కిరాణా దుకాణాల్లో ప్రతిరోజూ 5 నుంచి 6 కిలోల విక్రయాలు జరుగుతున్నాయని, ఆసిఫాబాద్ పరిధిలో ఒక సహకార సంఘం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని చిరుధాన్యాల ప్యాకేజింగ్, ప్రాసెసింగ్‌ను సైతం మొదలుపెట్టిందని వివరించింది. 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు, వారి తల్లులకు చిరుధాన్యాల భోజనం అందించే కార్యక్రమాన్ని వికారాబాద్‌లోని 3, ఆదిలాబాద్ జిల్లాలోని 3 మండలాల్లో అమలు చేయగా, చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువల ద్వారా పిల్లల్లో కుంగుబాటు, రక్తహీనత, బరువు తగ్గడం వంటి సమస్యలు తగ్గుముఖం పట్టాయని పేర్కొంది. ఉట్నూరు, ఏటూరునాగారం, భద్రాచలం ప్రాంతాల్లోని గిరిజన కుటుంబాల్లో పోషకాహారం అందించేలా చేపట్టిన గిరి పోషణ కార్యక్రమంతోనూ మంచి ఫలితాలు వచ్చాయని నీతిఆయోగ్ వెల్లడించింది. పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులతో కలిపి మొత్తంగా 13,098 మంది లబ్ధిదారులకు ఈ పథకాన్ని అమలు చేసిందని తెలిపింది. స్థానికంగా లభించే పదార్థాలైన జొన్నలు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలను ఉపయోగించి నాలుగు రకాల ఆహార మిశ్రమాలను అందించినట్లు తెలిపింది. వీటిద్వారా లబ్ధిదారులకు ఐరన్, కాల్షియం, ప్రొటీన్ వంటి కీలక పోషకాలు తగిన మోతాదులో అందడంతో రక్తహీనత ప్రభావం 41 శాతం, తక్కువ బరువు పిల్లల జననాలు 37 శాతం తగ్గినట్లు వెల్లడించింది.



గోల్కొండలో 'మన్ కీ బాత్' సౌండ్ అండ్ లైట్ షో

- హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఈ నెల 29న 'మన్ కీ బాత్'థీమ్‌తో ప్రత్యేకమైన సౌండ్ అండ్ లైట్ షోను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ నెల 30 న ఆల్ ఇండియా రేడియో ద్వారా ప్రసారం కానున్న మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనుంది. మన్ కీ బాత్‌కు సంబంధించిన ఎంపిక చేసిన కొన్ని థీమ్స్‌ను దేశవ్యాప్తంగా ఉన్న 13 చారిత్రక కట్టడాల్లో సౌండ్ అండ్ లైట్ షో ద్వారా ప్రదర్శించనున్నారు. - 14లో

రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల తేలికపాటి వానలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ విదర్భ నుంచి మరఠ్వాడ, ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఉత్తరాది జిల్లాలు, తూర్పు ప్రాంతంలోని జిల్లాల్లో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఒకట్రెండు చోట్ల వడగండ్ల వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గురువారం గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 37.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వచ్చే 3 రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.4	27.2
అనంతపురం	40.4	23.9
విజయవాడ	38.0	27.0
విశాఖపట్నం	37.0	26.2
నల్లగొండ	37.0	21.0
ఆదిలాబాద్	36.8	19.7
భద్రాచలం	36.6	26.0
ఖమ్మం	36.6	25.4
రామగుండం	36.4	23.5
మహబూబ్‌నగర్	35.5	24.6
నిజామాబాద్	35.2	22.9
హనుమకొండ	33.0	22.5
హైదరాబాద్	32.7	24.0
మెదక్	32.6	21.3
హకీంపేట్	32.0	23.2
దుండిగల్	32.0	22.0

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

- కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభ
- అనంతరం ప్రజాప్రతినిధుల సమావేశం .. పలు తీర్మానాలకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం గురువారం తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ భవన్‌కు దారితీసే ప్రధాన మార్గాలన్నీ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలతో గులాబీమయంగా మారాయి. సర్వసభ్య సమావేశానికి 279 మంది ప్రతినిధులను ఆహ్వానించగా.. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోపాటు మరో 11 మంది పలు కారణాలతో గైర్హాజరైనట్టు సమాచారం. మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పరిషత్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. సభకు ఆహ్వానం అందుకున్న ప్రతినిధులు ఉదయం 10.30 వరకే తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. తొలుత అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, విప్ బాల్క సుమన్ తదితరులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బీఆర్‌ఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఏడు గంటల పాటు సమావేశం

ఉదయం 11.30కు సర్వసభ్య సమావేశం ప్రారంభంకాగా.. పార్టీ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావు స్వాగతం పలికారు. తర్వాత కేసీఆర్ స్వాగతోపన్యాసం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు 'దేశంలో గుణాత్మక మార్పును సాధించే దిశగా బీఆర్‌ఎస్ ఉద్యమస్ఫూర్తితో పురోగమించాలి' అని కోరుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానంపై మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, క్రాంతికిరణ్, సండ్ర వెంకట వీరయ్య ప్రసంగించారు. ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, గోరటి వెంకన్న, తాతా మధు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జెడ్పీ చైర్‌పర్సన్లు స్వర్ణ సుధాకర్‌రెడ్డి, గండ్ర జ్యోతి, బీఆర్‌ఎస్ ఏపీ శాఖ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ తదితరులు పలు తీర్మానాలను బలపరుస్తూ ప్రసంగించారు. సుమారు ఏడు గంటల పాటు కొనసాగిన బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశం సాయంత్రం 6.30కు ముగిసింది.

నేషనల్ మిషన్‌తో ముందుకు: కేశవరావు

జాతీయ ప్రయోజనాలను నెరవేర్చే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ముందుకు సాగాలని పార్టీ సెక్రటరీ జనరల్, ఎంపీ కె.కేశవరావు పిలుపునిచ్చారు. ఆయన పార్టీ ప్రతినిధుల సమావేశంలో ప్రసంగించారు. అధినేత కేసీఆర్, కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలమన్నారు. కేసీఆర్ ప్రైవేటీకరణకు బదులుగా జాతీయాకరణను కోరుకుంటున్నారని చెప్పారు.

'ప్రజల ఎజెండాతోనే కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి'



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష స్థాయికి కూడా పనికి రాకుండా పోయిందని, ప్రజల ఎజెండాతోనే సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి అడుగుపెట్టారని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీకి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనైనా ఏ సమయంలో ఎలాంటి ఎత్తుగడ వేయాలో కేసీఆర్‌కు తెలిసినంతగా మరొకరికి తెలియదన్నారు.



నూతన సచివాలయం ముందు గ్రీనరీ.. (వృత్తంలో) హెలిప్యాడ్



సీఎం చాంబర్ పక్కన మంత్రుల సమావేశ మందిరం



మంత్రి చాంబర్ ఇలా..

..ధగధగల సౌధం

▶ మొదటి పేజీ తరువాయి

రాత్రింబవళ్లు 4 వేల మంది వరకు పనిచేశారు.

కుతుబ్‌మినార్ కన్నా ఎత్తు

- సచివాలయ భవనం ఎత్తు 265 అడుగులు, ఇది కుతుబ్‌మినార్ (239 అడుగులు) కంటే ఎత్తు. భవనంపైన ప్రధాన రెండు గుమ్మటాల మీద ఏర్పాటు చేసిన అశోక చిహ్నాల్లో ఒక్కోదాని ఎత్తు 14 అడుగులు,
- భవన నిర్మాణానికి రూ.617 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చారు. అప్పట్లో 6 శాతంగా ఉన్న జీఎస్టీ తర్వాత 18 శాతానికి పెరిగింది. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయి. దీంతో నిర్మాణ వ్యయం దాదాపు 30 శాతానికి పైగా పెరిగింది.
- ఆరో అంతస్తులోని సీఎంవోకు చేరుకునేందుకు రెండు లిఫ్టులు ఏర్పాటు చేశారు. మంత్రులు, ఆ స్థాయి వారి కోసం 24 చాంబర్లను రూపొందించారు. మంత్రి, కార్యదర్శి, ఆ శాఖ అధికారులంతా ఒకేచోట ఉండేలా ఏర్పాటు చేశారు. ఇలాంటి వ్యవస్థ ఉన్న సచివాలయం దేశంలో ఇదొక్కటే.
- గుమ్మటాల్లో రెండు పెద్దవి. ఒక్కోటి 50 అడుగుల డయాతో 48 అడుగుల ఎత్తున్నాయి. కొన్ని డోమ్‌లపై ఉన్న శూలాల్లాంటి శిఖర భాగం 9 అడుగుల ఎత్తు, 5అడుగుల వెడల్పుతో ఉంది.

360 డిగ్రీల కోణంలో నగర అందాలు

- పెద్ద గుమ్మటాల్లో ఉన్న స్థలాన్ని ప్రత్యేక ప్రాంతంగా రూపొందించారు. విదేశీ ప్రతినిధులు, ఇతర అతి ముఖ్యమైన వ్యక్తులు వచ్చినప్పుడు హై టీ, రాయల్ డిన్నర్‌లకు వినియోగిస్తారు. అక్కడి నుంచి నగర అందాలు 360 డిగ్రీల కోణంలో వీక్షించొచ్చు.ఈ ప్రాంతాన్ని స్కై లాంజ్‌గా పేర్కొంటున్నారు.
- పార్లమెంటు భవనానికి వినియోగించిన ధోల్‌పూర్ ఎర్రరాయిని సచివాలయం కోసం 3.500 క్యూ.మీ. పరిమాణంలో వాడారు. ఇందుకు రాజస్తాన్‌లోని ధోల్‌పూర్‌లో ఏకంగా ఓ గని మొత్తాన్ని వినియోగించారు. అక్కడి నుంచి వేయి లారీల్లో రాయిని హైదరాబాద్‌కు తరలించారు. బేస్‌మెంట్ మొత్తానికి ఎర్ర రాయిని వాడగా, ప్రధాన గుమ్మటం నుంచి పోర్టికో వరకు లేత గోధుమ రంగు రాయిని వాడారు.
- స్తంభాలు ఇతర భాగాల్లో ప్రత్యేక నగిషీ ఆకృతుల కోసం గాల్వనైజ్డ్ రీఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ పద్ధతిలో ప్రీఫ్యాబ్రికేటెడ్ డెకొరేషన్ చేయించారు. తద్వారా దేశంలో ఈ స్థాయిలో జీఆర్‌సీ చేసిన తొలి భవనంగా సచివాలయం నిలిచింది.

42 అడుగుల పోర్టికో..

- ప్రధాన పోర్టికో ఎత్తు ఏకంగా 42 అడుగులు. అంత ఎత్తుతో భారీ స్తంభాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ భవనంలో ప్రతి అంతస్తు 14 అడుగుల ఎత్తుతో నిర్మించారు.
- భవనంలో మొత్తం 24 లిఫ్టులు ఏర్పాటు చేశారు. స్కై లాంజ్ వరకు వెళ్లేందుకు రెండు వైపులా 4 లిఫ్టుల చొప్పున 8 లిఫ్టులున్నాయి.
- సచివాలయానికి తూర్పువైపు ప్రధాన ద్వారం ఉంటుంది. అక్కడి నుంచి ముఖ్యమంత్రి, మంత్రులు, సీఎస్, డీజీపీ, ప్రజా ప్రతినిధులకు అనుమతి ఉంటుంది. పశ్చిమం వైపు అత్యవసర ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈశాన్యం వైపు ఉద్యోగుల ద్వారం, దక్షిణం వైపు సందర్శకుల ద్వారం ఏర్పాటు చేశారు. సందర్శకుల వాహనాలు ప్రధాన ప్రహరీ బయటే నిలపాల్సి ఉంటుంది. అధికారులు, సిబ్బందికి లోపల ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- భవనానికి దక్షిణం వైపు సందర్శకుల రిసెప్షన్, ఎన్‌ఆర్‌ఐ రిసెప్షన్, పబ్లిసిటీ సెల్, రెండు బ్యాంకులు, రెండు ఏటీఎం కేంద్రాలు, పోస్టాఫీసు, బస్, రైల్వే కౌంటర్లు, క్యాంటీన్, మీడియా కేంద్రాలను విడిగా నిర్మించారు. వెనుక వైపు సెక్యూరిటీ కార్యాలయం, ఉద్యోగ సంఘాల కార్యాలయాలు, ఉద్యోగుల పిల్లల క్రెచ్, ఆరోగ్య కేంద్రం, ఇండోర్ గేమ్స్ ప్రాంగణం, సహకార పొదుపు సంఘ కార్యాలయం, తదితరాలతో కూడిన భవన సముదాయాన్ని నిర్మించారు. నైరుతి వైపు దేవాలయం, వెనక వైపు చర్చి, మసీదు నిర్మించారు.

ప్రత్యేక పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్

- తాగు నీటి కోసం 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకు నిర్మించారు. ఇతర అవసరాలకు 1.80 లక్షల లీటర్ల సామర్థ్యంతో, అగ్నిమాపక అవసరం కోసం 2.80 లక్షల లీటర్ల సామర్థ్యంతో, వర్షపు నీరు స్టోరేజీ కోసం 2.40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకులు నిర్మించారు.
- వెనుకవైపు ఏడో అంతస్తులో సచివాలయ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. నిత్యం తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగానికి చెందిన 300 మంది రెండు షిఫ్టుల్లో పని చేస్తారు. అన్ని కలెక్టరేట్లు, ప్రధాన పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో సచివాలయం అనుసంధానమై ఉంటుంది.
- సహజ సిద్ధమైన వెలుతురు ధారాళంగా వచ్చేలా కిటికీలు, పోర్టికోలు డిజైన్ చేశారు. నీళ్లు, కరెంటు పొదుపునకు వీలుగా నిర్మించినందున 'ది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్' ఈ భవనానికి గోల్డ్ రేటింగ్ జారీ చేసింది. ఈ రేటింగ్ ఉన్న సచివాలయ భవనం దేశంలో ఇదొక్కటే.
- త్వరలో సచివాలయ పార్కింగ్ కేంద్రాల రూఫ్‌టాప్‌పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నారు.



సచివాలయం ప్రధాన ద్వారం



సచివాలయ ఉద్యోగులు పనిచేసే చోటు

1.58-2.04 గంటల మధ్య కొలువుదీరాలి

- ఆ సమయంలో ఏదో ఒక ఫైల్‌పై సంతకం చేయాలి
- మంత్రులు, అధికారులకు రాష్ట్ర సర్కారు ఆదేశం
- 30న కొత్త సచివాలయం ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- నోటరీ భూముల క్రమబద్ధీకరణ ఫైల్‌పై సీఎం తొలి సంతకం

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ నెల 30న ఉదయం 6 గంటలకు సూర్యోదయం వేళ సుదర్శన యాగం నిర్వహించడం ద్వారా కొత్త సచివాలయంలో కార్యకలాపాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. మధ్యాహ్నం 1.20 -1.30 గంటల మధ్య పూర్ణాహుతితో యాగం ముగియనుంది. అనంతరం సీఎం కేసీఆర్ కొత్త సచివాలయాన్ని ప్రారంభించనున్నారు. ఆ వెంటనే ఆయన 6వ అంతస్తులోని తన చాంబర్లో కొలువుదీరనున్నారు. హైదరాబాద్‌లో నోటరీ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేయనున్నారు. కాగా మధ్యాహ్నం 1.58 - 2.04 గంటల మధ్య రాష్ట్ర మంత్రులు, సచివాలయ అధికారులందరూ తమ చాంబర్లు/కుర్చీల్లో కొలువుదీరి ఏదైనా ఫైల్‌పై సంతకం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. మధ్యాహ్నం 2.15-2.45 గంటల మధ్య సచివాలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్ పర్సన్లు, మేయర్లు, కార్పొరేషన్ల చైర్మన్లను ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది.

ఏ ఫ్లోర్‌లో ఏ శాఖ?

గ్రౌండ్ ఫ్లోర్‌లో సాంఘిక సంక్షేమ, మైనారిటీల సంక్షేమం, రెవెన్యూ, రెవెన్యూ (విపత్తుల నిర్వహణ), కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాలు.. మొదటి అంతస్తులో హోం, విద్య, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి.. రెండో అంతస్తులో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, ఇంధన, పశుసంవర్థక, పాడి అభివృద్ధి, మత్స్య, ఆర్థిక శాఖలుంటాయి. మూడో అంతస్తులో గిరిజన సంక్షేమం, పురపాలక, పట్టణాభివృద్ధి, ప్రణాళిక, ఐటీ అండ్ సీ, వ్యవసాయ, సహకార, స్త్రీ, శిశు, వయోజనుల సంక్షేమ శాఖలు.. నాలుగో అంతస్తులో పౌరసరఫరాలు, యువజన సంక్షేమ, పర్యాటక, సాంస్కృతిక, వెనకబడిన తరగతుల సంక్షేమం, పర్యావరణ, అటవీ, నీటిపారుదల, న్యాయశాఖలు ఉంటాయి. ఇక ఐదో అంతస్తును రోడ్లు, భవనాలు, సాధారణ పరిపాలన శాఖలకు కేటాయించారు.

ఆరో అంతస్తులో సీఎంవో, సీఎస్

బీఆర్‌కేఆర్ భవన్ నుంచి కొత్త భవన సముదాయానికి ప్రభుత్వ శాఖల కార్యాలయాల తరలింపు ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఆరు అంతస్తుల సచివాలయ భవన సముదాయంలోని తొలి ఐదు అంతస్తుల్లో మొత్తం 32 ప్రభుత్వ శాఖలు కొలువు తీరనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కేటాయింపు పూర్తి చేసింది. 6వ అంతస్తులో ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాలు ఉండనున్నాయి.

వసూళ్ల చిట్టా ఉంది.. జాగ్రత్త!

దళితబంధు నా ఆత్మబంధువు.. అవినీతికి పాల్పడితే అడ్డంగా నరికేస్తా!

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ''దళితబంధు పథకం నా ఆత్మ బంధువు. దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఈ పథకంపై చర్చ జరుగుతోంది. ఈ పథకం ద్వారా బాగుపడిన కుటుంబాల విజయగాథలతో మరింత మంది స్ఫూర్తి పొందాలి. దీనిని పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదే. ఎవరైనా ఒక్క రూపాయి కమీషన్, వాటా, ఇతర రూపంలో తీసుకున్నట్టు తెలిసినా అడ్డంగా నరికేస్తా..'' అని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు హెచ్చరించారు. దళితబంధు సామాజిక పెట్టుబడి అని, దళితుల్లో వజ్రాలను వెలికి తీస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర బడ్జెట్ రూ.6 లక్షల కోట్లకు చేరుతుందని, ఎన్ని కష్టాలొచ్చినా దళితబంధును కొనసాగిస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. మంత్రులు, పార్టీ ఎమ్మెల్యే,లు ఎమ్మెల్సీలు, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ జిల్లా అధ్యక్షులకు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఎన్నికలకు నాలుగు నెలలే..

''తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో 63, 2018లో 88 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించాం. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వందకుపైగా సీట్లు గెలుస్తాం. 2018 డిసెంబర్ తొలి వారంలో ఓట్ల లెక్కింపు జరిగి రెండోసారి అధికారంలోకి వచ్చాం. ఈ ఏడాది నవంబర్‌లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ చివరిలో లేదా అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే చాన్స్ ఉంది. అంటే ఎన్నికలకు కేవలం నాలుగు నెలల సమయమే ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు తమ కార్యాచరణ రూపొందించుకోవాలి. జాగ్రత్తగా లేకపోతే మీకే నష్టం.

జనంతో మమేకం కావాల్సిందే..

నియోజకవర్గాల్లో పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేసేందుకు ఇద్దరేసి చొప్పున నాయకులకు బాధ్యతలు అప్పగిస్తాం. పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు ఇన్‌చార్జులుగా బాధ్యతలు తీసుకోవాలి. పల్లె నిద్ర వంటి కార్యక్రమాలతో జనంతో మమేకం కావడంతోపాటు కేడర్‌లో అసంతృప్తిని తగ్గించే చర్యలు చేపట్టాలి. నిత్యం ప్రజలతో ఉంటూ.. ప్రభుత్వ పథకాల ప్రచారం, ప్రజలతో కమ్యూనికేషన్ పెంచుకునేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలి. దాహమైనప్పుడే బావి తవ్వుదామనే ధోరణి ప్రస్తుత రాజకీయాలకు సరిపోదు. ఎవరినో ఒకరిని ఎన్నుకోవాలనే ధోరణితో కాకుండా కచ్చితంగా మననే ఎన్నుకోవాలనే రీతిలో పనిచేయాలి. మన ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావడమనేది పెద్ద టాస్క్ కాదు.. మునుపటికంటే ఎక్కువ సీట్లు రావాలన్నదే ప్రాధాన్యతాంశం. త్వరలో ఒక్కో ఎమ్మెల్యేతోవ్యక్తిగతంగా మాట్లాడుతా.

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌కు ఆదరణ

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌కు ఆదరణ వస్తోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశవ్యాప్త పర్యటనలు ముమ్మరం చేస్తా. టీఆర్‌ఎస్‌గా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నిజం చేస్తూ ఎదిగిన పార్టీ.. నేడు దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే దిశలో జాతీయ పార్టీ బీఆర్‌ఎస్‌గా ఎదిగింది. రాజకీయ పంథాలో తక్కువ నష్టాలతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పార్లమెంటరీ పంథాలో ఏదైనా సాధించవచ్చని స్వరాష్ట్ర సాధనతో దేశానికి తెలియజేశాం. అదే బాటలో ''అబ్ కి బార్ కిసాన్ సర్కార్'' నినాదంతో దేశాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు ముందుకు సాగుతున్నాం. మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువ. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి విజన్ లేదు. మనం అమలు చేస్తున్న పథకాలను అక్కడ అమలు చేస్తే దివాలా తీస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం అంటోంది. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రగతిని చూసేందుకు మహారాష్ట్ర వాళ్లు సొంత వాహనాల్లో తరలివస్తున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

డబుల్ బెడ్రూం ఇళ్లు, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం, దళితబంధు, పోడు భూముల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసుకోండి. 58, 59 జీవోలతో స్థలాల క్రమబద్ధీకరణ మంచి పథకం. హైదరాబాద్‌లో నోటరీ భూముల క్రమబద్ధీకరణ ఫైలుపై కొత్త సెక్రటేరియట్‌లో సంతకం చేస్తా. గతంలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూములు సేకరించాం. అలా ప్రభుత్వ భూముల లభ్యత ఉన్న చోట లేఔట్లు చేసి.. పట్టాలు పంపిణీ చేసేందుకు సర్వే నంబర్ల వారీగా వివరాలు ఇవ్వండి. అకాల వర్షాలు రాకముందే పంట కోతలు పూర్తయ్యేలా వ్యవసాయశాఖ రైతులను చైతన్యం చేయాలి. మక్కలు, జొన్నలు అన్ని పంటలు కూడా గతంలో మాదిరి కొనేందుకు మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలిస్తాం..'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

పార్టీ ఖాతాలో రూ.1,250 కోట్లు

విరాళాల ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఫండ్ రూ.1,250 కోట్లకు చేరింది. ఇందులో రూ.767 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. దానిపై వస్తున్న వడ్డీలో నుంచి రూ.7 కోట్లను పార్టీ కార్యకలాపాల నిర్వహణ, కార్యాలయాల నిర్మాణం, ప్రచారం, మౌలిక వసతుల కల్పన కోసం ఉపయోగిస్తున్నాం. బీఆర్‌ఎస్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ నిధులతో టీవీ ప్రచార ప్రకటనలు, ఫిలిం ప్రొడక్షన్‌తోపాటు అవసరమైతే జాతీయ టీవీ చానల్‌ను కూడా నడపొచ్చు. ఇతర రాష్ట్రాల్లోనూ బీఆర్‌ఎస్ పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు వీలుగా పార్టీ జాతీయ అధ్యక్షుడికి అధికారాలు అప్పగిస్తూ బీఆర్‌ఎస్ కార్యవర్గం తీర్మానించింది.

మే 4న ఢిల్లీలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

రాబోయే నెలపాటు అధికారిక కార్యక్రమాలు ఉంటాయి. ఈ నెల 30న రాష్ట్ర సచివాలయం, మే 4న ఢిల్లీలో నిర్మిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తాం. జూన్ 1న హుస్సేన్‌సాగర్ తీరాన అమరుల స్మారకాన్ని ఆవిష్కరిస్తాం. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలు జరుగుతాయి. ఆ తర్వాత ఎన్నికల దిశగా పార్టీ కార్యకలాపాలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలి. చాలాచోట్ల పార్టీ పరిస్థితి బాగానే ఉన్నా.. ఎమ్మెల్యేలు తమ పనితీరును సరిచేసుకోవాలి. ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణపై మరింత దృష్టి పెట్టాలి. ఎక్కడైనా విభేదాలు ఉంటే.. మెట్టు దిగి సర్దుకుపోయి పార్టీ ప్రతిష్టను పెంచాలి. బీజేపీ గ్రాఫ్ గతంతో పోలిస్తే బాగా పడిపోయింది. వారికి ఓట్లు ఏడెనిమిది శాతం కూడా మించవు. అర్థ రహిత రాజకీయ విమర్శలకు స్పందించి సమయం వృథా చేసుకోవద్దు. కొన్ని జిల్లా కలెక్టరేట్ల ప్రారంభంతోపాటు పార్టీ జిల్లా కార్యాలయాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. వరంగల్, హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది.

తెలంగాణ ఔన్నత్యం.. పాలన వేగం

- దేశం ముందు సగర్వంగా నిలిచేలా కొత్త సచివాలయం
- రాత్రీపగలూ కష్టపడి 26 నెలల్లో పూర్తి చేశాం
- మంత్రులు, కార్యదర్శులు, శాఖల అధికారులంతా ఒక్కచోటే..
- వేముల ప్రశాంత్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిన తెలంగాణ ఔన్నత్యాన్ని దేశం ముందు సగర్వంగా నిలిపేలా.. ప్రజలకు పాలన అత్యంత వేగంగా అందేలా.. ఆధునిక సచివాలయ భవనాన్ని అందుబాటులోకి తెస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక్కో కార్యాలయం ఒక్కోచోట ఉండి ఫైళ్లు కదిలేందుకు రోజుల సమయం పట్టే పరిస్థితిని మార్చుతున్నామని చెప్పారు. వాన నీళ్లు కారుతూ, ఎప్పుడు కూలుతాయో తెలియని భవనాల స్థానంలో.. మంత్రులు, కార్యదర్శులు, ఇతర అధికారులు అంతా ఒకేచోట ఉండేలా సమీకృత సచివాలయం ప్రజల ముంగిటికి వస్తోందన్నారు. కొత్త సచివాలయం నిర్మాణ ఆలోచన మొదలు.. ప్రారంభోత్సవం దాకా కీలకంగా వ్యవహరించిన ప్రశాంత్‌రెడ్డి గురువారం రాత్రి 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే..

''ప్రగతిపథంలో దూసుకుపోతున్న తెలంగాణ దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచింది. అన్ని రాష్ట్రాలు మనవైపు చూస్తున్న తరుణంలో తెలంగాణ స్థాయికి తగ్గ సచివాలయ భవనం అవసరమని సీఎం కేసీఆర్ భావించారు. అసౌకర్యాలతో ఉన్న పాత సచివాలయ భవనాలు, మంత్రి ఓచోట, అధికారులు ఓచోట ఉండే అస్తవ్యస్థ పరిస్థితిని సరిదిద్దే ఆలోచన చేశారు. సచివాలయ భవనం ఎలా ఉండాలనే ప్లాన్ అంతా సీఎందే. ఆయన సూచనల మేరకే భవనం ఇంత అద్భుతంగా సిద్ధమైంది. రాత్రింబవళ్లు కష్టపడి కేవలం 26 నెలల్లో దీనిని సిద్ధం చేశాం. పునాది రాయి వేసిన రోజే.. భవనానికి అవసరమైన సామగ్రి అంతటికి వెంటనే ఆర్డర్ ఇచ్చి సమకూర్చుకోవాలని.. అన్ని పనులను ఒకే ఏజెన్సీ ద్వారా చేయాలని కేసీఆర్ సూచించారు. దీనితో నిర్మాణంలో జాప్యం లేకుండా 26 నెలల్లో పూర్తయింది. లేకుంటే ఐదేళ్లకంటే ఎక్కువ కాలం పట్టేది.

విమర్శలను పట్టించుకోం

ఉన్న భవనాలను కూల్చికట్టారని, అనవసరంగా భారీ వ్యయం చేశారని, గుమ్మటాల నిర్మాణ శైలిని అనుసరించారని.. ఇలాంటి విమర్శలను పట్టించుకోం. ప్రజలకు పాలన ఫలితాలు వెంటనే అందేందుకు, తెలంగాణ ఔన్నత్యం ఇనుమడింపచేసేందుకు కొత్త సచివాలయం నిర్మించాం. దీనికి అయిన ఖర్చుతో పోల్చుకుంటే కొన్ని వందల రెట్లు ప్రజలకు మేలు జరగబోతోంది.

అంబేడ్కర్‌కు, అమరవీరులకు మధ్య..

ఇటీవలే ఆకాశమంత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ ఆవిర్భావం కోసం అమరులైన వీరులకు గుర్తుగా స్మారకాన్ని నిర్మించుకున్నాం. దాన్ని జూన్ 2న ప్రారంభించనున్నాం. ఈ రెండింటికీ మధ్య కొత్త రాష్ట్ర ప్రధాన పాలనా భవనాన్ని నిర్మించుకున్నాం. ఈ నెల 30న ప్రారంభించుకోబోతున్నాం.

ఇక ఆస్పత్రులపై దృష్టి..

సచివాలయ భవనం ప్రారంభమయ్యాక.. ఆస్పత్రులపై దృష్టి పెట్టబోతున్నాం. త్వరలో 24 అంతస్తులతో అతి గొప్పగా, దేశం మొత్తం మనవైపు చూసేస్థాయిలో వరంగల్‌లో ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించుకోనున్నాం. దానితోపాటు హైదరాబాద్ నలుదిక్కులా కొత్త మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను సిద్ధం చేసుకుంటాం. కేసీఆర్ మొదటి టర్మ్ పాలనలో సాగు, తాగునీరు, కరెంటు లక్ష్యంగా ప్రణాళికలు అమలయ్యాయి. రెండో విడతలో విద్య, వైద్యం లక్ష్యాలుగా పాలన సాగుతోంది.

రీజనల్ రింగురోడ్డు విషయంలో కేంద్రం పేచీ

ఆర్‌ఆర్‌ఆర్‌ను పట్టాలెక్కించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ కావాలనే కేంద్రం పేచీ ధోరణితో వ్యవహరిస్తోంది. భూసేకరణ కాకుండానే 50% రాష్ట్ర వాటా డబ్బు కట్టాలని వింత వాదనకు దిగింది. ఏ ప్రాజెక్టులోనూ అలా ఉండదు. అయినా మంచి ప్రాజెక్టు విషయంలో కేంద్రంతో పేచీ వద్దని, అవార్డ్ పాస్ చేయకుండానే రూ.100 కోట్లు చెల్లించాలని సీఎం చెప్పడంతో నిధులు విడుదల చేశాం. ఆర్‌ఆర్‌ఆర్‌ను వేగంగా చేపట్టేందుకు కట్టుబడి ఉన్నాం'' అని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్, జేడీఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే

కర్ణాటక ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల్లో ఓటుకు రూ.10 వేలు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ పంపిన డబ్బులతోనే కాంగ్రెస్ ఎన్నికల్లో పంపిణీకి సిద్ధమైందని నిందించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం గౌరీబిదనూరు, బాగేపల్లి నియోజకవర్గాల్లో సంజయ్ పర్యటించారు. బాగేపల్లిలో పార్టీ జాతీయ కార్యదర్శి సీటీ రవి, అసెంబ్లీ అభ్యర్థి మునిరాజుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న బండి సంజయ్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం అక్కడి మీడియాతోనూ మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్, జేడీఎస్‌లు కలిసే పనిచేస్తున్నాయని, ఆ పార్టీలకు ఓట్లేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని వ్యాఖ్యానించారు. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తగ్గించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముస్లిం రిజర్వేషన్లను పెంచే కుట్ర జరుగుతోందన్నారు. 'కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటుకు రూ.10 వేల పంచేందుకు సిద్ధమైంది. ఆ పైసలన్నీ తెలంగాణ సీఎం కేసీఆర్ పంపినవే. వాటిని పంచేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమైనరు. ఒక్క పైసా తక్కువిచ్చినా ఊరుకోకండి. ఎన్నికల్లో మాత్రం బీజేపీకి ఓట్లేసి కాంగ్రెస్‌ను ఖతం చేయండి. కేసీఆర్ మహా తెలివైన వాడు. మొన్నటిదాకా జేడీఎస్ కు పైసలిచ్చిండు. ఆ పార్టీ అధికారంలోకి రాదని తెలిసే సరికి కాంగ్రెస్ పంచన చేరిండు. కుమారస్వామి ఫోన్ చేసినా ఎత్తడం లేదట. కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తున్నడు. 'అని బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.

క్లుప్తంగా...

కర్ణాటకలో బీజేపీదే గెలుపు

'సాక్షి'తో ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించి గద్దెనెక్కడం ఖాయమని ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తంచేశారు. ఆ ప్రభావం తప్పకుండా తెలంగాణ ఎన్నికలపైనా ఉంటుందని, దక్షిణాదిలో పార్టీ విస్తరణకు కన్నడనాట విజయం నాంది అవుతుందన్నారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ అక్కడున్న ఎన్నికల వాతావరణం, ప్రచారం సాగుతున్న తీరు చూస్తుంటే బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని తేలిపోయిందన్నారు. తాను పార్టీ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బళ్లారి జిల్లా హోస్పేటలో వచ్చే నెల 2న మోదీ పాల్గొనే సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

గాంధీభవన్‌లో ఫ్రెండ్లీ పాలిటిక్స్ కరువయ్యాయి

ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో ఫ్రెండ్లీ పాలిటిక్స్ కరువయ్యాయని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఎవరిని ఎలా వాడుకోవాలో ఇప్పుడున్న ఇన్‌చార్జీలకు తెలియకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. '2017లో రాహుల్ సభ సంగారెడ్డిలో నిర్వహించా. ఆ సభ ఖర్చంతా నాదే. ఆ గుర్తింపు ఎక్కడకి పోయిందో తెలియదు. భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ సంగారెడ్డిలో 25 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఉదయం 5 గంటలకే భారీ ఎత్తున ఆయనకి స్వాగతం పలికాం. ఆ ఖర్చూ నాదే. స్వయంగా రాహుల్ నన్ను పిలిచి చాలా బాగా చేశావని అభినందించారు' అని గుర్తు చేశారు. ఇప్పుడున్న ఇన్‌చార్జిలకు ఎవరిని ఎలా వాడుకోవాలో తెలియదంటూనే తానెవరి పేర్లు తీసుకోదలుచుకోలేదని పేర్కొన్నారు. గతంలో ఉన్న ఫ్రెండ్లీ పాలిటిక్స్ ఇప్పుడు లేవని స్పష్టం చేశారు. 'ఇదంతా మీడియాకి చెప్పడానికి కారణం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ఓటర్లకు సమాచారం ఉండాలనే' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఐటీ విభాగం పాత్రపై సిట్ దర్యాప్తు ఎంతవరకు వచ్చింది

గవర్నర్‌కు వైఎస్సార్‌టీపీ లేఖ


సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ స్కాంలో ఐటీ విభాగం పాత్రపై సిట్ దర్యాప్తు ఎంత వరకు వచ్చిందో నివేదిక కోరాలంటూ వైఎస్ఆర్‌టీపీ గవర్నర్ తమిళిసైకి బహిరంగ లేఖ రాసింది. తెలంగాణ సర్కారు విభాగాలన్నిటి ఐటీ అవసరాలను చూసుకునే ఐటీ శాఖలో కొందరు వ్యక్తులు కచ్చితంగా ఈ నేరంలో నిందితులకు సహకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆ లేఖలో పేర్కొంది. ఇలాంటి తరుణంలో ఐటీ శాఖ మీద విచారణ ఎందుకు జరగడం లేదని ఆ పార్టీ ధ్వజమెత్తింది. ఆ శాఖ ముఖ్యమంత్రి కుమారుడి నిర్వహణలో ఉన్నందున విచారణకు సిట్ ధైర్యం చెయ్యట్లేదని ఆరోపించింది. సిట్ ఈ శాఖ జోలికి వెళ్లనే వెళ్లదని, పెద్ద తలలు బయటపడతాయన్న భయంతో పోలీసులు ఈ దిశగా విచారణ చేయకపోతే కేసు కొలిక్కి రాదని తెలిపింది.

సేవలో ఆర్యవైశ్యులే ప్రథమం



సాక్షి, హైదరాబాద్: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆర్యవైశ్యులు ముందుంటారని మాజీ ఎంపీ, ఐవీఎఫ్ చీఫ్ అడ్వయిజర్ టీజీ వెంకటేశ్ అన్నారు. హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) నూతన కార్యాలయాన్ని గురువారం ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, కేంద్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గంజి రాజమౌళి గుప్త, మాజీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తతో కలిసి టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. అనంతరం ఐవీఎఫ్ బెనారస్ ఆనంద నిలయం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

21,619 ప్రమాదాలు.. 7,559 మరణాలు: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ ఇతర ఘటనలతో పోల్చినా రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్యే అధికంగా ఉందని డీజీపీ అంజనీకుమార్ తెలి పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడమే మార్గమని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రహదారుల భద్రతా చర్యలపై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిరోడ్లలో కలిపి 2022లో 21,619 ప్రమాదాల్లో 7,559 మంది మరణించారని డీజీపీ వెల్లడించారు. మొత్తం ప్రమాదాలలో ద్విచక్ర వాహనాల వల్లే 53 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

దేశంలో మార్పు దిశగా ఉద్యమించాల్సిందే

తెలంగాణ మోడల్ అమలుకు సమయం ఆసన్నమైంది: కేటీఆర్

- స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా తాగు, సాగునీటి కోసం కొట్లాటలే..
- భారీ రిజర్వాయర్లతో నీటి సమస్యను తీర్చుకోవచ్చు
- ఆ దిశగా బీఆర్ఎస్ పురోగమించాలని పిలుపు
- పార్టీ ప్లీనరీలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్



పార్టీ ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో కేసీఆర్, పోచారం, గుత్తా, కేకే తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్య పాలన వచ్చి 75 ఏళ్లయినా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు బాధపడే పరిస్థితి ఉందని.. దీన్ని మార్చాల్సిన అవసరం ఉందని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పేర్కొన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ప్రతినిధుల సభ జరిగింది. ఇందులో కేటీఆర్ 'దేశంలో గుణాత్మక మార్పు సాధించే దిశగా బీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తితో పురోగమించాలి' అనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ప్రసంగించారు. కేటీఆర్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''మౌలిక వసతుల కొరతతో దేశ ప్రగతి మందగిస్తోంది. దేశాభివృద్ధికి చోదకశక్తిగా నిలవాల్సిన యువత ఉద్యోగ అవకాశాల్లేక నిరాశతో కొట్టుమిట్టాడుతోంది. సమాజంలో నేటికీ కుల, మత, లింగ వివక్ష కొనసాగుతున్నాయి. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉపాధి లేక మగ్గిపోతున్నారు. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దిగజారుస్తున్న ఈ వైఖరి ఆమోదయోగ్యం కాదు. దేశంలో అపారమైన సహజ వనరులున్నా అందిపుచ్చుకోవడంలో పాలకుల వైఫల్యంతో ప్రజలు దుర్భర పేదరికాన్ని అనుభవిస్తున్నారు.

నీటి కోసం ఇంకా కొట్లాటలే..

దేశంలో జల వనరుల లభ్యత ప్రజల అవసరాలకు మించి ఉంది. ఏటా లక్షా 40 వేల టీఎంసీల వర్షపాతం కురుస్తోంది. నదుల్లో 70 వేల టీఎంసీల నీరు ప్రవహిస్తోంది. కానీ దేశవ్యాప్తంగా వినియోగంలోకి తెచ్చుకున్న నీళ్లు 20 వేల టీఎంసీలే. మిగతా 50 వేల టీఎంసీలు వృథాగా సముద్రం పాలవుతున్నాయి. ఇందులో 20 వేల టీఎంసీలను వాడుకోగలిగితే.. దేశంలో సాగుయోగ్యమైన 41 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఇప్పటికీ నదుల నీళ్ల కోసం రాష్ట్రాల మధ్య తెగని పంచాయితీలు కొనసాగుతున్నాయి.

భారీ ప్రాజెక్టులు లేవు.. విద్యుత్ లేదు..

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు మాత్రమే దేశ నిర్మాణం కోసం బలమైన అడుగులు పడ్డాయి. భాక్రానంగల్, నాగార్జునసాగర్ వంటి భారీ ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. కానీ ఆ తర్వాతి ప్రభుత్వాల నిష్క్రియా పరత్వంతో దేశ ప్రజలు శాపగ్రస్త జీవితం గడుపుతున్నారు. భారత్ కన్నా విస్తీర్ణంలో, జనాభాలో చిన్నవైన దేశాలు కూడా వేల టీఎంసీల సామర్థ్యమున్న పెద్ద పెద్ద రిజర్వాయర్లు నిర్మించుకున్నాయి. తెలంగాణ మినహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు, సాగునీరు, విద్యుత్ లేక బాధలు అనుభవిస్తున్నారు. మన దేశంలో అందుబాటులో ఉన్న 361 బిలియన్ టన్నుల బొగ్గును హైబ్రిడ్ పద్ధతిలో వాడినట్లయితే దేశ ప్రజలందరికీ, అన్నిరంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను 150 ఏళ్లపాటు ఇవ్వొచ్చు. వ్యవసాయ రంగంలో నెలకొన్న కరెంటు సంక్షోభాన్ని సునాయాసంగా పరిష్కరించుకోవచ్చు.

మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయి

దేశంలో మతోన్మాదశక్తులు విజృంభిస్తే అంతర్గత ఐక్యత విచ్ఛిన్నమైపోతుంది. దేశం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పతనమవుతుంది. బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. ప్రజల దృష్టి మళ్లించడం కోసం ఉద్రిక్తతలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనే దుర్మార్గ ఎత్తుగడ సాగుతోంది. ఈ పరిస్థితుల్లో దేశంలో మతోన్మాదశక్తుల పాలన అంతం, తెలంగాణ మోడల్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అప్రతిహతంగా పురోగమించాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

దేశంలోని రైతుకు బాసటగా..

తెలంగాణలో రైతుబంధు ద్వారా పంట పెట్టుబడి కోసం ఎకరానికి రూ.10 వేలు అందిస్తున్నాం. రైతు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఈ విధానం దేశమంతా కొనసాగాలి. ప్రస్తుతం దేశంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ దేశమంతటా విస్తరించి రైతు రాజ్యాన్ని నెలకొల్పేదిశగా పురోగమించాలని ప్రతినిధుల సభ తీర్మానిస్తోంది. తెలంగాణలో అమలవుతున్న దళితబంధు దేశవ్యాప్తంగా విస్తరిస్తే అస్పృశ్యత తొలగిపోతుంది. రోడ్లు, పోర్టులు, ఇతర వసతులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చెందాలి. ఇవి సాకారం కావాలంటే బీఆర్ఎస్ జాతీయస్థాయిలో పురోగమించాలి.

నేడు నల్లగొండలో నిరుద్యోగ నిరసన సభ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: టీపీసీసీ ఆధ్వర్యంలో 28వ తేదీన నల్లగొండలో నిరుద్యోగ నిరసన సభ నిర్వహించనున్నారు. సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 గంటలకు చౌటుప్పల్‌లో రేవంత్‌రెడ్డికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు స్వాగతం పలకనున్నాయి. అక్కడినుంచి చిట్యాల, నార్కట్‌పల్లిలో కార్నర్ మీటింగ్‌లు, బైక్ ర్యాలీల్లో పాల్గొంటారు. లీకేజీతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులతో సాయంత్రం 4 గంటలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ గేట్ వద్ద భేటీ కానున్నారు. 5 గంటలకు మర్రిగూడ బైపాస్‌కు చేరుకొని అక్కడి నుంచి నల్లగొండ క్లాక్‌టవర్ వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు క్లాక్ టవర్ వద్ద నిర్వహించే బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి, ముఖ్య నేతలు ప్రసంగిస్తారు.

ఆర్టిజన్లకు వేతన సవరణ...

- 7 శాతం ఫిట్‌మెంట్ ప్రకటన
- పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు సైతం వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ట్రాన్స్‌కో

ఆర్టిజన్లు	ప్రస్తుత స్థూల వేతనం	ఎంతకు పెరుగుతుంది
గ్రేడ్-1	36,731	50,850
గ్రేడ్-2	31,200	41,581
గ్రేడ్-3	27,215	35,373
గ్రేడ్-4	24,731	31,545

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల ఆర్టిజన్లతో పాటు పెన్షనర్లు/ఫ్యామిలీ పెన్షనర్లకు 7 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణను ప్రకటిస్తూ తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఆర్టిజన్ల వేతన సవరణ, పెన్షన్ల పెంపుదలను వర్తింపజేస్తామని తెలిపారు. ఈ మేరకు పెన్షన్ బకాయిలను మే నుంచి నాలుగు సమాన వాయిదాల్లో పెన్షనర్లకు చెల్లించనున్నారు. ఆర్టిజన్లకు రెండు సర్వీసు వెయిటేజీ ఇంక్రిమెంట్ల అమలుతో పాటు వేతన స్థిరీకరణ, 2023 జనవరి 1 నుంచి 5.896 శాతం డీఏ, రూ.1,350 మెడికల్ అలవెన్స్, కార్పొరేట్ అలవెన్స్ కొనసాగింపు, రూ.1,000 కన్వేయన్స్ అలవెన్స్, గ్రామీణ ప్రాంత గ్రేడ్-3,4 ఆర్టిజన్లకు రూ.500 స్పెషల్ అలవెన్సులు జారీ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఆర్టిజన్ల హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ అలవెన్స్‌లపై ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఆర్టిజన్లకు ప్రస్తుతం 30 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు చేస్తుండగా, దీనిని 24 శాతానికి తగ్గిస్తూ త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. దీంతో జీతాలు 6 శాతం తగ్గే అవకాశం ఉంది. జెన్‌కోలో పనిచేసే ఆర్టిజన్లకు జనరేషన్ అలవెన్స్, కోల్ అలవెన్స్, షిఫ్ట్ అలవెన్స్, పీఎల్ఎఫ్ అలవెన్సులు అదనంగా చెల్లిస్తుండడంతో వారికి ఆ మేరకు అదనపు వేతనాలు లభించనున్నాయి. గ్రేడ్-1, 2, 3, 4 అనే నాలుగు కేటగిరీల ఆర్టిజన్ ఉద్యోగులుండగా, కొత్త పీఆర్సీ అమలుతో పెరగనున్న స్థూల వేతనాలు (గ్రాస్ శాలరీ) స్వల్ప తేడాలతో కింది విధంగా ఉండొచ్చునని ఉద్యోగ సంఘాలు అంచనా వేశాయి.

మోదీని నిలదీసినందుకే రాహుల్‌పై కక్ష

- ఎంపీగా అనర్హత వేటేశారు..
- రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షురాలు మీనాక్షి నటరాజన్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: జాతి సంపదను అదానీ వంటి పెట్టుబడిదారులకు దోచిపెడుతున్న ప్రధాని మోదీని నిలదీసినందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కక్షగట్టి ఎంపీ పదవి నుంచి తప్పించారని మాజీ ఎంపీ, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ అధ్యక్షురాలు మీనాక్షి నటరాజన్ ధ్వజమెత్తారు. దేశ సంపద ఆవిరైపోతుంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని రాహుల్ డిమాండ్ చేయడం మోదీకి నచ్చలేదని, అందుకే పార్లమెంటుకు రాకుండా చేశారని విమర్శించారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ప్రజలపక్షాన పోరాడుతున్న వ్యక్తిని కేంద్రం వేధిస్తోందని... ఈ నేపథ్యంలో ప్రజలు రాహుల్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావిద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ విషయంలో మోదీ, అమిత్‌షాలు చేస్తున్న రాజకీయ కుట్రలపై కాంగ్రెస్ దేశవ్యాప్తంగా శాంతియుత పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. నటరాజన్ పోరాటానికి సంపూర్ణ మద్దతిస్తూ పోస్టు కార్డులను పోస్టు చేశారు. దీక్షా కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రసంగించారు. రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ సిద్ధేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో పీసీసీ మాజీ చీఫ్ వి. హనుమంతరావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, టీపీసీసీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు నూతి శ్రీకాంత్, సునీతారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బండికి ఊరట

పోలీసులు వేసిన పిటిషన్‌ను కొట్టివేసిన కోర్టు

వరంగల్ లీగల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి టెన్త్ హిందీ పేపర్ లీకేజీ కేసులో లభించిన బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హనుమకొండ నాల్గవ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి మట్ట సరిత కొట్టివేశారు. సంజయ్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 17న పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను జడ్జి విచారించి సంజయ్‌కి జారీ చేసిన నోటీసులు సహేతుకంగా లేవ న్నారు. సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని, ఆయన విచారణ కు సహకరించడం లేదనే పోలీసుల వాదనలకు సాక్ష్యాధారాలు చూపించలేకపోయారన్నారు. సంజయ్ సెల్‌ఫోన్ ద్వారా అదనపు సమాచారం సేకరించే అవకాశముందని చెప్పి న పోలీసులు, అదే సమాచారాన్ని కేసులోని నిందితుల సెల్ ఫోన్ల ద్వారా కూడా రాబట్టుకునే అవకాశం ఉంటుందన్నారు.

ప్రజల సొమ్ము దోచుకుంటున్న కల్వకుంట్ల కుటుంబం..

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శలు..



వేలేరు మండల కేంద్రంలో ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి

కాజీపేట: ప్రజల ఆకాంక్షను గౌరవించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే, నాలుగు కోట్ల ప్రజలకు చెందాల్సిన సంపాదన కేసీఆర్ కుటుంబంలోని నలుగురికే దక్కుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కోరారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర గురువారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామం నుంచి ప్రారంభమై వేలేరు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల పేరుతో కల్వకుంట్ల కుటుంబమే ప్రభుత్వ నిధులను దోపిడీ చేస్తూ ధనికరాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం పేరుతో దేశంలో ఎక్కడాలేని దోపిడీకి సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా తెరలేపారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కల్వకుంట్ల దోపిడీ తతంగంపై సమగ్రమైన విచారణ జరిపించి ప్రతిపైసాను వడ్డీతోసహా వసూలు చేస్తామన్నారు. 'కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు లేవు, నీళ్ల రావడం లేదు, ఆరోగ్యశ్రీ లేదు, ఇళ్లులేవు, రేషన్ కార్డుల మంజూరులేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చేలా చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రజలు స్పష్టం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రూ.500లకు గ్యాస్, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాలు, రేషన్ దుకాణాల ద్వారా 9 రకాల వస్తువుల పంపిణీ, కూలీబంధు పేరుతో ఏడాదికి రూ.12 వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఇంటింటికీ తిరిగి కార్యకర్తలు ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు.

పథకం ప్రకారమే చంపేశారు..

- కూతురు జీవితాన్ని నాశనం చేశాడని యువతి కుటుంబం కక్ష
- వీడియోలు వైరల్ చేయడంపై మనస్పర్థలు
- మహేశ్‌ను దూరం పెట్టడంతో వేధింపులు
- ఐదుగురి నిందితుల అరెస్టు..
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరేందర్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేందర్, సీఐ రాజు

జైపూర్: కూతురు జీవితాన్ని నాశనం చేసిన మహేశ్‌ను ఎలాగైనా చంపాలని యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పథకం ప్రకారమే అందరూ చూస్తుండగానే కత్తితో నరికి, బండరాళ్లతో కొట్టి హత్యకు పాల్పడ్డారని మంచిర్యాల జిల్లా జైపూర్ ఏసీపీ నరేందర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో ముస్కె మహేశ్ మంగళవారం దారుణహత్యకు గురి కావడం, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. హత్య కేసులో ఇందారం గ్రామానికి చెందిన పెద్దపల్లి కనకయ్య, ఆయన భార్య పద్మ, కూతురు శృతి, కుమారుడు సాయి, చిన్నకూతురు శ్వేతలను గురువారం అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. జైపూర్ ఏసీపీ కార్యాలయంలో శ్రీరాంపూర్ సీఐ రాజుతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. శృతికి ఇందారం గ్రామంలోని నజీర్‌పల్లికి చెందిన ముస్కె మహేశ్ మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2020వరకు ప్రేమలో ఉన్నారు. అతడి ప్రవర్తన నచ్చకపోవడంతో శృతి మాట్లాడడం మానేసింది. అప్పటి నుంచి మహేశ్ గతంలో చనువుగా ఉన్నప్పుడు దిగిన ఫొటోలు ఆమెకు చూపించి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడు. ఈ విషయం తెలిసిన కనకయ్య అతడిని మందలించినా ప్రవర్తనలో మార్పు రాలేదు. గత ఏడాది జూన్ 13న వీడియో రికార్డులను వైరల్ చేసిన మహేశ్‌పై పోలీసు కేసు నమోదైంది. శృతి వీడియోలను చూసి అవమానంతో ఆమె భర్త గత ఏడాది సెప్టెంబర్ 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయంలో సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మహేశ్ రోజూ మోటార్‌సైకిల్‌పై యువతి ఇంటి ముందు నుంచి వెళ్తూ హారన్ కొడుతూ ఇబ్బంది పెట్టడంతో సాయి కట్టెతో కొట్టాడు. దీంతో గత ఏడాది నవంబర్ 9న మహేశ్ ఫిర్యాదు మేరకు సాయిపై కేసు నమోదైంది. ఫిబ్రవరిలో ఇంటికి ముందుకు వచ్చి గేటు తన్ని పారిపోగా కనకయ్య ఫిర్యాదు మేరకు మహేశ్‌పై కేసు నమోదైంది.

వేధింపులు తట్టుకోలేక: ''అతడి వల్ల కూతురు జీవితం నాశనమైందని, ఆమె భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఇంటి ముందుకు వచ్చి రోజూ హారన్ కొడుతూ మానసికంగా వేధించడంతో ఎలాగైనా చంపాలని కనకయ్య, పద్మ, సాయి భావించారు. పది రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కత్తి కొనుగోలు చేశారు. మంగళవారం ఇంటి ముందు నుంచి హారన్ కొడుతూ వెళ్లిన మహేశ్ అదే రోడ్డుపై తిరిగొస్తాడని ఊహించి అడ్డుకుని కత్తితో నరికి, బండరాళ్లతో కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు'' అని ఏసీపీ తెలిపారు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు రెండు పోలీసు బృందాలు విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితులను గురువారం ఉదయం 5.30గంటలకు షెట్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

జైళ్లకు నిందితులు: హత్య కేసులో నిందితులు పెద్దపల్లి కనకయ్య, ఆయన భార్య పద్మ, కుమార్తె శృతి, కుమారుడు సాయి, చిన్నకుమార్తె శ్వేతలను గురువారం చెన్నూర్ సివిల్ కోర్టులో జడ్జి ముందట హాజరుపర్చారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు కనకయ్య, సాయిలను లక్సెట్టిపేట జైలుకు, పద్మ, శృతి, శ్వేతలను ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు ఏసీపీ నరేందర్ తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాల పట్టా గడువు పెంచాలి



సాక్షి, హైదరాబాద్: పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వడానికి జారీ చేసిన జీవో 58, 59 గడువును పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నవారికి పట్టాలివ్వాలని గురువారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. జీవో 58 ప్రకారం గ్రామాల్లో 1.50 లక్షల మంది, జీవో 59 ప్రకారం పట్టణాల్లో 42వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం రాక..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతుల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తమ్మినేని ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌తో ఆత్మీయ అనుబంధం

8వ నిజాం కూతురు జైరీన్ ముఖ్రమ్ జా



మాట్లాడుతున్న ప్రిన్సెస్ జైరీన్ ముఖ్రమ్ జా

గోల్కొండ: తనకు హైదరాబాద్ నగరంతో ఆత్మీయ అనుబంధం ఉందని 8వ నిజాం ముఖ్రమ్ జా కూతురు ప్రిన్సెస్ జైరీన్ ముఖ్రమ్ జా అన్నారు. గురువారం మెహిదీపట్నంలోని రహనుమా ఎ దక్కన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన తల్లి జమీలా బౌలరస్‌తో కలిసి హైదరాబాద్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని వివరించారు. హైదరాబాద్‌ను మొదటిసారిగా తాను సందర్శించానని, అయితే.. తాను టర్కీ దేశంలో ఉన్నా కూడా ఎప్పుడూ హైదరాబాద్ గురించి ఆలోచించేదాన్నని ఆమె పేర్కొన్నారు. నగరంతో తన అనుబంధాన్ని మరింత మధురం చేసేందుకు సాలార్జంగ్ మ్యూజియంలో ఖలీఫ్స్ ఎక్స్‌ట్రా ఆర్డినరీ వాల్ట్ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నానన్నారు. ఈ ప్రదర్శనలో ఇప్పటి వరకు ఎవ్వరికీ తెలియని అసఫ్‌జాహీ వంశానికి చెందిన వస్తువులు, ఆసక్తికరమైన విషయాలతో ఈ ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీల్లో కేవలం రెండు రోజులు మాత్రమే ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అసఫ్‌జాహీ వంశానికి చెందినందుకు ఎంతో గర్వపడుతున్నానని, మరోవైపు టర్కీ రాజవంశానికి చెందిన దానినని, అందువల్లే ఇరుదేశాల సంస్కృతీసంప్రదాయాల పట్ల తనకెంతో గౌరవం ఉందన్నారు. తాను టర్కీ ఖలీఫ్ అబ్దుల్ మేజిద్ -2 మునిమనవరాలిని కావడం కూడా గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆమె పేద విద్యార్థులకు దుస్తులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రహనుమా ఎ దక్కన్ ఫ్యామిలీ హెడ్ సయ్యద్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ నకిలీ టికెట్ల గుట్టురట్టు

ఆరుగురు నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్: నకిలీ ఐపీఎల్ టికెట్లు తయారు చేసి విక్రయించిన కేసులో ఆరుగురు నిందితులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన గోవర్ధన్‌రెడ్డి (నాచారంలో నివాసం ఉంటూ ఇఫోని - ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఏజెన్సీలో సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించి మ్యాన్ పవర్‌ను ఏర్పాటు చేసేందుకు అతను హిమాయత్‌నగర్‌కు అఖిల్ అహ్మద్, మహ్మద్ ఎజాజ్, పార్శిగుట్ట ప్రాంతానికి చెందిన పిఎం వంశీ, బహదూర్‌పురాకు చెందిన మహ్మద్ ఫహీం,చంగిచర్లకు చెందిన శ్రావణ్‌కుమార్ పనిలో పెట్టుకున్నాడు. రెండు మ్యాచ్‌లు ముగిసిన అనంతరం టికెట్ల బార్ కోడ్‌లను పరిశీలించిన వారు వాటిని కాపీ చేసి నకిలీ టికెట్లు ముద్రించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో శాంపిల్‌గా కొన్ని తయారు చేసి విజయం సాధించారు.

పథకం ప్రకారం..

అఖిల్ అహ్మద్ అక్రిడేషన్ బార్‌కోడ్‌ను కాపీ చేసి వాట్సాప్‌లో వంశీకి పంపాడు. అతను చిక్కడపల్లిలో జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్న మహ్మద్ ఫహీంకు చేరవేశాడు. వాటి ఆధారంగా ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించిన నకిలీ టికెట్లను తయారు చేసి వాటిపై బార్ కోడ్‌లను ముద్రించారు. ఈ నెల 18న సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సంబంధించి 200లకు పైగా రూ.1000, రూ.1750, రూ.2500 విలువైన టికెట్లను ముద్రించి విక్రయించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానం వచ్చింది ఇలా..

ఒకే బార్ కోడ్‌తో వందల సార్లు ఎంట్రీలు ఉండటంతో టికెట్ల విక్రయించే పేటీఎం సంస్థ ప్రతినిధులకు అనుమానం వచ్చింది. దీంతో తమ కంప్యూటర్ల స్కానింగ్ మెషిన్లను పరిశీలించి బీసీసీఐ ప్రతినిధులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి కంప్యూటర్, ప్రింటర్, అక్రిడేషన్ కార్డులు, 68 ఫేక్ టికెట్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు.
బహుశా వారే మీకంటే శ్రేష్ఠులు కావచ్చు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 28 ఏప్రిల్ 2023

పరిహాసమైన ప్రజాస్వామ్యం

కంచే చేను మేస్తే? ధర్మం, న్యాయం కాపాడాల్సిన పాలకులే... అధర్మానికి కాపు కాస్తే? మాఫియా డాన్‌ల అడుగులకు మడుగులొత్తితే? పోలీసు, న్యాయవ్యవస్థలు దోషులుగా నిర్ధారించిన వారిని సైతం శిక్షాకాలం పూర్తి కాక ముందే రకరకాల సాకులతో బాహ్యప్రపంచంలోకి వదిలేస్తుంటే ఏమనాలి? ఎవరికి చెప్పాలి? పార్టీలు, పాలకుల మీద ఏవగింపు గలిగే ఇలాంటి చర్యల వరుసలో తాజా ఉదాహరణ – హంతకుడు ఆనంద్ మోహన్ సింగ్‌ను పాలకులు నిస్సిగ్గుగా జైలు నుంచి బయటకొదిలేసిన సంఘటన. ఐఏఎస్ అధికారి జి. కృష్ణయ్యను దారుణంగా చంపి, జైలు ఊచలు లెక్కబెడుతున్న ఈ బడా నేరస్థుడు గురువారం బిహార్‌లోని సహరసా జైలు నుంచి విడుదలైన తీరు నివ్వెరపరుస్తోంది అందుకే. నిరుడు బీజేపీతో బంధం తెంచుకున్నాక ఓట్ల పునాదిని విస్తరించుకొనేందుకు తంటాలు పడుతున్న బిహార్ సీఎం నితీశ్ బలమైన తోమర్ రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఆనంద్‌లో అద్భుతమైన అవకాశాన్ని చూశారని ఆరోపణ వినిపిస్తోంది. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా దోషుల్ని వదిలేసే దిగజారుడు పనిలో పార్టీలన్నీ పోటీ పడుతుండడం ఆగ్రహం రేపుతోంది.

ఐఏఎస్ అధికారి, గోపాల్‌గంజ్ జిల్లా మేజిస్ట్రేట్ అయిన కృష్ణయ్యను 1994లో దారుణంగా హత్య చేశాడీ ఆనంద్ మోహన్. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కృష్ణయ్య 1985 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. దళితుడు. విధినిర్వహణలోని ఆయనను ముజఫర్‌పూర్‌లో ప్రభుత్వ వాహనం నుంచి లాగి, హేయంగా కొట్టి చంపడానికి 1994 డిసెంబర్ 5న అల్లరిమూకను రెచ్చగొట్టింది ఆనంద్ మోహన్. 2007లో ట్రయల్ కోర్ట్ దోషికి మరణశిక్ష విధించింది. ఏడాది తర్వాత పాట్నా హైకోర్ట్ దాన్ని జీవితకాల శిక్షగా తగ్గించింది. ఈ తీర్పును ఆనంద్ సుప్రీమ్‌లో సవాలు చేసినా, ఇప్పటి దాకా కోర్ట్ ఉపశమనమేమీ ఇవ్వలేదు. అలా 2007 నుంచి జైలులో ఉన్న వ్యక్తిపై బిహార్ సర్కార్ ఎక్కడ లేని అక్కర చూపింది. ఈ నెలలోనే 'బిహార్ ప్రిజన్ మ్యాన్యువల్ 2012'లో 481వ రూల్‌ను మార్చింది. 'విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారి హత్యలో దోషి అయిన ఖైదీని విడుదల చేయరాద'న్న నిబంధనను నిర్లజ్జగా తొలగించింది. ఫలితంగా – జైలులో 14 ఏళ్ళు, 20 ఏళ్ళు గడిపిన మరో 27 మంది ఖైదీలతో పాటు ఈ నేరస్థుడికీ అన్యాయంగా స్వేచ్ఛ లభించింది.

పౌర సమాజం నుంచి ప్రతిపక్షాల దాకా అందరూ తీవ్రంగా వ్యతిరేకించినా, నితీశ్ సర్కార్ వెనక్కి తగ్గలేదు. బిహార్‌లో రాజకీయాలకూ, నేరస్థులకూ మధ్య అనాదిగా పొడిచిన పొత్తుకు ఇది ప్రతీక. రాజకీయ నేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్ ఆనంద్ మోహన్ పలుకుబడి సామాన్యమేమీ కాదు. శివ్‌హర్ లోక్‌సభా స్థానంలో గతంలో ఎంపీగా గెలిచాడు. కృష్ణయ్య హత్యతో జైలులో ఉంటేనేం, అతని భార్య లవ్లీ ఆనంద్ ఒకసారి ఎంపీ అయ్యారు. 2010 అసెంబ్లీ, 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల పక్షాన పోటీ చేశారు. వారి కుమారుడు చేతన్ ఆనంద్ ప్రస్తుతం ఎమ్మెల్యే. తల్లీకొడుకులిద్దరూ బిహార్ అధికార సంకీర్ణ కూటమిలో భాగమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) సభ్యులే. కుమారుడి వివాహ నిశ్చితార్థం కోసం ఆనంద్ ఇటీవల 15 రోజులు పెరోల్ మీద బయటే ఉన్నాడు. సదరు నిశ్చితార్థానికి సాక్షాత్తూ బిహార్ సీఎం సహా అధికార కూటమి నేతలందరూ హాజరయ్యారంటే అర్థం చేసుకోవచ్చు. పెరోల్ ముగిసిన ఆనంద్ ఏప్రిల్ 26న జైలుకు చేరాడో లేదో, సర్కార్ సవరించిన నిబంధనల పుణ్యమా అని మర్నాడే బయటకొచ్చేశాడు.

వివిధ రాష్ట్రాల్లోని పాలకుల అవసరానికి తగ్గట్టు నియమ నిబంధనలు మారిపోతున్నాయి. వ్యవస్థలు ప్రభావితమవుతున్నాయి. వెరసి, జైళ్ళలోని దోషుల శిక్షాకాలాన్ని తగ్గించి బయటకు వదిలేస్తున్న లజ్జాకరమైన ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. గత ఆగస్టులో బయటపడ్డ బిల్కిస్ బానో కేసులోని 11 మంది దోషుల నుంచి తాజా ఆనంద్ మోహన్ దాకా అన్ని వ్యవహారాలూ అలాంటివే. బీజేపీ నుంచి జేడీ–యూ దాకా అన్ని పార్టీలూ ఈ తిలా పాపంలో తలా పిడికెడు పంచుకున్నవే. ఓటు రాజకీయాలు, సమర్థకుల సంరక్షణ – ఇలా ఈ విడుదల వెనుక పైకి కనిపించని కారణాలు అనేకం. గద్దె మీది పెద్దల పరోక్ష సాయంతో బయటపడ్డ వీరికి సమర్థకుల నుంచి లభిస్తున్న స్వాగత సత్కారాలు, నీరాజనాలు మరింత ఆందోళన రేపుతున్నాయి. ఆనంద్ విడుదలతో జరిగిన బైక్ ర్యాలీలు, మిఠాయి పంపిణీలూ అచ్చంగా అలాంటివే. రేపిస్టులనూ, హంతకులనూ గౌరవించి, ఆరాధించే సంస్కృతికి అన్ని పార్టీలూ, అనుయాయులూ దిగజారుతున్న తీరు జుగుప్సాకరం. ప్రజాస్వామ్యాన్ని పరిహసించే ఈ ఘటనల్లో వ్యవస్థలు భాగమైపోతూ ఉండడం శోచనీయం.

చేసిన నేరం తాలూకు తీవ్రత, దోషుల వ్యక్తిగత చరిత్రలను బట్టి ఏ కేసుకా కేసు ప్రత్యేకమైనదే. కానీ, అన్నిటినీ ఒకే గాటన కడుతూ, కావాల్సినవారిని కాపాడుకొనే రీతిలో నిర్ణీత కాలవ్యవధి దాటి జైలులో ఉన్నవారందరినీ వదిలేయవచ్చని తీర్మానించడం సబబేనా? అలాంటప్పుడు బాధితులకు సరైన న్యాయం ఏ రకంగా జరిగినట్టు? పశ్చాత్తాపం, పరిణత సత్ప్రవర్తన లాంటివి శిక్షాకాలపు తగ్గింపునకు గీటురాళ్ళు కావాలి. కేవలం జైలులో గడిపిన రోజులే లెక్కలోకి తీసుకుంటే, బాజాప్తాగా బయటకొచ్చిన దోషి రేపు మరో నేరానికి పాల్పడడని నమ్మకం ఏమిటి? బాధిత కుటుంబాల కళ్ళెదుటే నేరస్థులు నిష్పూచీగా తిరుగుతుంటే, చట్టం, న్యాయం పట్ల సామాన్యుడు విశ్వాసం కోల్పోతే ఆ పాపం ఎవరిది? తాత్కాలిక ప్రయోజనాల కోసం హడావిడి పడుతున్న పార్టీలు, ప్రభుత్వాలు ఇవన్నీ లోతైన ప్రభావం చూపే పరిణామాలని ఇకనైనా తెలివిడి తెచ్చుకోవాలి. ఈ దేశంలో చట్టాలన్నీ అధికార బలగానికి చుట్టాలేనన్న భావన బలపడితే ప్రజాస్వామ్యానికే చేటు.

విశ్వ సమానత్వాన్ని తిరస్కరిస్తారా?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

జాతి, మతం, లింగం, లైంగిక ధోరణితోపాటు కుల ప్రాతిపదికన వివక్షను నిషేధించే చట్టాలు అమెరికా, కెనడాల్లోని కొన్ని రాష్ట్రాలు ఆమోదించాయి. వీటిని ఆర్ఎస్ఎస్, బీజేపీ మేధావులు వ్యతిరేకించారు. అమెరికాలో హిందూ ప్రతిభ పురోగతిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారనీ, ప్రపంచంలో హిందూ మతానికి హాని కలిగించడానికే ఈ వివక్షా కార్డును ఉపయోగిస్తున్నారనీ వారు ఆరోపించారు. భారతీయ వలసల్లో కుల వివక్ష ఎలా పనిచేస్తోందని అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ఇప్పటికే కొన్ని అధ్యయనాలు జరిగాయి. సాధారణంగా మానవ సమానత్వం వైపు, ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నప్పటికీ భారతీయులు సమానత్వం వైపు నిలబడుతున్నట్లయితే, ఎవరైనా అలాంటి శాసనాలను ఎందుకు వ్యతిరేకించాలి?

అమెరికాలో పలువురు వలస భారతీయుల కేంద్రంగా ఉన్న సుసంపన్న రాష్ట్రం కాలిఫోర్నియా సెనేట్‌లో 2023 మార్చి 22న కుల వివక్ష వ్యతిరేక బిల్లును ప్రవేశపెట్టారు. ఇది ఆమోదం పొందినట్లయితే, ప్రపంచంలోనే కులాన్ని మరింత మౌలికంగా చర్చించే మొదటి చట్టం అవుతుంది. భారత రాజ్యాంగం అస్పృశ్యతను రద్దు చేసింది కానీ కులాన్ని కాదు. హిందుత్వ ప్రవాసులు ఇలాంటి కీలక పరిణామం చోటు చేసుకోబోదని భావించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, బీజేపీ శక్తులు కూడా అలాంటి ఘటన జరగకూడదని భావించాయి. కానీ ప్రపంచం వీరి పరిధిని దాటిపోయింది.

జాతి, మతం, లింగం, లైంగిక ధోరణితోపాటు కుల ప్రాతిపదికన పౌరులు, పెద్దలు లేదా పిల్లలపై వివక్షను నిషేధించే చట్టాన్ని సియాటిల్ సిటీ కౌన్సిల్(అమెరికా), టొరొంటో డిస్ట్రిక్ట్ స్కూల్ బోర్డ్(కెనడా) ఆమోదించినప్పుడు పలువురు ఆర్ఎస్ఎస్, బీజేపీ మేధావులు వ్యతిరేకించారు. ఇలాంటి శాసనాలను 'హిందూఫోబియా'గా వారు ఖండించారు. అటువంటి శాసనాలను వ్యతిరేకిస్తూ పలు పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో రాశారు, మాట్లాడారు. సాధారణంగా మానవ సమానత్వం వైపు, ప్రపంచంలో ఎక్కడ నివసిస్తున్నప్పటికీ భారతీయుల సమానత్వం వైపు నిలబడుతున్నట్లయితే, అలాంటి శాసనాలను ఎందుకు వ్యతిరేకించాలి?

వివక్షకు సమర్థనా?

సియాటిల్ సిటీ కౌన్సిల్ ఇటీవలే ఆమోదించిన తీర్మానంలో వివక్ష వ్యతిరేక చట్టాలకు కులాన్ని కూడా జోడించడాన్ని ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రిక పాంచజన్య 'సంస్థాగత మార్గం ద్వారా అమెరికాలో హిందూఫోబియాను ప్రోత్సహిస్తున్నారు, అమెరికాలో హిందూ ప్రతిభ పురోగతిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారు' అని పేర్కొన్నట్టుగా 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' రాసింది. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ ఈ వాదననే మరింత ముందుకు తీసుకుపోయారు. కుల వివక్షకు సంబంధించిన ఈ తప్పుడు జెండాను ఎత్తుతున్న బృందాలు సాధారణంగా హిందూభయంతో ఉంటున్నాయని ఆయన ఒక జాతీయ దినపత్రికలో రాశారు. ప్రపంచంలో హిందూ మతానికి హాని కలిగించడానికే ఈ వివక్షా కార్డును ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అమెరికా కేంద్రంగా వ్యవహరించే పరిశోధనా సంస్థ 'ఈక్వాలిటీ ల్యాబ్'నూ, అలాగే అమెరికా, కెనడా, యూరప్ తదితర ప్రాంతాల్లో అలాంటి కుల వ్యతిరేక చట్టాలు, శాసనాలపై పనిచేసే పౌర సమాజ బృందాలనూ పశ్చిమ దేశాల్లోని హిందూఫోబిక్ గ్రూపులుగా రామ్ మాధవ్ తప్పుపట్టారు.

పాంచజన్య ఆరెస్సెస్ అధికార పత్రిక. వివక్షా వ్యతిరేక చట్టం హిందూఫోబియాకు సంకేతమనీ, భారతీయ ప్రతిభ పురోగతిని అడ్డుకునే కుట్ర అనీ అది పేర్కొంటోంది. భారత్ లేదా ప్రపంచంలో



గణనీయ సంఖ్యలో భారతీయులు నివసిస్తున్న చోట సంస్థాగత శాసనాలను రూపొందించకుండా కులవివక్ష సమస్యను పరిష్కరించడం ఎలా? వివక్షను ప్రదర్శిస్తున్న వారు అలాంటి వివక్షా వైఖరి తప్పు అని ఎన్నడూ భావించరు. ఒక వ్యక్తి లేదా వర్గ మానసిక లక్షణాల్లో వివక్షా పూరితమైన ప్రవర్తన భాగమవుతుంది. హిందూ మతానికి సంబంధించి, అలాంటి వివక్షను ఆధ్యాత్మిక పాఠ్య గ్రంథాల ద్వారా సమర్థిస్తున్నారు. దానికి పవిత్రతను కల్పిస్తున్నారు.

వివక్షాపూరిత అనుభవాలెన్నో!

భారతీయ వలసల్లో కుల వివక్ష ఎలా పనిచేస్తోందని అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో ఇప్పటికే కొన్ని అధ్యయనాలు జరిగాయి. స్కూల్, కాలేజీ, పిల్లలు, యువత రోజువారీగా అనుభవిస్తున్న వేదనకు సంబంధించిన ఇవి గాథలను వర్ణించాయి. వ్యక్తుల కుల నేపథ్యాన్ని తెలుసుకోవడానికి, అమలవుతున్న వివక్షా పద్ధతులను కనుగొనడానికి సంబంధించిన యంత్రాంగాలను పలు నివేదికలు వెలికి తెచ్చాయి. ఉదాహరణకు, తెన్‌మొళి సౌందరరాజన్ తాజా పుస్తకం 'ద ట్రామా ఆఫ్ కాస్ట్ – ఎ దళిత్ ఫెమినిస్ట్ మెడిటేషన్ ఆన్ సర్వైవర్‌షిప్, హీలింగ్, అబాలిషన్' అమెరికాలోని భారతీయ వలస ప్రజలలో వివక్షకు సంబంధించిన అసంఖ్యాక ఘటనలను గుదిగుచ్చింది. ఈమె రెండో తరం భారతీయ అమెరికన్ దళిత మహిళ.

టొరొంటో శాసనాలను రూపొందించిన తర్వాత, కెనడాలోని ఒక కాలేజీ విద్యార్థి త్రినా కుమార్ తన జీవితంలో ఎదుర్కొన్న ఒక అనుభవాన్ని సమగ్రంగా వర్ణించారు. తమ వేదనా గాథలను చెబుతున్న, భవిష్యత్తును ప్రేమిస్తున్న యువ మహిళగా ఆమె కనిపిస్తారు. ''గ్రేటర్ టొరొంటో పాఠశాలల్లో కులపరమైన వేధింపును చాలానే ఎదుర్కొన్నాను. ఈ వేధింపు నాకు అయోమయం కలిగించింది. ప్రత్యేకించి మేమంతా కెనడియన్లమే అయినప్పటికీ నా తోటి క్లాస్‌మేట్లకు కులం అంటే ఇంత ప్రాధాన్యం ఎందుకు అని నేను ఆశ్చర్యపడ్డాను'' అని ఆమె చెబుతున్నారు. ''వారి అగ్రకుల సంప్రదాయాలను నేను అనుసరించలేదు, దళిత క్రిస్టియన్‌గా ఉంటున్నందుకు వారు నన్ను ఆటపట్టించేవారు'' అని ఆమె చెప్పారు. క్రిస్టియన్లు మెజారిటీగా ఉంటున్న దేశంలో వారు ఇలా చేస్తున్నారు. ఇది క్రిస్టోఫోబియా కాదా?

పాశ్చాత్య కులతత్వ వలస ప్రజల్లో ఈక్వాలిటీ ల్యాబ్స్ ఒక సంక్షోభాన్ని సృష్టించింది. అయితే, అమెరికాలో కుల వివక్షపై ఈక్వాలిటీ ల్యాబ్స్ అధ్యయనాన్ని రామ్ మాధవ్ తోసిపుచ్చారు. ఇలాగైతే, మొత్తంగా గోధుమవర్ణపు భారతీయులు తమ మీద శ్వేత అమెరికన్లు వివక్ష ప్రదర్శిస్తారని ఎలా ఆరోపించగలరు?

సమానత్వం కోసం పనిచేస్తున్న గ్రూపులెన్నో!

అమెరికా, కెనడాల్లో కుల వివక్షా వ్యతిరేక చట్టాలపై ఈక్వాలిటీ ల్యాబ్స్ ఒక్కటే పనిచేయలేదు. ఉత్తర అమెరికా అంబేడ్కర్ అసోసియేషన్, బోస్టన్ స్టడీ గ్రూప్, పెరియార్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ బుద్ధిస్ట్ అసోసియేషన్, అంబేడ్కర్ కింగ్ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ ఇంటర్నేషనల్ మిషన్ వివక్షను ఎండగట్టడానికీ, పీడిత కుల వలస ప్రజలను చైతన్యవంతం చేయడానికీ కృషి చేశాయి. భారత్‌లో కులం, మానవ అస్పృశ్యత ఎలా పనిచేస్తున్నాయో, దాన్ని అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాల్లో ఎలా విస్తరింపజేస్తున్నారో పాశ్చాత్య సమాజాలకు తెలియపర్చేందుకు ఈ సంస్థలు బహుముఖ కార్యక్రమాలను చేపడుతూ వచ్చాయి. ఎక్కడ ఉన్నా సరే... కుల అణచివేత, దాని కార్యకలాపాలు ఎంత అమానుషంగా ఉంటున్నాయో ఈ దేశాల్లోని నల్లవారికీ, శ్వేత జాతీయులకూ తెలియజెప్పేందుకు ఈ సంస్థలు తమ వనరులనూ, మానవ శ్రమనూ చాలా వెచ్చించాయి. కులవ్యవస్థ గురించి, దాని అమానుషమైన ఆచరణ గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడంలో తప్పేముంది? మానవ సమానత్వం కోసం నిలబడకుండా ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రజాస్వామ్యం కోసం ఎలా నిలబడతాయి?

జాతి వివక్ష, ఇతర దేశాల పట్ల దురభిప్రాయం, దానికి సంబంధించిన అసహనాలకు వ్యతిరేకంగా డర్బన్ లో ఐక్యరాజ్యసమితి సదస్సు జరిగిన 2001 నుంచి ప్రపంచం చాలా దూరం పయనించింది. ఆనాటి సదస్సులో జాతి సమస్యతోపాటు కుల సమస్యను కూడా చర్చించడానికి అనుమతించలేదు. ఆనాడు ఐ.రా.స. అంగాలకు కుల వ్యవస్థ గురించి ఏమీ తెలియదనే చెప్పాలి. కుల సమస్యను అంతర్గత అంశం అని ప్రకటించి, దానిపై ఎలాంటి చర్చను కూడా అనుమతించడానికి బీజేపీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం సుముఖత చూపడం లేదు. హిందూఫోబియా పేరిట వివక్షను, అసమానత్వాన్ని, జాతి హత్యాకాండను విశ్వగురువు ఎందుకు ప్రేమిస్తున్నారు? హిందూయిజం మానవ సమానత్వాన్ని కోరుకోవడం లేదని దీని అర్థం కాదా?

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సురక్షిత భారత్



సూడాన్ నుంచి ఇండియా చేరుకున్న మొదటివాళ్లలో నా భర్త ఉన్నారు. భారతీయురాలిగా ఇదివరకెన్నడూ అనుభూతి చెందనంత సురక్షితంగా ఇప్పుడు ఉన్న భావన కలిగింది. మిగతా దేశాలు తమ దౌత్యవేత్తలను తరలించడానికి ప్రాధాన్యం ఇస్తే, మనం పౌరులకు ఇచ్చాం.

– మీనాక్షీ అగర్వాల్, ఫెంగ్‌షుయి కన్సల్టెంట్

నవ్వాల్సిన విషయమా?



డిప్రెషన్, ఆత్మహత్యలు అనేవి నవ్వదగిన అంశాలు కావు. ప్రత్యేకించి యువతలో. 'ఎన్‌సీఆర్‌బీ' డేటా ప్రకారం, 2021లో 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో అత్యధికులు ముప్పై ఏళ్ల లోపు వారు. ఇది విషాదం. జోక్ చేయాల్సిన అంశం కాదు. (ఆత్మహత్యల మీద ప్రధాని జోక్ చేశారన్న భావంలో)

– ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ లీడర్

వ్యక్తిగత దాడి వద్దు



గౌరవనీయ ప్రధాని మీద ఎంత దాడిచేస్తే అది అంత వెనక్కి తన్నుతుంది. మనది ప్రజాస్వామ్యం. అంశాలవారీగా ఆయన మీద దాడి చేయండి. వ్యక్తిగతంగా చేయొద్దు. (మోదీ మీద ఖర్గే వ్యాఖ్యల నేపథ్యంలో)

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

కంటెంట్ మిస్సయ్యాం



ఈ మధ్యకాలంలో అన్ని బ్రేకప్పుల కంటే ఈ హాట్‌స్టార్, హెచ్‌బీఓల బ్రేకప్ నన్ను బాగా ప్రభావితం చేసింది.

– గౌరవ్ కపూర్, నిర్మాత

అంత కొత్తదొద్దు!



కొత్తది ఏది చేయడానికైనా నాకు సమ్మతమే. కానీ ఈ ప్రయోగాలను బీట్‌రూట్ ఇడ్లీ దగ్గర ఇక ఆపితే మంచిదేమో!

– కమలా త్యాగరాజన్, జర్నలిస్ట్

సారాంశం

సరికొండ చలపతి

క్వాంటిటీ పెరిగింది.. క్వాలిటీ పెంచుదాం

సంతాన మూలికలం
సంసార బానిసలం
సంతాన లక్ష్మి మనదిరా.. తమ్ముడూ
సంపాదన ఒకటే బరువురా
చదివెయ్య సీటులేదు
చదివొస్తే పనేలేదు
అన్నమో రామచంద్రా
అంటే పెట్టేదిక్కేలేదు
దేవుడిదే భారమనీ పెంపు చేయరా బ్రదర్
1981 నాటి ఆకలిరాజ్యం సినిమా పాట....
–పాతొచ్చి ఏళ్లయినా..
పరిస్థితులు మారాయా?

......

80 దశకంలో రేషన్
కార్డుమీద స్లోగన్
పంటలెక్కువయినా
పరిమితులెందుకు?
సంతాన పరిమితి లేనందుకు..
– సీన్ మారిందా..?

....

చిన్నప్పుడు పరీక్షలో ఓ ప్రశ్నకు జవాబు
'భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం '
– 50 ఏళ్ల కిందటి ప్రశ్న, జవాబు
అప్పట్లో 'అభివృద్ధి చెందుతున్న దేశం'
అనే మాట కొత్తగా చేర్చారని
టీచర్లు చెప్పేవారు.
– ఇప్పటికీ ఆ హోదా మారిందా?

....

మారిందల్లా..
అభివృద్ధి చెందిందల్లా..
హోదా మారిందల్లా..
జనాభాలోనే – నంబర్ వన్ ప్లేస్

....

పాపులేషన్ ప్రాబ్లమ్స్..

జనాభాలో నంబర్‌వన్ అనగానే సోషల్ మీడియాలో రెస్పాన్స్ ఇదీ.

....

ఇదేమీ సంతోషించవలసిన విషయం కాదు. యువతకి చేతినిండా పనిలేదు, ప్రజలకి కనీస సౌకర్యాలు లేవు. పెరుగుతున్న జనాభా చౌకయిన లేబర్‌గా మారుతున్నారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్నారు. అమెరికా వెళ్లే సాఫ్ట్‌వేర్ వాళ్లనే కాదు. సౌదీ, దుబాయ్.. లాంటి దేశాలకు వెళ్లేవారినీ, వాళ్ల జీవితాలనూ చూడండి

....

ప్రపంచానికి మానవ వనరులు పంచి.. మనం దారిద్ర్యాన్ని కూడబెట్టుకుంటామా? దేశ జనాభా ఇంతలా పెరుగుతుంటే లాభం పది శాతం, నష్టం తొంభై శాతం..

....

ఎపుడయినా ఆర్మీ రిక్రూట్‌మెంట్ క్యాంప్ చూశారా.. కొద్దిపాటి ఉద్యోగాలకు ప్రాణం పెట్టి పోరాడుతున్న వేలాది యువకులను చూశారా.. పిడికెడు గవర్నమెంట్ జాబుల కోసం లక్షలాది మంది పోటీ పడడం గమనించారా... ఇప్పుడు చెప్పండి జనాభా పెరుగుదలను ఆస్వాదిద్దామా..?

....

భారతావనికి ప్రాణం పోసే వ్యవసాయానికి మనం ఊపిరి పోస్తున్నామా. జనాభా పెరిగే కొద్దీ వనరులు, ఆహారపు అవసరాల మీద విపరీతమైన ఒత్తిడి పెరిగి... డిమాండ్‌ను తీర్చడం సవాలుగా మారుతుంది.

....

ప్రతి ఏడాది ఊళ్లనుంచి సిటీలకు ఎంతో



మంది వలస వస్తున్నారు. పట్టణాలు కిక్కిరిసిపోవడం ఖాయం. ఇదంతా బతుకుదెరువు కోసమే కదా.. ఇప్పటికే బతుకుకు ఆసరా లేదు. జనాభా పెరుగు తుంటే ఎలా..

....

ఇండియా మరింత పెద్ద కన్స్యూమర్ మార్కెటయ్యింది ..అంతే!

....

..పైవన్నీ కొట్టివేయదగ్గ కామెంట్సేమీ కాదు. మంది ఎక్కువయినా మజ్జిగ పలుచన కాకుండా చూసుకోగలిగితే.. మానవ వనరులే మహాబలం అంటున్న సామాజిక, ఆర్థిక నిపుణుల మాటలు నిజమవుతాయి.

లేకుంటే, తమ జనాభాను అధిగమించిందన్న వార్త వినగానే అక్కసుతో చైనా అన్న మాట 'క్వాంటిటీ కన్నా క్వాలిటీ ముఖ్యం'.. అనేదే నిజమవుతుంది.

– అందుకే జీవన ప్రమాణాల్లో, నైపుణ్యంలో.. క్వాలిటీ పెంచుకుందాం.

పాపులేషన్ పాప్‌కార్న్..

– జన సంఖ్య ప్రాతిపదికన చూస్తే.. ఇండియా, చైనాల తర్వాత ఏకంగా 139 కోట్ల మంది వినియోగదారులతో 'ఫేస్‌బుక్' మూడో అతిపెద్ద దేశంగా నిలుస్తుంది.

– చిత్రం ఏమిటంటే ప్రపంచ జనాభాలో చాలా వరకు 'అనుకోకుండా' పుట్టినవారేనని అంచనా. దంపతులు గర్భనిరోధక పద్ధతులను సరిగా పాటించకపోవడం, యువతుల్లో అవాంఛిత గర్భధారణ వంటివే దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

– ప్రపంచవ్యాప్తంగా 70 కోట్ల మందికిపైగా అమ్మాయిలకు 18ఏళ్లలోపు వయసులోనే వివాహాలు జరుగుతున్నాయి. ఆడపిల్లలు మధ్యలోనే చదువు మానేసేందుకు, జనాభా పెరుగుదలకు ఇది కారణం కావడం విషాదం

– భూమ్మీద ఇప్పటివరకు మొత్తంగా 10,800 కోట్ల మంది నివసించినట్టు అంచనా. అందులో ఏడు శాతం ప్రస్తుతం జీవిస్తున్నారు.

– మొత్తం జనాభాలో సగం మంది అంటే 380 కోట్ల మంది వయసు 30 ఏళ్లలోపే కావడం గమనార్హం. ఇందులో 10–24 ఏళ్ల మధ్యవయసువారు 180 కోట్ల మంది ఉన్నారు.

– 19వ శతాబ్దంలో జనాభా వంద కోట్ల నుంచి 200 కోట్లకు పెరగడానికి వందేళ్లకుపైగా పడితే.. 1960 నుంచి 2000 సంవత్సరం మధ్య కేవలం 40 ఏళ్లలో జనాభా 300 కోట్ల నుంచి 600 కోట్లకు పెరిగిపోయింది.

– అధిక జనాభాకు కారణం కేవలం జననాలు మాత్రమే కాదని, సగటు జీవిత కాలం పెరగడమూ కారణమేనని నిపుణులు చెప్తున్నారు. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పురుషుల ఆయుర్దాయం 1950లో 66 ఏళ్లుకాగా.. ప్రస్తుతం 74 ఏళ్లకుపైనే. అంటే జననాలు అదే స్థాయిలో ఉన్నా.. మరణాలు తగ్గి, జనాభా ఎక్కువగా ఉంటోందన్న మాట.

– ప్రపంచ జనాభా బాగా పెరిగిపోయినా.. వృద్ధిరేటు మాత్రం క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లలో జనాభా సంఖ్య 1.18 శాతం పెరగగా.. అంతకుముందు దశాబ్దంలో ఇది 1.24 శాతం కావడం గమనార్హం.

– సొంత దేశాలను వీడి విదేశాలకు వలస వెళ్లినవారి సంఖ్య 23 కోట్లకుపైగా ఉన్నట్టు అంచనా. గతంలో పేద దేశాల నుంచి అభివృద్ధి చెందిన దేశాలకు వలసలు జరిగితే.. ఇప్పుడు ఒక పేద దేశం నుంచి మరో పేద దేశానికి వలసలు జరుగుతున్నాయి.

– ప్రస్తుతం జనాభాలో 50 శాతం మంది పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వలసలే దీనికి కారణం. 19వ శతాబ్దం మొదట్లో పట్టణ జనాభా 3 శాతమేకాగా.. 2050 నాటికి ఇది 70 శాతానికి పెరుగుతుందని అంచనా.

– ప్రపంచ జనాభాలో 300 కోట్ల మందికిపైగా సగటున రోజుకు రెండు డాలర్ల (సుమారు రూ.163) కన్నా తక్కువ ఖర్చుతోనే జీవిస్తున్నారు. పేద దేశాల్లో అయితే ఈ ఖర్చు ఇంకా బాగా తక్కువ.

– నిజానికి అధిక జనాభా కంటే మితిమీరిన వినియోగమే పెద్ద సమస్య. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం.. జనాభాలో టాప్ 20 శాతం ధనవంతులు ఆహారం, ఇతర వనరుల్లో 85 శాతాన్ని వినియోగిస్తుంటే.. అట్టడుగు 20 శాతం పేదల వినియోగం 1.3 శాతమే.


– సుమారు 75 కోట్ల మందికి రక్షిత మంచినీరు అందుబాటులో లేదు.

....

సమతా సద్గురుమూర్తి

భారతదేశంలో ఎందరో మహానుభావులు జన్మించారు. తమ దివ్యోపదేశాల ద్వారా మానవ జాతికి దిశానిర్దేశం చేశారు. అటువంటివారిలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఒకరు. చిన్న వయస్సులోనే వేద వేదాంగాలనూ, ఉపనిషత్తులనూ, పురాణేతిహాసాలనూ ఆపోశన పట్టి... వాటి సారాన్ని అచ్చ తెలుగులో తత్వాలుగా, పద్యాలుగా, వచన గేయాల రూపాల్లో పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆలపించి... జాతికి వెలుగులను ప్రసాదించారాయన.

ఆయన క్రీ.శ. 1608లో జన్మించారు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయారు. 12వ ఏట తన పెంపుడు తల్లి అనుమతితో ఆయన దేశాటనకు బయలుదేరారు. పదహారవ ఏడు వచ్చేటప్పటికి బనగానపల్లె చేరి రెడ్డి రాణి అచ్చమాంబ ఇంట ఆవుల కాపరిగా కుదిరారు. తదుపరి ఆమెకే సద్గురువై జ్ఞానోపదేశం చేశారు. తన దేశాటనలో గమనించిన మూఢాచారాలనూ, మత ఛాందసత్వాన్నీ, నిరక్షరాస్యతనూ, మహిళా వివక్షనూ ఆయన తీవ్రంగా ఖండించారు.



నాటి సమాజంలో రజస్వల అయిన కన్యను వివాహమాడకూడదనే మూఢనమ్మకం ఉండేది. దానికి విరుద్ధంగా బ్రహ్మంగారు గోవిందమాంబను రజస్వల అయిన తర్వాతనే వివాహమాడారు. స్త్రీలకు సహజ సౌభాగ్యం జన్మతః వచ్చిందనీ, భర్త పోయినా దానిని విడనాడరాదనీ, బాల్య వివాహాలు సమాజానికి చేటు కలిగిస్తాయనీ ప్రకటించారు.

మతాలకతీతంగా మహమ్మదీయుడైన సిద్దయ్యను ప్రియ శిష్యునిగా స్వీకరించి ఆదరించారు. మనిషిని ప్రేమించలేని వాడు దేవుడిని ప్రేమించలేడనీ, మానవ సేవే మాధవ సేవయనీ హరిజనుడైన కక్కయ్యను శిష్యునిగా స్వీకరించి షట్చక్ర సందర్శనం చేయించారు. బ్రాహ్మణుడైన అన్నాజయ్యకు మంత్రోపదేశం చేశారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ... కార్మిక, కర్షక వర్గాలకు కావలసిన వ్యవసాయ పనిముట్లను కులవృత్తిని అనుసరించి అందించారు. అదే సమయంలో ఆధ్యాత్మిక ప్రబోధాలూ చేశారు. తన జ్ఞాన నేత్రంతో ప్రకృతిలోని రహస్యాలను గ్రహించి 'సాంద్ర సింధు వేద' మనే కాలజ్ఞానాన్ని రచించి భవిష్యత్తులో జరగబోయే వింతలను, విశేషాలను ముందుగానే దర్శించి వినిపించారు. ఆయన రచించిన కాళీ మకుట కందాలు, కాళికాంబ సప్తశతి, కాలజ్ఞాన తత్త్వాలు, గోవింద వాక్యాలు వంటివి భక్తులకు నేటికీ ఒకపక్క ఆధ్యాత్మికానందాన్ని ఇస్తూనే... మరోపక్క సామాజిక సంస్కరణకూ పురిగొల్పుతున్నాయి.

– పెద్దోజు నాగేశ్వర సిద్ధాంతి, హైదరాబాదు

(ఏప్రిల్ 30న పోతులూరి వీరబ్రహ్మం ఆరాధన మహోత్సవాలు)

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.అష్టమి ప.2.57 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పుష్యమి ఉ.9.11 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.11.22 నుండి 1.08 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.11 నుండి 9.02 వరకు, తదుపరి రా.12.23 నుండి 1.13 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.41, సూర్యాస్తమయం: 6.13.

సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య


దేవేంద్రకుమార్

సనత్‌నగర్: సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని సీఆర్‌పీఎఫ్ జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చివరి ఫోన్‌కాల్ మాట్లాడిన కొద్దిక్షణాల్లోనే రైఫిల్‌ను గదవకు గురిపెట్టి కాల్చుకోవడంతో తలలో నుంచి బుల్లెట్ దూసుకుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అవివాహితుడు అయిన జవాన్ చివరి ఫోన్‌కాల్ ఓ యువతితో మాట్లాడటాన్ని బట్టి చూస్తే ప్రేమవ్యవహారమే ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దేవేంద్రకుమార్(26) 2021 బ్యాచ్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్. 45 రోజుల క్రితం నగరానికి వచ్చి బేగంపేట చీకోటి గార్డెన్స్‌లో ఉండే సీఆర్‌పీఎఫ్ ఐజీ మహేశ్‌చంద్ర లద్దా ఇంటి వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున విధి నిర్వహణలో ఉండగానే 4–5 గంటల మధ్య తన వద్దనున్న ఇన్సాస్–5.56 ఆటోమేటిక్ సర్వీస్ రైఫిల్(మేడిన్ ఇండియా)తో గదవకు గురిపెట్టుకుని కాల్చుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. దేవేంద్రకుమార్ ఫోన్ కాల్స్‌ను పరిశీలించగా చివరి కాల్ ఓ యువతితో మాట్లాడినట్లు గుర్తించారు. పోలీసులు ఆ యువతికి ఫోన్ చేసి 'దేవేంద్రకుమార్ మీతో మాట్లాడాడా..'అని అడగ్గా అవునని సమాధానం చెప్పింది. అయితే ఇద్దరి మధ్య ఏమైనా గొడవ జరిగిందా? అని అడుగుతుండగా వెంటనే ఫోన్ పెట్టేసింది. పోలీసులు మళ్లీ ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు. గార్డ్ కమాండర్ అనిల్ పవార్ ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీని తన్ని తరిమేయండి

దుమ్ముగూడెం: బ్రాహ్మణీయ, హిందుత్వ, ఫాసిజానికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలు చేపడుతూ బీజేపీని తన్ని తరిమేయాలని సీపీఐ మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన పేరిట ఒక లేఖ విడుదలైంది. తెలంగాణలో బీజేపీ మతతత్వ రాజకీయాలతో విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల్లో ఘర్షణ సృష్టించాలని చూస్తోందని ఆరోపించారు. ఇటీవల చేవెళ్లకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలంగాణలో ముస్లింల రిజర్వేషన్లను తొలగిస్తామని పేర్కొన్నారని గుర్తు చేశారు. ఆయన దృష్టిలో ముస్లింలు దేశ పౌరులు కారా? అని ప్రశ్నించారు.

అందువల్లే 'అరన్‌పూర్' దాడి!

- దర్బా డివిజన్ కమిటీ కార్యదర్శి సాయినాథ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బ్రాహ్మణ, హిందుత్వ, ఫాసిస్ట్ విధానాలు అవలంబిస్తున్న కేంద్రం, ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వచర్యలకు కౌంటర్‌గానే ఛత్తీస్‌గఢ్‌లోని 'అరన్‌పూర్'దాడి జరిపినట్టు మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ దర్బా డివిజన్ కమిటీ కార్యదర్శి సాయినాథ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బస్తర్ ప్రాంతం ఈ దేశంలో లేదా.. ఇదేమైనా పరాయి దేశమా అని ప్రశ్నించారు. దేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు బస్తర్‌లో ఉన్న సహజసంపదను దోచిపెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులకు తెగబడుతూ ప్రజాపోరాటాలను అణచివేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. తమపై నిర్బంధం, దాడులు తీవ్రమైనందున ప్రతిఘటించక తప్పడంలేదని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులపై దాడులకు ప్రత్యేకంగా డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ పేరిట నియామకాలు చేపడుతోందని, ఇందులో లొంగుబాటు పేరుతో పార్టీకి ద్రోహం చేసినవారు, నిరక్షరాస్యులు, ఫిజికల్ ఫిట్‌నెస్ లేని వారిని సైతం భర్తీ చేస్తున్నారని విమర్శించారు. పోలీసు ఉద్యోగాలు మాని ఇతర ఉద్యోగాల్లో చేరి ప్రజాపోరాటంలో భాగం కావాలని సాయినాథ్ యువతకు పిలుపునిచ్చారు.

పంటలు అస్తవ్యస్తం.. ఊహకందని నష్టం

నాలుగైదు లక్షల ఎకరాలే కాదు... ఇంకా ప్రభావం ఎక్కువే
- 75% ఊడ్చుకుపోయిన 'మామిడి'
- 12 లక్షల టన్నులకు మూడు లక్షలే చేతికి వస్తాయని అంచనా


జగిత్యాల జిల్లాలో నేల రాలిన మామిడికాయలు

సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలు... వడగళ్ల వానలు... ఈదురుగాలులు రాష్ట్ర వ్యవసాయాన్ని అతలాకుతలం చేశాయి. నెలలో రెండోసారి కురిసిన వర్షాలతో అంచనాలకు మించి నష్టం జరిగి ఉండొచ్చని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. కేవలం నాలుగైదు లక్షల ఎకరాలే అనుకోవడానికి వీలులేదని, ఊహకందని నష్టం జరిగిందని అంచనా వేస్తున్నాయి. అన్ని జిల్లాల్లోని పంటలు ప్రభావితం కాగా, కొన్ని జిల్లాల్లో అయితే ఏకంగా పంటలు ఊడ్చుకుపోయాయి. రాష్ట్రంలో మూడున్నర లక్షల ఎకరాల్లో మామిడి తోటలు వేశారు. దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి కావాల్సి ఉంది. కానీ ఈసారి మొదట్లోనే పూత సరిగా లేదు. కాత రాలేదు. దానికితోడు గత నెల, ఇప్పుడు కురిసిన వడగళ్ల వాన, ఈదురు గాలులకు 75 శాతం ఉత్పత్తి పడిపోతుందని ఉద్యానశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే 12 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తికి అంచనాకుగాను, కేవలం 3 లక్షల మెట్రిక్ టన్నులే (25 శాతమే) వచ్చే అవకాశముందని చెబుతున్నారు. మామిడి తోటలను లీజుకు తీసుకున్న వ్యాపారులు, కాత అంచనా ప్రకారం రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. కానీ ఇప్పుడు కాయలు రాలిపోవడంతో అనేకచోట్ల రైతులు వ్యాపారులకు లీజు డబ్బు వెనక్కు ఇవ్వాల్సి వస్తుంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొన్నిచోట్లనైతే మామిడి కాయంతా రాలి పాడైపోయింది. కనీసం తక్కువ ధరకు కూడా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో బహిరంగ మార్కెట్లో మామిడి కాయలు, పండ్ల ధర భారీగా పెరుగుతుంది. ఫలితంగా వినియోగదారులపైనా ప్రభావం పడనుంది.

పొలాల్లోనే నేల పాలు...

ఈ యాసంగిలో 72.61 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో వరి 56.44 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 6.48 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. శనగ 3.64 లక్షల ఎకరాలు, వేరుశనగ 2.42 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వరి ఇప్పటివరకు 40 శాతం వరకు కోతలు పూర్తయినట్లు అంచనా. అందులో చాలావరకు ఇంకా మార్కెట్‌కు రాకపోవడంతో తడిసిపోయింది. ఆ రకంగా రైతులకు నష్టం వాటిల్లగా, మరోవైపు ఇప్పటివరకు 60 శాతం వరకు పంట కోత దశలోనే ఉంది. అంటే 33 లక్షల ఎకరాలు ఇంకా కోత దశలోనే ఉందని అంచనా. అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలులకు అన్ని జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున వరి దెబ్బతింది. పొలాల్లోనే వరి గింజలు నేల రాలాయి. కొన్నిచోట్ల ఒక్క గింజ కూడా లేకుండా రాలిపోయింది. దీంతో ఊహకందని విధంగా వరికి నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ వర్గాలే చెబుతున్నాయి. అలా నేల రాలిన గింజలు ఏమాత్రం పనికి రావని, దాంతో అనేక జిల్లాల్లో రైతులు వాటిని కోయకుండా వదిలేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా చేతికి వచ్చినా అది రంగు మారి ఉంటుంది. దాన్ని అమ్ముకోవడం కూడా కష్టమే. ఈ పరిస్థితుల్లో పంటలు కేవలం నాలుగైదు లక్షల ఎకరాల్లోనే నష్టం జరిగిందన్న అంచనాకు వచ్చే పరిస్థితి లేదు. వ్యవసాయ వర్గాలు నిష్పక్షపాతంగా అంచనా వేస్తే తప్ప రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగదన్న చర్చ జరుగుతోంది. మరోవైపు మొక్కజొన్న పంటలూ దెబ్బతిన్నాయి. వడగళ్లు, ఈదురుగాలులకు చాలాచోట్ల మొక్కజొన్న పంట నేల వాలిపోయింది. మిగిలిన పంటలదీ ఇదే పరిస్థితి.

గుండె ఆగిపోవడంతోనే వైద్య విద్యార్థి మృతి

- ఫిలిప్పీన్స్ వైద్యుల పోస్టుమార్టం నివేదికలో వెల్లడి
- నేడు అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కు మణికాంత్‌రెడ్డి మృతదేహం


మణికాంత్‌రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం రాంలింగంపల్లి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి గూడూరు మణికాంత్‌రెడ్డి (21) మృతికి కార్డియాక్ అరెస్టే (గుండె ఆగిపోవడం) కారణమని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. మణికాంత్‌రెడ్డి వైద్య విద్యను అభ్యసించడానికి ఫిలిప్పీన్స్‌కి వెళ్లి అక్కడ ఈ నెల 23న ఉదయం అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. మణికాంత్‌రెడ్డి మృతదేహానికి అక్కడి వైద్యులు బుధవారం పోస్టుమార్టం నిర్వహించగా కార్డియాక్ అరెస్ట్‌తోనే మృతిచెందినట్టు తేలిందని, ఈ మేరకు అక్కడి అధికారుల నుంచి సమాచారం వచ్చిందని మృతుడి బంధువులు తెలిపారు. మణికాంత్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు విదేశీ వ్యవహారాల శాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మణికాంత్‌రెడ్డి మృతదేహం హైదరాబాద్‌కు రానుందని తెలిసింది. కుమారుడిని కడసారి చూసుకునేందుకు తల్లిదండ్రులు, బంధువులు నిద్రాహారాలు మాని వేచిచూస్తున్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం ఆపాలని మైసమ్మకు మొక్కులు

- గ్రామస్తులకు మద్దతుగా వస్తుండగా జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్ హౌస్‌అరెస్టు
- జగిత్యాల జిల్లా పాశిగామ గ్రామస్తుల నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వెల్గటూర్: జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలని పాశిగామ గ్రామస్తులు గురువారం మైసమ్మతల్లికి మొక్కులు చెల్లించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికో బోనం చొప్పున తీసుకువచ్చి 7వ నంబర్ రాష్ట్ర రహదారి పక్కన గల మైసమ్మతల్లి వద్ద భారీ నిరసన తెలియజేశారు. ప్రజల ప్రాణాల కంటే ఫ్యాక్టరీయే ముఖ్యమనుకునే నాయకుల మనసు మార్చి పరిశ్రమ నిర్మాణం జరగకుండా చూడాలని మైసమ్మతల్లిని వేడుకున్నారు. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నెల రోజులుగా పోరాటం చేస్తున్న గ్రామస్తులకు మద్దతుగా నిలిచేందుకు వస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పోలీసులు హౌస్‌అరెస్టు చేశారు. వెల్గటూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మురళిగౌడ్ తదితరులను ముందస్తు అరెస్టు చేశారు.

నేటి జేపీఎస్‌ల సమ్మె వాయిదా


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సాక్షి, హైదరాబాద్/నిర్మల్ చైన్‌గేట్: పంచాయతీ సర్వీసెస్ అసోసియేషన్ తీసుకున్న చొరవతో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సమ్మె తాత్కాలికంగా వాయిదాపడింది. నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తిచేసుకున్న తమను రెగ్యులరైజ్ చేసి పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణించాలనే డిమాండ్‌తో శుక్రవారం నుంచి సమ్మెకు జేపీఎస్‌ల సంఘం పిలుపునిచ్చింది. అయితే, గురువారం దీనిపై సంఘం ప్రతినిధులు రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్‌తో పీఆర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ప్రాథమిక చర్చలు జరిపారు. తొందరపాటు తగదని, జేపీఎస్‌ల పర్మినెంట్ ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రతినిధులు హామీనిచ్చినట్టు తెలిసింది. ఇంకా చర్చల్లో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో శుక్రవారం నుంచి చేపట్టాలని భావించి సమ్మె వాయిదా వేసుకునేందుకు జేపీఎస్‌ల సంఘం అంగీకరించినట్టు సమాచారం. కాగా, తమ సమస్యలపై నిర్మల్‌లో జేపీఎస్‌లు భారీ ర్యాలీ నిర్వహించారు. గురువారం తమ ప్రొబేషన్ సమయం ముగిసినందున సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

కలుషిత నీరు తాగి 350 మందికి అస్వస్థత

- తాగునీటి పైపుల లీకేజీలతో కలుషితం


చింతబావిలో సరఫరా అయిన కలుషిత జలాలు

చిలకలగూడ: సికింద్రాబాద్ మెట్టుగూడ డివిజన్ చింతబావి బస్తీలోలో కలుషితజలాలు తాగి సుమారు 350 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. బస్తీలో సుమారు 1000 కుటుంబాలకు పైగా ఉండగా గత నాలుగు రోజుల నుంచి క్రమంగా బస్తీలో ఒకరి తర్వాత ఒకరు వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రులో చేరారు. బస్తీకి సరఫరా అవుతున్న నీళ్ల రంగు మారడం, దుర్వాసన రావడంతో జలాలు కలుషితమైనట్లు గుర్తించి సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించినా సకాలంలో స్పందన కరువైంది. బాధితులు స్థానిక బస్తీ ఆస్పత్రులకు ఆశ్రయించినా...పరిస్థితి మెరుగు పడక పోవడంతో కొందరు బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. ఆరు నెలలుగా తరచూ కలుషిత జలాలు సరఫరా అవుతున్నా, మ్యాన్‌హోల్స్ లీకై మురుగు ఇళ్లను ముంచెత్తుతున్నా అధికారులు స్పందించలేదని బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శాంపిల్స్ సేకరణ...

జలమండలి అధికారులు గురువారం బస్తీలోని ఇంటింటికి తిరిగి శాంపిల్స్ సేకరించి నీటిలో క్లోరిన్ శాతం, రంగు, రుచులను పరిశీలించారు. సేకరించిన నీటిని పరీక్షలకు పంపించారు. సేకరించిన నీటిలో క్లోరిన్ మోతాదు సక్రమంగానే ఉందని, రంగు మారినట్లు తమ పరిశీలనలో తేలలేదని మెట్టుగూడ జలమండలి మేనేజర్ నిఖిత పేర్కొన్నారు. బస్తీలోని ఓ ప్రాంతంలో ఉన్న ఇనుప మంచినీటి పైప్‌లైన్ వలన కలుషిత జలాల సమస్య ఉత్పన్నమైనట్లు భావించి ఆ పైపులైన్‌ను తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

చింతబావి బస్తీ నీటిసరఫరాలో శాంపిల్స్ సేకరించాం. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తాం. క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అంశాలపై చర్చించి సలహాలు, సూచనలు అందించాం.
– సరిత, తార్నాక జలమండలి డీజీఎం

మూడు రోజులుగా..

మూడు రోజులుగా నా కూతురు చైత్రికకు వాంతులు, విరేచనాలవుతున్నాయి. బస్తీలో తరచూ కలుషిత జలాల సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చూడాలి.
– శ్రీకాంత్, చింతబావి బస్తీవాసి

ఇంటిల్లిపాదికీ అస్వస్థత

గత నాలుగు రోజులుగా ఇంట్లో అందరం అస్వస్థతకు గురయ్యాం. ఇంట్లో చిన్నారులు, వృద్ధులతో పాటు గర్భిణి ఉంది. అందరూ వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాం.
– బాబురావు, చింతబావి బస్తీవాసి

ఓఆర్ఆర్ ప్రైవేటుకు..

నెహ్రూ ఓఆర్ఆర్ నిడివి:	158 కి.మీ.
వరుసలు:	8
నిత్యం రాకపోకలు సాగించే వాహనాలు:	1.3 నుంచి 1.5 లక్షలు
ఏటా టోల్ వసూలు:	రూ. 452 కోట్లు (సుమారుగా)

▶ మొదటి పేజీ తరువాయి

హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు. ఏటేటా ఔటర్‌పై పెరుగుతున్న వాహనాల రద్దీ, టోల్ ద్వారా వస్తున్న ఆదాయం, ఓఆర్ఆర్ నిర్వహణ, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎన్‌పీవీ (నెట్ ప్రజెంట్ వాల్యూ) పద్ధతిలో లీజు మొత్తాన్ని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో టోల్ పెంపు వంటి అంశాలతోపాటు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గతంలో ఇచ్చిన లీజులను కూడా ప్రామాణికంగా తీసుకున్నట్లు చెప్పారు.

నిర్వహణ ఇక ప్రైవేట్ సంస్థదే...

ఇప్పటివరకు ఔటర్ రింగ్‌రోడ్డు నిర్వహణ హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఓఆర్ఆర్‌పై టోల్ వసూలుతోపాటు రోడ్లకు మరమ్మతులు, లైట్లు, పచ్చదనం, తదితర పనులన్నింటినీ హెచ్‌జీసీఎల్ పర్యవేక్షిస్తోంది. తాజా ఒప్పందం వల్ల ఆ బాధ్యతలన్నింటినీ ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించనుంది. టోల్ ద్వారా వచ్చే ఆదాయం ఆ సంస్థకే లభించనుంది. ప్రస్తుతం ఔటర్‌పై నిత్యం సుమారు 1.3 లక్షల నుంచి 1.5 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టోల్ వసూలు ద్వారా ఏటా సుమారు రూ. 452 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. ఏటా టోల్ రుసుమును కొంత మేరకు పెంచడం ద్వారా ఆదాయం కూడా పెరుగుతుంది. ఈగిల్ ఇన్‌ఫ్రా సంస్థ ఇప్పటివరకు టోల్ వసూలు చేస్తుండగా ఇకపై ఐఆర్‌బీ సంస్థ పరిధిలోకి వెళ్లనుంది. రహదారుల నిర్వహణలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఇప్పటివరకు దేశంలో టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతి అత్యుత్తమ విధానంగా పేరొందింది. ఎన్‌హెచ్ఏఐ 2016 నుంచి ఈ పద్ధతిని అవలంబిస్తోంది. మొత్తం 1,600 కి.మీ.కిపైగా మార్గాన్ని ఈ పద్ధతిలో 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లీజుకు ఇచ్చింది. ఔటర్ లీజు విషయంలోనూ ఇదే పద్ధతిని అమలు చేసినట్లు అధికారులు తెలిపారు.

పెట్టుబడులకు ఊతం: సీఎం కేసీఆర్

ఈ లీజు ఒప్పందంపట్ల సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చాలా చక్కటి ఒప్పందమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనలో పెట్టుబడులకు ఇది ఊతమిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మున్సిపల్ శాఖ మంత్రి కె. తారక రామారావు పేర్కొన్నారు. తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, వ్యాపార సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేయడం వల్లే అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు తీస్తోందన్నారు.

ఇదీ ఔటర్ స్వరూపం...

హైదరాబాద్ నగరం చుట్టూ 8 వరుసల్లో ఉన్న 158 కి.మీ. నిడివిగల ఔటర్ రింగురోడ్డు నిర్మాణం ఉమ్మడి ఏపీలో 2006లో మొదలైంది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని 2018లో పూర్తి చేసింది. ఔటర్‌కు 44 చోట్ల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉన్నాయి. 22 చోట్ల ఇంటర్‌ఛేంజ్‌లను ఏర్పాటు చేశారు. ఔటర్ మీదుగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి నేరుగా చేరుకోవచ్చు.



రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కాసర్ల మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికల్లో మోహన్‌రెడ్డితోపాటు మరో 10 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా వుప్పల నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీగా వుడుతల భాస్కర్‌రావు, కార్యదర్శిగా పాతూరి వెంకటరావు, కోశాధికారిగా వంగేటి అభిషేక్‌రెడ్డి ఎన్నికవగా మోముల సుధాకరరెడ్డి, పురుమండ్ల శ్యామ్‌సుందర్ రెడ్డి, సిద్దెంకి జగన్‌మోహన్‌రెడ్డి, త్రిపురనేని సుబ్రహ్మణ్యం, వేముల రవీందర్‌రెడ్డి, గంధమనేని వినయ్ ప్రసాద్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఫెడరేషన్‌కు చెందిన 10 ప్రాంతీయ కమిటీల ఎన్నికలు ఇటీవలే జరిగాయి. మొత్తం 11 కమిటీల పదవీకాలం ఐదేళ్లపాటు ఉండనుంది.


ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి



సాక్షి, హైదరాబాద్: 'కిసాన్ సర్కార్ అంటే రైతుబంధు, రైతుబీమా ఇవ్వడమేనా! తీవ్రమైన కష్టాల్లో ఉన్న రైతన్నలను ఆదుకోవడం కాదా?'అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, మహారాష్ట్రలో పబ్లిసిటీ కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంతో ఆర్భాటంగా సీఎం కేసీఆర్, కేటీఆర్ ఇతర మంత్రులు గొప్పలు చెబుతున్నారే తప్ప తెలంగాణ సీడ్ బౌల్ గా మారలేదని, పొరుగు రాష్ట్రం ఏపీ ఈ ఘనతను సాధిస్తోందని అన్నారు. గురువారం ఆయన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి, ఇతర నేతలతో కలసి మీడియాతో మాట్లాడుతూ.. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో జరిగిన పంట నష్టంపై గవర్నర్ నివేదిక తెప్పించుకొని అన్నదాతలకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు జరిగిన పంటనష్టానికి పరిహారంగా ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తామంటోందని, కానీ తాము రూ.50 వేలు డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

12 దాకా సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ న్యాయస్థానం మే 12వ తేదీ దాకా పొడిగించింది. ఈ మేరకు ప్రత్యేక జడ్జి ఎం.ఎం.నాగపాల్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో ఈ నెల 25న దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్ ఈ–కాపీని సిసోడియాకు అందజేయాలని సీబీఐని ఆదేశించారు. విచారణ పూర్తి కాకుండానే సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిందని, సిసోడియాకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది రిషికేశ్ కోరారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసే హక్కు తమకు ఉందని పేర్కొన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. అనుబంధ చార్జిషీట్ ఈ–కాపీని సిసోడియాకు ఇవ్వాలని సీబీఐకి స్పష్టం చేశారు.

దేవెగౌడ సుడిగాలి పర్యటనలు

11 రోజుల్లో 42 చోట్ల ప్రచారం చేయనున్న జేడీఎస్ చీఫ్



శివాజీనగర: త్రిముఖ పోరుగా మారిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ మరిన్ని సీట్లు ఒడిసి పట్టేందుకు ఆ పార్టీ చీఫ్ హెచ్‌డీ దేవెగౌడ స్వయంగా రంగంలోకి దిగారు. వచ్చే 11 రోజుల్లో 42 చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 89 ఏళ్ల వయసులోనూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీ శ్రేణులను, కార్యకర్తలు, మద్దతుదారుల్లో ఎన్నికల సమరోత్సాహం పెంచనున్నారు. ' శుక్రవారం నుంచి మే ఎనిమిదో తేదీ దాకా 42 చోట్ల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటా. వయోభారం రీత్యా వారానికి ఒక్కరోజు మాత్రం కాస్తంత విరామం తీసుకుంటా. మా పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు వస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట ఇచ్చారు. కర్ణాటకలో వారు ప్రచారంలో పాల్గొంటారు. ప్రచారం కోసం ఇంకొందరు జాతీయస్థాయి నేతలతో ఈ విషయమై హెచ్‌డీ కుమారస్వామి మంతనాలు జరుపుతున్నారు' అని దేవెగౌడ గురువారం బెంగళూరులో మీడియాతో చెప్పారు. 'జాతీయరాజకీయాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక రాజకీయాల్లోనూ ఆ మార్పులు తప్పనిసరి' అని అన్నారు. '207 మంది పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు. మూడు చోట్ల సీపీఎం అభ్యర్థులకు, మరో మూడు చోట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థులకు మద్దతిస్తున్నాం' అని ఆయన చెప్పారు.

'కల్యాణం' ఎవరికో?


కల్యాణ కర్ణాటకలో హోరాహోరీ

కాంగ్రెస్‌కు ముందునుంచీ కంచుకోట

ఈసారి పాగా వేయాలని బీజేపీ యత్నం

వెనకబాటుతనమే ఇక్కడి ప్రధాన సమస్య

కల్యాణ (హైదరాబాద్) కర్ణాటక. కన్నడ సీమలో అత్యంత వెనకబడ్డ మెట్ట ప్రాంతం. దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తూ వస్తోంది. రాష్ట్రంలో బీజేపీ రెండు సార్లు 100కు పైగా స్థానాలు ఒడిసిపట్టినా మెజారిటీ మార్కును దాటలేకపోవడానికి ఈ ప్రాంతంలో పట్టు లేకపోవడమే ప్రధాన కారణం. దాంతో ఈసారి రెండు పార్టీలకూ కల్యాణ కర్ణాటక కీలకంగా మారింది. పట్టు కొనసాగించాలని కాంగ్రెస్, కోటను ఎలాగైనా బద్దలు కొట్టాలని బీజేపీ పట్టుదలగా ఉన్నాయి. ఇక్కడ ఎప్పుడూ ఐదు స్థానాలకు మించి గెలవని జేడీ(ఎస్) ఈసారి బీజేపీ, కాంగ్రెస్ రెబెల్స్‌ను బరిలో దించి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది...



ప్రభావం చూపే అంశాలు
- పడకేసిన ఐఐటీ కారిడార్
- తీవ్ర కరువు, నిరుద్యోగం
- తాగు, సాగునీటి కొరత
- రోడ్ల లేమి, వలసలు
- కలబురిగికి రైల్వే డివిజన్ హామీ పెండింగ్

'హైదరాబాద్ రాష్ట్రం'లో భాగమే

కల్యాణ కర్ణాటక ఒకప్పటి హైదరాబాద్ రాజ్యంలో భాగంగా నిజాంల ఏలుబడిలో కొనసాగింది. ఇటీవలి దాకా కూడా ఈ ప్రాంతాన్ని హైదరాబాద్ కర్ణాటకగానే పిలిచేవారు.

ఈ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, లింగాయత్, ముస్లింలు అధిక సంఖ్యాకులు. 50 శాతానికి పైగా ఉండే ఈ వెనుకబడిన వర్గాలే ఇక్కడ నిర్ణాయక శక్తి.

వీరేంద్ర పాటిల్, ధరంసింగ్ రూపంలో ఇద్దరు సీఎంలను అందించినా ఈ ప్రాంతం అత్యంత వెనకబాటుతనానికి మారుపేరు.

దేశంలోనే రెండో అతి పెద్ద మెట్ట ప్రాంతంగా పేరొందింది. దాంతో వెనకబాటుతనం ఇక్కడ ప్రతిసారీ ఎన్నికల అంశంగా మారుతుంటుంది.

ఈసారి కూడా పార్టీలన్నీ అభివృద్ధి నినాదాన్నే జపిస్తున్నాయి.

అతివృష్టితో ఇక్కడ 90 శాతం పంటనష్టం జరిగింది. బీజేపీ ప్రభుత్వం హెక్టార్‌కు రూ.10 వేల పరిహారం ప్రకటించినా అదింకా అందలేదు. ఇది ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చంటున్నారు.

ఆర్టికల్ 371(జే) ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ఈ ప్రాంతానికి ప్రత్యేక హోదా ఉన్నా ఒరిగిందేమీ లేదని స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది.

దాంతో కొన్నేళ్లుగా ప్రత్యేక కల్యాణ రాష్ట్ర డిమాండ్ ఊపందుకుంటోంది!

బీదర్, కలబురిగి, యాద్గిర్, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాలతో కూడిన కల్యాణ కర్ణాటకలో 40 స్థానాలున్నాయి.

ఖర్గే ఖిల్లా

మల్లికార్జున ఖర్గే కల్యాణ కర్ణాటక ప్రాంతానికి చెందిన నాయకుడే. కాంగ్రెస్ సారథిగా ఈసారి ఇక్కడ పార్టీకి అత్యధిక స్థానాలు సాధించి పెట్టాలని పట్టుదలగా ఉన్నారు. ఖర్గే కుమారుడు, చిత్తాపుర ఎమ్మెల్యే ప్రియాంక్ ఖర్గే ఇక్కడ బీజేపీకి కొరకరాని కొయ్యగా మారారు.

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ సగానికి పైగా స్థానాలను కాంగ్రెస్ చేజిక్కించుకుని సత్తా చాటింది. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 21 సీట్లు రాగా బీజేపీ 15, జేడీ(ఎస్) 4 గెలిచాయి. అయితే 2013తో పోలిస్తే కాంగ్రెస్‌కు 2 సీట్లు తగ్గగా బీజేపీకి 9 పెరిగాయి!

ఈ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టేందుకు అధికార బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్, అభివృద్ధి కార్యక్రమాలనే బీజేపీ ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. మోదీపై ఆశలు పెట్టుకుంది.

కల్యాణ కర్ణాటక ఉత్సవం, బీదర్ ఉత్సవం వంటివాటితో స్థానికుల మనసు దోచుకునే ప్రయత్నాలు చేసింది.

కల్యాణ కర్ణాటక ప్రాంతీయాభివృద్ధి మండలికి వార్షిక కేటాయింపులను రూ. 1,500 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు పెంచింది.


ఖర్గేకు సుదీర్ఘ రాజకీయ జీవితంలో 2019 లోక్‌సభ ఎన్నికల్లో తొలి ఓటమిని రుచి చూపిన స్ఫూర్తితో కల్యాణ కర్ణాటకలో పూర్తిగా పాగా వేసేందుకు ప్రయత్నిస్తోంది.

జేడీఎస్ గత మూడు ఎన్నికల్లో ఇక్కడ ఎప్పుడూ ఐదు సీట్లకు మించి నెగ్గలేదు. ఈసారి తమ పంచరత్న యాత్ర విజయవంతం కావడం, కాంగ్రెస్, బీజేపీ సీనియర్ నేతలు జేడీ(ఎస్)లో చేరడంతో మంచి ఫలితాలపై ఆశలు పెట్టుకుంది.

లింగాయత్‌లు ఎక్కువగా ఉన్నందున వారికి 2 శాతం అదనపు రిజర్వేషన్ల నిర్ణయం కలిసొస్తుందని ఆశ పడుతోంది. కానీ 40 శాతం కమీషన్లు, నియామక అక్రమాలు, రెబెల్స్ వంటివి బీజేపీకి ప్రతికూలంగా మారాయి.

ఈసారి కల్యాణ కర్ణాటక నుంచి బరిలో దిగిన గాలి జనార్దన్ రెడ్డి కల్యాణ రాజ్య ప్రగతి పార్టీ (కేఆర్‌పీపీ) మూడు ప్రధాన పార్టీల అవకాశాలను తారుమారు చేసే అవకాశముంది. **- సాక్షి, బెంగళూరు**

విమర్శల నడుమే ఆనంద్ విడుదల



ఆనంద్.. తెలంగాణ ప్రాంత కలెక్టర్ కృష్ణయ్య హత్య కేసులో దోషి

సహర్సా/పట్నా: రెమిషన్ అమలుకు సంబంధించి జైలు మాన్యువల్‌ను నితీశ్ కుమార్ ప్రభుత్వం 'మార్చడం'తో రాజకీయనేతగా ఎదిగిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ సింగ్ గురువారం బిహార్ కారాగారం నుంచి విడుదలయ్యారు. 1994లో ముజఫర్‌పూర్ గ్యాంగ్‌స్టర్ ఛోటా శుక్లా అంత్యక్రియల సందర్భంగా ఆందోళనలురేపి ఆ గొడవల్లో నాటి బిహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా కలెక్టర్, తెలంగాణ వ్యక్తి జి.కృష్ణయ్యను అత్యంత పాశవికంగా హత్య చేసిన ఉదంతంలో ఆనంద్ దోషిగా తేలడం తెల్సిందే. 2007లో స్థానిక కోర్టు ఆనంద్‌ను దోషిగా తేల్చి మరణశిక్ష ఖరారుచేసింది. కానీ ఆ తర్వాతి ఏడాది విజ్ఞప్తి మేరకు శిక్షను తగ్గించి జీవిత ఖైదుగా మారుస్తూ పట్నా హైకోర్టు తీర్పు వెలువర్చడం తెల్సిందే. ఆనాటి నుంచి 15 ఏళ్లపాటు బిహార్ జైలులో ఆనంద్ శిక్ష అనుభవించారు. పలుమార్లు పెరోల్‌పై బయటికొచ్చారు. ఇటీవల సీఎం నితీశ్ సమక్షంలో తన కుమారుడు, ఆర్జేడీ ఎమ్మెల్యే చేతన్ నిశ్చితార్థం ఘనంగా జరిపించారు. మాజీ ఎంపీ, పాత మిత్రుడు కావడంతో రాజకీయ లబ్ధి కోసం నితీశ్‌కుమార్.. జైలు నిబంధనలను మార్చి ఆనంద్‌కు జైలు నుంచి విముక్తి కల్పించడం పెను విమర్శలకు దారితీసింది. వాస్తవానికి విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని చంపిన వారికి రెమిషన్ వర్తించదు. అందుకే ఆ నిబంధనను తొలగిస్తూ జైలు మాన్యువల్‌ను పదో తేదీన సవరిస్తూ బిహార్ రాష్ట్ర విభాగం నోటిఫై చేసింది. దీంతో ఆనంద్‌సహా మరో 27 మంది విడుదలకు మార్గం సుగమమైంది. నిజాయతీ గల ఐఏఎస్‌ను చంపిన గ్యాంగ్‌స్టర్‌కు ఇలా ప్రభుత్వం రాజమర్యాదలు చేయడమేంటని ఐఏఎస్ అధికారుల సంఘంసహా పౌర సమాజం, విపక్షాలు ఎంతగా విమర్శలు చేసిన సహర్సా జైలు నుంచి ఆనంద్ విడుదల ఆగలేదు. 'ఆనంద్ కుమారుడు చేతన్ ప్రస్తుతం ఆర్జేడీ ఎమ్మెల్యే. రాష్ట్రంలో మహాఘట్‌బంధన్ కూటమి పార్టీ ఆర్జేడీతో బంధం, పదవి కాపాడుకునేందుకు చట్టాన్నే నితీశ్ పణంగా పెట్టారు' అని బిహార్ మాజీ మంత్రి, బీజేపీ నేత సుశీల్ మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ' ఐఏఎస్ అధికారుల సంఘం, కృష్ణయ్య సతీమణికి నా నమస్కారాలు' అని ఇప్పటికే పెరోల్‌పై ఉన్న ఆనంద్ సోమవారం వ్యాఖ్యానించడం గమనార్హం.

స్వలింగ జంటలకు సామాజిక ప్రయోజనాలు?

న్యూఢిల్లీ: దేశంలో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లేదని, అయినప్పటికీ అలాంటి వివాహాలు చేసుకున్న వారికి సామాజిక సంక్షేమ ప్రయోజనాలు, హక్కులు కల్పించేందుకు గల మార్గాలను అన్వేషించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కలిపించాలని కోరుతూ దాఖలైన వివిధ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ కొనసాగింది. స్వలింగ జంటలకు సామాజికపరమైన హక్కుల్ని కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక మార్గాన్ని కనుగొనాలని పేర్కొంది. ఇలాంటి జంటలకు ఉమ్మడి బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం, బీమా పాలసీల్లో భాగస్వామిని నామినేట్ చేయడం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించే విషయంలో పార్లమెంట్ తీర్మానమే కీలకమన్న అంశాన్ని తాము అంగీకరిస్తున్నట్లు వెల్లడించింది. స్వలింగ వివాహాన్ని ప్రభుత్వం గుర్తించినా, గుర్తించకున్నా దానికొక లేబుల్ అవసరమని అభిప్రాయపడింది. సేమ్ సెక్స్ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించకుండా వారి సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణ కావాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. ప్రేమించడం, సహజీవనం చేయడం, జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం వంటివి ప్రాథమిక హక్కులే అయినప్పటికీ స్వలింగ వివాహాన్ని చట్టబద్ధంగా గుర్తించాలని కోరడం ప్రాథమిక హక్కు కాదని తుషార్ మెహతా తేల్చిచెప్పారు. తదుపరి విచారణను ధర్మాసనం మే 3వ తేదీకి వాయిదా వేసింది.

మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా: రాహుల్



ఉడుపి/మంగళూరు: కాంగ్రెస్ నేత రాహుల్ కర్ణాటక మత్స్యకారులపై వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులకు రూ.10 లక్షల బీమా కల్పిస్తామని, లీటర్ డీజిల్‌పై రూ.25 చొప్పున రాయితీ ఇస్తామని, రోజుకు 500 లీటర్ల డీజిల్‌కు ఈ రాయితీ వర్తిస్తుందని, మత్స్యకార మహిళలకు రూ.లక్ష వడ్డీ లేని రుణం అందజేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గురువారం ఉడుపి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులతో సమావేశమయ్యారు. కేవలం హామీలు ఇవ్వడం కాదు, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి రోజు నుంచే వాటిని అమలు చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం కాదని అన్నారు. కర్ణాటకలో అధికారంలోకి రాగానే మహిళలకు ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

గ్రీన్‌కార్డులపై 'కంట్రీ లిమిట్' తొలగించండి

వాషింగ్టన్: గ్రీన్‌కార్డులపై 7 శాతంగా ఉన్న కంట్రీ లిమిట్‌ను తొలగించాలని సిలికాన్ వ్యాలీకి చెందిన ప్రముఖ భారత–అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ జైన్ భుతోరియా అమెరికా పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిమితి వల్ల గ్రీన్‌కార్డుల కోసం అర్హులైన వారు సుదీర్ఘకాలం నిరీక్షించాల్సి వస్తోందని చెప్పారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో భారతఅమెరికన్ పార్లమెంట్ సభ్యుడు రో ఖన్నా ఆధ్వర్యంలో తాజాగా జరిగిన యూఎస్–ఇండియా సదస్సులో అజయ్ జైన్ మాట్లాడారు. హెచ్–1 వీసాలపై లేని కంట్రీ లిమిట్ గ్రీన్‌కార్డులపై ఎందుకని ప్రశ్నించారు. అమెరికాలో ఇప్పుడు 8,80,000 మంది గ్రీన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. వీరిలో భారత్, చైనా నుంచి వచ్చినవారి సంఖ్య అధికంగా ఉందన్నారు. పదేళ్లకు పైగా నిరీక్షిస్తున్నవారు చాలామంది ఉన్నారని గుర్తుచేశారు. చట్టాన్ని మార్చకపోతే మరో 50 సంవత్సరాలు ఎదురు చూడక తప్పదని తేల్చిచెప్పారు.



చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్‌లో భక్తుల సందర్శనార్థం గురువారం తొలిసారిగా తెరచుకున్న బద్రీనాథ్ ఆలయం. హెలికాప్టర్ ద్వారా భక్తులపై పూలవర్షం కురిపించారు. మొదటి పూజను ప్రధాని మోదీ పేరిట అర్చకులు నిర్వహించారు.

ప్రతి భారతీయుడిని తీసుకొస్తాం

- సూడాన్ నుంచి స్వదేశానికి తరలింపు ముమ్మరం
- విదేశాంగ కార్యదర్శి క్వాత్రా

న్యూఢిల్లీ: సాయుధ బలగాల ఆధిపత్య పోరుతో సంక్షోభంలో చిక్కిన సూడాన్ నుంచి భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తామని భారత్ పునరుద్ఘాటించింది. స్వదేశానికి తరలింపునకు ఉద్దేశించిన 'ఆపరేషన్ కావేరీ' పురోగతిని గురువారం ఢిల్లీలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా మీడియాకు వెల్లడించారు. ' సూడాన్‌లో చిక్కుకుపోయిన మన వారిని అందరినీ తీసుకొస్తాం. సూడాన్‌తో భారత్ పటిష్ట అభివృద్ధి భాగస్వామిగా ఉన్న దృష్ట్యా ఆర్మీ, తక్షణ స్పందన దళం(ఆర్‌ఎస్‌ఎఫ్) రెండూ భారతీయుల తరలింపునకు సానుకూలంగా స్పందించాయి. సూడాన్‌లోని భారతీయ ఎంబసీలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రకారం అక్కడ 3,100 మంది భారతీయులు ఉన్నారు. మరో 300 మంది ఆపరేషన్ కావేరీతో టచ్‌లో ఉన్నారు. దాదాపు మరో వేయి మంది భారతీయ సంతతి వారున్నారు. ప్రతి ఒక్క భారతీయుడిని స్వదేశానికి తీసుకొస్తాం. ఇప్పటికే భారత్‌లో ల్యాండ్ అయిన/ఇంకా ప్రయాణంలో ఉన్న వారితో కలుపుకుని దాదాపు 606 మందిని రక్షించాం. ప్రస్తుతం జెద్దాకి 495 మంది, సూడాన్ పోర్ట్‌కి 320 మంది చేరుకున్నారు. గురువారం 246 మందితో సీ17 గ్లోబ్ మాస్టర్ విమానం ముంబైలో దిగింది. మరో 42 మందిని పొరుగున ఉన్న దక్షిణ సూడాన్ దేశానికి పంపించాం. తరలింపులో సహకరిస్తున్న సౌదీకి కృతజ్ఞతలు' అని అన్నారు.



ముంబైకి చేరుకున్న భారతీయులు

ప్రాణాలతో బయటపడతాననుకోలేదు: ఏపీ వాసి విష్ణువర్ధన్

'సూడాన్‌లో పరిస్థితి భయానకం. ప్రాణాలతో బయటపడతానని అస్సలు ఊహించలేదు' అని ఏపీలోని బాపట్ల జిల్లా చీరాలకు చెందిన విష్ణువర్ధన్ చెప్పారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియాతో చెప్పారు. 'అక్కడ పరిస్థితి దారుణం. 72 గంటలపాటు కాల్పుల విరమణ అన్నారేగానీ పోరు ఆగనేలేదు. మొత్తం కాల్పులమోతే. తినడానికి తిండి లేదు. నీరే దిక్కు' అని అన్నారు. ఆర్మీ, ఆర్‌ఎస్‌ఎఫ్‌ల మధ్య పోరులో ఇప్పటిదాకా 400 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

ప్రధాని విషసర్పం.. తాకితే అంతే

మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్య

యశవంతపుర: ప్రధాని మోదీ విష సర్పమని, తాకినవారు మరణిస్తారని చేసిన విమర్శలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వెనక్కి తగ్గారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలనుద్దేశిస్తూ తాను ఈ వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చారు.

అసలేం జరిగింది?

సొంత రాష్ట్రం కర్ణాటకలో ప్రచారంలో భాగంగా గురువారం గదగ జిల్లాలోని రాన్ నియోజకవర్గ పరిధిలోని గజేంద్రగడలో పార్టీ ప్రచార సభలో ఖర్గే పాల్గొని ప్రసంగించారు. ' పొరపాటు చేయకండి. జాగ్రత్త. ప్రధాని మోదీ విషసర్పం లాంటి వ్యక్తి. మరీ అంత విషతుల్యం కాదంటారా.. అయితే ఒకసారి తాకి చూడండి. మరణం తథ్యం. శాశ్వత నిద్రలోకి జారుకుంటారు' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ' అవినీతి పాలన అందించిన బీజేపీ నాయకులను మోదీ పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మోదీ ముఖం చూసి ఓటు వేసే కాలం పోయింది' అని అన్నారు. ప్రధానిని విషసర్పంతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో వెంటనే హావేరి సభలో ప్రసంగిస్తూ ఖర్గే వివరణ ఇచ్చారు. 'బీజేపీ పార్టీ ఒక విషసర్పం అనేదే నా ఉద్దేశం. ఆ పార్టీ సిద్ధాంతం విషతుల్యం. ఆ సిద్ధాంతాలను ఆచరిస్తే అంతమైనట్లే ఇక అనే ఉద్దేశంలో మాట్లాడాను' అని వివరించారు.

రైలులో మంటలు..ఏడుగురు సజీవదహనం

కరాచీ: పాకిస్తాన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలులో చెలరేగిన మంటల్లో నలుగురు చిన్నారులు, ఒక మహిళ సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కరాచీ నుంచి లాహోర్ వెళ్తున్న రైలు ఏసీ బోగీలో బుధవారం అర్ధరాత్రి తర్వాత మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే టాండో మస్తి ఖాన్ స్టేషన్‌లో రైలును ఆపేసి, మంటలు అంటుకున్న బోగీని వేరు చేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దుర్ఘటనలో నలుగురు చిన్నారులు, ఒక మహిళ సహా ఏడుగురు సజీవ దహనమయ్యారు. ఆరు మృతదేహాలు గుర్తు పట్టడానికి కూడా వీలు లేనంతగా కాలిపోయాయి. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు చెప్పారు.

ఉక్రెయిన్‌కు నాటో భారీ ఆయుధ సాయం



ఉక్రెయిన్, రష్యా హోరాహోరీ కాల్పుల్లో ధ్వంసమైన బఖ్ముత్ పట్టణం

కీవ్: రష్యాపై ఎదురు దాడి ప్రయత్నాల్లో ఉన్న ఉక్రెయిన్ బలగాలకు నాటో భారీ సాయం లభించింది. నాటోలోని మొత్తం 31 సభ్య దేశాలు కలిపి ఉక్రెయిన్‌కు 1,550 పోరాట వాహనాలు, 230 ట్యాంకులు, ఇతర పరికరాలతో పాటు పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రిని అందించాయి. దీంతో ఉక్రెయిన్‌కు ఇచ్చిన హామీల్లో 98% వరకు నెరవేర్చినట్లయిందని నాటో సెక్రటరీ–జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ చెప్పారు. అంతేకాకుండా, కొత్తగా ఏర్పాటైన9 ఉక్రెయిన్ బ్రిగేడ్‌లకు చెందిన 30 వేల బలగాలకు ఆయుధ, శిక్షణ సాయం కూడా ఇచ్చామని చెప్పారు. ఇవన్నీ కలిపితే ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యాను వెళ్లగొట్టేందుకు జరిగే పోరులో ఉక్రెయిన్ పైచేయిగా నిలుస్తుందన్నారు. శాంతి చర్చల్లోనూ ఆ దేశం పటిష్ట స్థానంలో ఉంటుదన్నారు. ఇలా ఉండగా, బుధ, గురువారాల్లో రష్యా కాలిబర్ క్రూయిజ్ మిస్సైళ్ల దాడిలో ఉక్రెయిన్‌లోని మైకోలైవ్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతిందని అధికారులు చెప్పారు.. కనీసం ఏడుగురు చనిపోగా, మరో 33 మంది గాయపడ్డారు. దాడుల్లో 22 బహుళ అంతస్తుల భవనాలు, 12 ప్రైవేట్ ఇళ్లు, ఇతర నివాస భవనాలు దెబ్బతిన్నాయి.

ఛత్తీస్‌గఢ్ అమరులకు ఘన నివాళులు

దంతెవాడ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడలో బుధవారం మావోయిస్టుల మందుపాతర పేల్చిన ఘటనలో అమరులైన 10 మంది పోలీసు సిబ్బంది, ఒక డ్రైవర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కర్లి ప్రాంతంలోని పోలీస్‌లైన్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో మృతుల కుటుంబీకులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం రోదనలు, భారత్ మాతా కీ జై నినాదాలతో ప్రతిధ్వనించింది. ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ తదితరులు హాజరై మృతులకు పూలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను బఘేల్ ఓదార్చారు. అనంతరం జవాన్ల భౌతికకాయాలను వాహనాల్లో సొంతూళ్లకు తరలించారు. సీఎం బఘేల్ కూడా భుజం కలిపి ఒక జవాను మృతదేహాన్ని వాహనం వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలు వృథా కావని, మావోయిస్టులపై పోరు మరింత తీవ్రతరం చేస్తామని చెప్పారు. దంతెవాడ జిల్లా అరన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల వాహనాన్ని నక్సల్స్ మందుపాతరతో పేల్చిన ఘటనలో డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డు(డీఆర్‌జీ) విభాగానికి చెందిన 10 మంది జవాన్లు, డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు.



శవపేటికను మోస్తున్న సీఎం బఘేల్

పార్లమెంట్ విశ్వాసం పొందిన పాక్ పీఎం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ గురువారం పార్లమెంట్‌లోని దిగువసభ నేషనల్ అసెంబ్లీ విశ్వాసం పొందారు. మొత్తం 342 మంది సభ్యులకుగాను 180 మంది షరీఫ్ నాయకత్వంపై విశ్వాసం ప్రకటించారు. షరీఫ్ ప్రభుత్వం, న్యాయ వ్యవస్థకు మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న సమయంలో ఈ పరిణామం సంభవించింది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన సమయంలో షరీఫ్‌కు 174 మంది సభ్యులు మాత్రమే మద్దతు తెలపడం గమనార్హం. పంజాబ్, ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్ అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకు పాకిస్తాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ)కి అవసరమైన నిధుల కేటాయింపునకు సంబంధించిన బిల్లును నేషనల్ అసెంబ్లీ ఇటీవల తిరస్కరించిన నేపథ్యంలో షరీఫ్ ప్రభుత్వం బలనిరూపణకు సిద్ధమయింది. వెంటనే పార్లమెంట్ ఎన్నికలు జరపాలంటూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలోని పీటీఐ పార్టీ గట్టిగా పట్టుబడుతోంది.

సరిహద్దుల్లో శాంతితోనే సత్సంబంధాలు

చైనా రక్షణ మంత్రికి తేల్చిచెప్పిన రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య సత్సంబంధాలు కొనసాగాలంటే సరిహద్దు సమస్యలన్నీ ద్వైపాక్షిక ఒప్పందాలకు లోబడి పరిష్కారం కావాల్సి ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుండబద్దలు కొట్టారు. గురువారం ఆయన చైనా రక్షణ మంత్రి లి షంగ్‌ఫుతో చర్చలు జరిపారు. తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి(ఎల్‌ఏసీ) మూడేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) దేశాల రక్షణ మంత్రుల సమావేశం కోసం లి గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్, లి సుమారు 45 నిమిషాలసేపు చర్చలు జరిపారు. ఇరువురు మంత్రులు సరిహద్దు వివాదాలతోపాటు ద్వైపాక్షిక సంబంధాలపై ఎటువంటి దాపరికాలు లేకుండా చర్చలు జరిపినట్లు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎల్‌ఏసీ వెంట నెలకొన్న వివాదాలు రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలు, హామీలు, ఒడంబడికలకు లోబడి పరిష్కారం కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. 'సరిహద్దుల్లో శాంతియుత వాతావరణాన్ని బట్టే రెండు దేశాల మధ్య సంబంధాల కొనసాగింపు ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు ఒప్పందాల ఉల్లంఘనలతో ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటాయని, ఉద్రిక్తతలు సడలిన తర్వాత మాత్రమే బలగాల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు'అని రక్షణ శాఖ ఆ ప్రకటనలో వివరించింది.



రాజ్‌నాథ్, చైనా మంత్రి షంగ్‌ఫు చర్చలు

కొన్ని పార్టీలకు రాజకీయాలంటే అవినీతి

- ప్రధాని మోదీ ఆగ్రహం
- కర్ణాటక బీజేపీ కార్యకర్తలతో మోదీ మాటామంతి



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ గురువారం బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. వారికి దిశానిర్దేశం చేశారు. కర్ణాటకలో ఓటర్లకు ప్రతిపక్ష కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఆయన వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ వారంటీ ఎప్పుడో ముగిసిపోయిందని, ఆ పార్టీ ఇచ్చే గ్యారంటీలకు అర్థంపర్థం లేదని ఎద్దేవా చేశారు. ఉచిత పథకాలపై మోదీ మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పథకాల వల్ల రాష్ట్రాలు దివాలా తీయడం ఖాయమని చెప్పారు. భవిష్యత్తు తరాలకు దక్కాల్సిన ప్రయోజనాలను ఈ ఉచిత పథకాలు మింగేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచితాల సంస్కృతికి తెరపడాలని మోదీ స్పష్టం చేశారు.

ప్రజల ఆశీస్సులు కోరుతా..

'మన దేశంలో రాజకీయాలు అంటే అర్థం అధికారం, అవినీతిగా కొన్ని పార్టీలు మార్చేశాయి. అధికారం కోసం ఆయా పార్టీలు సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నాయి. దేశ భవిష్యత్తు గురించి, కర్ణాటకలోని యువత, మహిళల భవిష్యత్తు గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు'అని మండిపడ్డారు. కర్ణాటక ప్రజలు బీజేపీపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, ఈ నమ్మకాన్ని వమ్ము కానివ్వబోమని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాల వల్ల దక్కే లాభాలను బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి పని చేస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా కర్ణాటక ప్రజల వద్దకు వెళ్లి, వారి ఆశీస్సులు కోరుతానని వివరించారు.

'ఫస్ట్ డెవలప్ ఇండియా'

షార్ట్‌కట్‌లను తాము నమ్ముకోవడం లేదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆత్యాధునిక భౌతిక, డిజిటల్, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు వెచ్చిస్తున్నామని గుర్తుచేశారు. ఎఫ్‌డీఐ అంటే తమకు 'ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్' కాదని, 'ఫస్ట్ డెవలప్ ఇండియా' అని వివరించారు. ఐదేళ్ల పాలనా కాలం గురించి యోచించడం లేదని, దేశం గురించి ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ కాదు, దేశమే తమకు ముఖ్యమని చెప్పారు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



భగీరథునికి నివాళి

కరీంనగర్: భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మహర్షి జయంతిని నిర్వహించారు.



రేషన్ 'రైస్' రగడ

జమ్మికుంటలో నాలుగు రోజులుగా రేషన్ రైస్‌పై రగడ కొనసాగుతోంది. శ్రీశక్తి రైస్‌మిల్‌లో రైస్ రీసైక్లింగ్ జరుగుతుందని వ్యాపారి పాపయ్య అధికారులకు ఫిర్యాదు చేశాడు.

8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మెకానిక్‌లు సాంకేతికంగా అభివృద్ధి చెందాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుత కాలంలో టూవీలర్స్ మెకానిక్‌లు కాలంతోపాటు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని తద్వారా వినియోగదారులకు నవీన, సాంకేతిక సేవలు అందించవచ్చని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం స్థానిక మెకానిక్ భవన్‌లో కరీంనగర్ ఆల్ టూవీలర్స్ మెకానిక్స్ సంఘం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ఆయన సొసైటీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాసాచారి, రాము, రాజేశం, భూమయ్య, శర్మ, అయాన్‌రాజ్, శేఖర్, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2005 నుంచి 2023 వరకు సంఘం అభివృద్ధికి కృషి చేసిన సుమారు 50 మందిని ఘనంగా సత్కరించారు.

మైనర్లు వాహనాలు నడిపితే యజమానులపై కేసులు



కరీంనగర్‌క్రైం: మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు. వాహనాలు నడిపి పట్టుబడిన ఐదుగురు మైనర్‌ల తల్లిదండ్రులకు గురువారం సీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజూ కరీంనగర్‌లో తనిఖీలు నిర్వహిస్తూ మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మైనర్‌లకు వాహనం ఇవ్వకూడదని, తెలిసీ తెలియని డ్రైవింగ్‌తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులను కోర్టులో హాజరు పరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తిరుమల్, నాగార్జునరావు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో సిద్ధమైన కీమోథెరపి సెంటర్



కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన కీమోథెరపి డే కేర్ సెంటర్ ఏర్పాట్లను జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ ద్వారా కేన్సర్ బాధిత రోగులకు చికిత్స ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాలియేట్ కేర్ సెంటర్, ఎన్‌సీడీ సెంటర్ సందర్శించి రోగులకు అందించే సేవలను గురించి తెలుసుకున్నారు. వైద్యులకు సూచనలు చేశారు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- రేపు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రవేశ పరీక్ష

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే హాల్ టికెట్లను విడుదల చేశామని, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కానివారు శుక్రవారంలోగా నవోదయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పద్నాలుగు బ్లాకుల పరిధిలో ఏర్పాటు చేసిన 37 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని, 7,730 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 29న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్ లేకుండా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని.. అభ్యర్థులంతా ఉదయం 10.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలకు అనుమతిలేదని పేర్కొన్నారు.

జీపీఎఫ్ బకాయిలు 28 రూ. కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ గోస

- తొమ్మిది నెలలుగా బిల్లులకు మోక్షం లేదు
- నిలిచిపోయిన జీపీఎఫ్, ఫైనల్ పేమెంట్స్, పార్టు ఫైనల్ లోన్స్, అడ్వాన్సులు



జెడ్పీ కార్యాలయం

'భార్యభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులే. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మల్యాల మండలంలో భర్త పనిచేస్తుండగా.. ఆయన భార్య ధర్మారం మండలంలో పనిచేస్తున్నారు. వారి గ్రామంలో భూమి కొనుగోలు కోసం సెప్టెంబర్‌లో క్రయవిక్రయ ఒప్పందం జరిగింది. ఇరువురు జిల్లా పరిషత్‌లో వారి జీపీఎఫ్ ఖాతాల్లో సొంత డబ్బును రూ.15 లక్షల లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలుగా వారికి రావాల్సిన లోన్ రావడం లేదు. దీంతో జెడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.'

'చొప్పదండి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందారు. ఆయనకు రావాల్సిన బకాయిల కోసం అక్టోబర్‌లో దరఖాస్తులు సమర్పించారు. నేటికీ పెన్షన్, ఇతరత్రా డబ్బుల కోసం జెడ్పీ జీపీఎఫ్ విభాగంలో వాకబు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు డబ్బులు అందలేదు'.

'గంగాధర మండల కేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆరోగ్య రీత్యా అవసరం ఏర్పడి కొంత మేరకు లోన్ కావాలని దరఖాస్తు సమర్పించారు. ఐదు నెలలు గడుస్తున్నా లోన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు'.

ఇది ఇలా ఒకరిద్దరి ఉపాధ్యాయుల బాధ కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొమ్మిది నెలలుగా వివిధ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వెతలు

ఇలా తొమ్మిది నెలలుగా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఎందరో జీపీఎఫ్ డబ్బుల కోసం కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.'

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, వరంగల్ అర్బన్, భూపాలపల్లి జిల్లాలోని 71 మండలాల్లో 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు విద్యాశాఖలో పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రభుత్వ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) విభాగం నుంచి పదవీ విరమణ పొందిన సమయంలో వీరి పెన్షన్ డబ్బులతో పాటు ఇతరత్రా సదుపాయాలు పొందే వీలుంటుంది. పనిచేస్తున్న ఉపాధ్యాయులు వారి సర్వీసును బట్టి తాము దాచుకున్న డబ్బులు అవసరాల కోసం తీసుకోవచ్చు. ఇల్లు రిపేరు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆరోగ్య రీత్యా ఎదురయ్యే సమస్యలకు జీపీఎఫ్ విభాగం నుంచి డబ్బులు పొందే వీలుంది. కానీ.. జిల్లా పరిషత్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తాము అవసరాల కోసం దాచుకున్న డబ్బుల కోసం వేలాది మంది ఉపాధ్యాయులు జిల్లా పరిషత్‌లోని జీపీఎఫ్ విభాగం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గతంలో పలుమార్లు ధర్నాలు నిర్వహించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. తాజాగా ఈ విద్యా సంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. తమ ప్రమేయం ఏమీ లేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ఏటా ఇదే తంతు జరుగుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

పార్ట్ ఫైనల్ రూ.18,99,40,000
ఫైనల్ పేమెంట్స్ (స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతి చెందిన వారివి)రూ.7,40,11,000
అడ్వాన్సులు రూ.1,60,49,000
రావాల్సిన బకాయిలు మొత్తం రూ. 28 కోట్లు

బకాయిలు ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు రూ.28 కోట్ల పైబడి ఉంటాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జీపీఎఫ్ బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై జీపీఎఫ్ విభాగం సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి వివిధ రకాల బిల్లులు 243 మంది ఉపాధ్యాయుల పార్ట్‌ఫైనల్, అడ్వాన్సులకు సంబంధించి దాదాపు 28 కోట్ల రూపాయలు చెక్కుల రాసినట్లు చెప్పారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌కు పంపామని.. ఈ–కుబేర్ వల్ల జాప్యం అవుతోందని.. అది ప్రభుత్వ పరిధిలోని అంశమని సమాధానమిచ్చారు.

పెండింగ్ బిల్లులన్నీ సకాలంలో చెల్లించాలి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 వేల మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ, ఆకస్మికంగా మృతిచెందిన వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా మానసిక క్షోభకు గురిచేయడం తగదు. ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ విభాగం నుంచి అత్యవసర నిమిత్తం డబ్బులు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కాలరాయడం భావ్యం కాదు. తొమ్మిది నెలలుగా 400 మందికిపైగా ఉపాధ్యాయులకు మంజూరై ఉన్న రూ.28 కోట్ల డబ్బులను వెంటనే చెల్లించాలి.

– తూముల తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కార్యదర్శుల గోడుపట్టదా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- నేటి నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె
- క్రమబద్ధీకరణతో పాటు ఆరు ప్రధాన డిమాండ్లతో సమ్మెలోకి..
- అధికారిక వాట్సాప్ గ్రూప్ నుంచి స్వచ్ఛందంగా వెనక్కి..

కరీంనగర్: తమపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని విడనాడి డిమాండ్లను పరిష్కరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. 2018 అక్టోబర్ 10న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జరిగిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియామకమయ్యారు. జిల్లాలో 313 గ్రామపంచాయతీలకు గాను 214 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియామకమై విధుల్లో కొనసాగుతున్నారు. మూడేళ్ల ప్రొబెషనరీ పీరియడ్‌తో నెలకు రూ.15 వేల వేతనంతో పనిచేస్తూ ఎనాటికైనా ఉద్యోగం క్రమబద్ధీకరణ అవుతుందనే ఆశతో విధుల్లో కొనసాగారు. గ్రామాల్లో ప్రభుత్వ పరంగా చేపట్టే అన్ని కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ గ్రామాలకు అవార్డులు, రివార్డులు రావడంలో వీరి శ్రమ అంతా ఇంతా కాదు. మూడేళ్ల గడువు పూర్తవ్వగానే ప్రభుత్వం మరో ఏడాదికి ప్రొబెషనరీ పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ 11తో గ్రామ కార్యదర్శుల పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయింది. దీంతో తమను క్రమబద్ధీకరిస్తూ నాలుగేళ్ల ప్రొబెషనరీ పూర్తయిన దరిమిలా ప్రొబెషనరీ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నోటీసులు అందజేశారు. ఈ మేరకు అధికారికంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ నుంచి స్వచ్ఛందంగా బయటకు వచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించి శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

కొరవడిన భద్రత..

పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగం చేస్తున్న సమయంలో ఏదైనా ప్రమాదాల బారినపడి మరణిస్తే ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. ఉద్యోగంలో చేరినప్పుడు ప్రొబేషన్ పీరియడ్ మూడేళ్లని చెప్పిన ప్రభుత్వం ఆ తరువాత మరో ఏడాది పొడగించింది. దీంతో ఈనెల 11వ తేదీతో సర్వీసు పూర్తయిన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది. కొందరు ప్రమాదాల బారిన పడి, మరికొందరు పని ఒత్తిడి తట్టుకోలేక, ఇతరత్రా కారణాలతో మరణిస్తే ఎలాంటి ప్రయోజనం అందక పోవడంతో ఆ కుటుంబాలు దిక్కులేని వారిగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి తమను కూడా జూనియర్ కార్యదర్శులుగా పరిగణించి ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను అందించి ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రధాన డిమాండ్లు..

- జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలి. గడిచిన నాలుగు సంవత్సరాల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలి.
- ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను అందరినీ జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలి. వారిని కూడా రెగ్యులర్ చేయాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్‌ని నిర్ధారించి ప్రకటించాలి.
- మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలి.
- 317 జీవో వల్ల నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలి. పరస్పర బదిలీలు, స్పౌజ్ బదిలీలకు అవకాశం కల్పించాలి.

తక్షణమే క్రమబద్ధీకరించాలి



ఎనాటికైనా ఉద్యోగం రెగ్యులరైజ్ అవుతుందన్న ఆశతో ప్రభుత్వం చెప్పిన పనులన్నీ చేస్తున్నాం. గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించి పంచాయతీలకు అవార్డులు, రివార్డులు తెస్తున్నాం. ఈనెల 11 నాటికి ఉద్యోగంలో చేరి నాలుగేళ్లవుతుంది. రెగ్యులరైజ్ చేయాల్సిన ప్రభుత్వం పనిభారం మోపడం సరికాదు. తక్షణమే నాలుగేళ్ల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలి.

– గున్నాల రాంకీ, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, రేకొండ

విస్మరించడం బాధాకరం



అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని విస్మరించడం బాధాకరం. తమపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదు. ఒకే గొడుగు కింద పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ఎక్కడ లేని విధంగా మూడు రకాలుగా విభజించి జేపీఎస్, ఓపీఎస్, సీనియర్ గ్రేడ్ కార్యదర్శులంటూ విభజించడం సరికాదు.

– కృపారాణి, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, సైదాపూర్

దళితరక్షణ నిధిని సకాలంలో అందించాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

కరీంనగర్: దళితబంధు ద్వారా లబ్ధిపొంది అనుకోని ప్రమాదాలతో నష్టపోయిన వారికి దళితరక్షణ నిధిని సకాలంలో అందించాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దళితరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో దళితులు ఆర్థిక అభివృద్ధి సాధించాలనే రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకం ప్రవేశపెట్టిందని అన్నారు. యూనిట్లను ప్రారంభించిన అనంతరం అనుకోని ప్రమాదాలతో నష్టపోతే ఆ నష్టాన్ని లబ్ధిదారులు భరించకుండా, యూనిట్లను తిరిగి ప్రారంభించేలా దళితరక్షణ నిధిని సకాలంలో అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్, శిక్షణ సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్, శిక్షణ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి సురేశ్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలో పూర్వ ప్రాథమిక విద్య కీలకం



అంగన్‌వాడీ చిన్నారులతో జిల్లా సంక్షేమ అధికారి సబిత, తదితరులు

కరీంనగర్: బాల్య దశలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పించే పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. నగరంలోని సవరన్ స్ట్రీట్ సెక్టార్ పరిధిలో మహిళా అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సింధు భవన్‌లో గురువారం ప్రీస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. కరీంనగర్ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా సబితా మాట్లాడుతూ, పిల్లల శారీరక, మానసిక, భాషాభివృద్ధి, సృజనాత్మకతతో పాటు సంపూర్ణ అభివృద్ధి అంగన్వాడీ కేంద్రాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. 5 ఏళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం ఎంతో అవసరమని, వారికి అంగన్వాడీల్లో అందించే బాలామృతం ఎంతో ముఖ్యమని చెప్పారు. ప్రీ స్కూల్‌ని ప్రతిబింబించేలా రూపొందించిన ప్లే హౌస్, ముగ్గులు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ నక్క పద్మ, సీడీపీఓ ఉమారాణి, సఖి అడ్మిన్ లక్ష్మి, డీసీపీఓ శాంత, సూపర్‌వైజర్ కోలా అరుణ, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ సంపత్, శైలజ, యాన్సన్ భరత్, పడమటింటి సంతోష్, వాసాల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ప్రాణాలు.. గాల్లో దీపాలు

- ఎంసీహెచ్‌లో పిల్లల వైద్యంపై పట్టింపు కరువు?
- ఇలా వచ్చి అలా వెళ్తున్న వైద్యులు
- నైట్ డ్యూటీలకు డుమ్మా.. నర్సులే దిక్కు
- ఆందోళన చెందుతున్న పిల్లల తల్లిదండ్రులు

'లక్షెట్టిపేటకు చెందిన మారుపాక విష్ణు–హర్షిణి దంపతులకు ఎంసీహెచ్‌లో జరిగిన రెండో కాన్పులో పాప జన్మించగా, ఆ పాపకు జ్వరం వచ్చింది. పరీక్షించేందుకు పిల్లల వైద్యుడు లేకపోవడంతో నర్సు మందులు వేసింది. చివరకు ఆ పాప వైద్యం అందక బుధవారం మృత్యువాత పడింది. డ్యూటీలో ఉండాల్సిన వైద్యుడు విధుల్లో లేకపోవడమే ఈ దారుణానికి కారణమని బాధితులు ఆరోపిస్తూ ఆందోళన చేశారు.'

– ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా వైద్యులు కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



మాతా శిశు ఆరోగ్యకేంద్రం

కరీంనగర్‌టౌన్: ఉత్తర తెలంగాణలోనే అత్యధిక డెలివరీలు చేసి రికార్డు సృష్టిస్తున్న కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో శిశువుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారుతున్నాయి. అధికారులకు డెలివరీలపై ఉన్న శ్రద్ధ.. పిల్లలకు వైద్యం అందించడంపై లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. గైనకాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులు సరిపడా ఉన్నప్పటికీ వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఆవహిస్తోంది. డెలివరీ అనంతరం పుట్టిన పిల్లలకు వైద్యం అందించాల్సిన వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పిల్ల ల వైద్యుల కోసం ఎదురుచూసి చివరకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారికి మాత్రం అక్కడి సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులకు సంబంధించిన ఆసుపత్రుల అడ్రస్‌లే ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానాలో ఉచితంగా అందించాల్సిన వైద్యసేవలకు సొంత ఆసుపత్రిలో ఖరీదు తీసుకుని చికిత్స చేస్తున్నారు. పైగా శిశువుకు ఏదో అయిపోతుందని భయపెట్టి రోజుల తరబడి ఆసుపత్రిలో ఉంచే పరిస్థితి కల్పించి అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఈ ఘటనలపై స్పందించకపోవడం విచారకరం.

ఆధునిక వసతులు

పిల్లల ఐసీయూలో నెలలు నిండక అనారోగ్యంతో జన్మించిన పిల్లలకు చికిత్స అందించేందుకు వార్మర్లు, జాండీస్, ఇతర అనారోగ్య కారణాలతో పుట్టిన పిల్లలకు చికిత్స అందించేందుకు ఫొటోథెరపీ యంత్రాలు, పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడే చిన్నారులకు ఊపిరితిత్తుల్లోకి ఆక్సిజన్ అందించేందుకు సీప్యాప్ యంత్రాలు, తీవ్ర శ్వాస ఇబ్బందులతో జన్మించిన పిల్లలకు వెంటిలేటర్ వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. ఐదుగురు పిల్లల వైద్యులున్నా వైద్యం అందకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు..

ఎంసీహెచ్‌లో లక్షలు ఖర్చుపెట్టి ప్రత్యేకంగా నవజాత శిశు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్నట్లు శిశువులను కాపాడేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు ఉపయోగించి ప్రాణాలు పోయాల్సిన వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారని అక్కడి సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు. ఇక రాత్రి విధులు నిర్వహించాల్సిన వైద్యులు ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడడం లేదు. రాత్రి ఎవరికి ఏం జరిగినా నర్సులే దిక్కవుతున్నారు. ప్రైవేటు వైద్యంపై మోజుతో సొంత ఆసుపత్రుల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు సక్రమంగా వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని శిశువుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విచారణకు కమిటీ వేశాం..

మూడు రోజుల పాప చనిపోయిన ఘటనపై విచారణకు కమిటీ వేశాం. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయి. వైద్యులు విధులకు డుమ్మా కొట్టకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరిస్తాం.

– డాక్టర్ జ్యోతి, ఆర్‌ఎంఓ

రామడుగులో బాలుడి కిడ్నాప్ కలకలం

రామడుగు(చొప్పదండి): మండల కేంద్రం రామడుగులో గురువారం మూడేళ్ల బాలుడి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. స్థానికుల వివరాలు.. అంబేడ్కర్ చౌరస్తా వద్ద నివాసం ఉంటున్న వానరాశి వెంకటేశ్ కుమారుడు రాంప్రసాద్ (3) గురువారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఇదే అదనుగా చూసిన రామడుగుకు చెందిన శిరీష బాలుడిని తువ్వాలలో చుట్టి కిడ్నాప్ చేసి ఆటోలో తీసుకెళ్లింది. బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఆరా తీశారు. కాగా బాలుడిని మహిళ తీసుకెళ్లిన విషయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు ఆటోను వెంబడించారు. ఆటో వెదిర శివారులోని వెంకటగిరి రైల్వే ట్రాక్ వద్ద గమనించి నిలిపివేశారు. బాలున్ని తీసుకెళ్లిన మహిళను రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు.



బాలుడు రాంప్రసాద్

క్లుప్తంగా

నేడు జమ్మికుంటకు దత్తాత్రేయ రాక

జమ్మికుంట: పట్టణంలోని కేవీకే ఆవరణలో మాజీ శాసన సభ్యుడు, గ్రామ నవ నిర్మాణ్ సమితి వ్యవస్థాపకుడు దివగంత పరిపాటి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా హాజర వుతారని గ్రామ నవ నిర్మాణ్ సమితి ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. రైతులు, మేధావులు, యువకులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీజన్ పాస్ ధరలు తగ్గింపు

కరీంనగర్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం మంత్లీ సీజన్ పాస్ ధరలను స్లాబ్ సిస్టం నుంచి తీసివేసి కిలోమీటర్ల ప్రకారం లెక్కించి మంత్లీ సీజన్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందని కరీంనగర్–1 డిపో మేనేజర్ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నుంచి హనుమకొండ మధ్య ఎక్స్‌ప్రెస్ మంత్లీ సీజన్ టికెట్ ధర ప్రస్తుతం రూ.4,450 ఉండగా, గురువారం నుంచి రూ.4,050 ఉంటుందని పేర్కొన్నారు. 20 రోజుల చార్జీ వసూలు చేసి 30 రోజుల ప్రయాణానికి అనుమతిస్తారని తెలిపారు. పాసు అన్ని హాలిడే రోజుల్లో కూడా పనిచేస్తుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని చిల్లర సమస్య తప్పించుకొని సీజన్ టికెట్ ద్వారా సాఫీగా ప్రయాణం చేయవచ్చని పేర్కొన్నారు.

తగ్గిన పత్తి ధర

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మార్కెట్‌లో పత్తి ధరలు రోజురోజుకు తగ్గుతున్నాయి. బుధవారం క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,700 కాగా గురువారం రూ.100 తగ్గి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,600 పలికింది. మార్కెట్‌కు 56 వాహనాల్లో 772 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,250 చెల్లించారు. గన్నీ సంచుల్లో 9 మంది రైతులు 10 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,000 పలికింది. మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

ఓపెన్ పరీక్షలకు 118 మంది గైర్హాజరు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో గురువారం 118 మంది గైర్హాజరయ్యారు. ఉదయం టెన్త్‌లో 46 మంది విద్యార్థులకు 41, ఇంటర్‌లో 922 మంది విద్యార్థులకు 812, మధ్యాహ్నం పరీక్షకు 30 మంది విద్యార్థులకు 27 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చలువాజి నాగేశ్వరరావు తెలిపారు.

కేదార్‌నాథ్‌లో కరీంనగర్ వాసి మృతి

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తీర్థయాత్రల నిమిత్తం కేదార్‌నాథ్‌కు వెళ్లి అనారోగ్య సమస్యతో గుడి సమీపంలో మృతి చెందాడు. ఆయన బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో నివాసముంటున్న వొల్లాల రాజమౌళి (72) అలుగునూర్‌లో అరుణోదయ ఇండస్ట్రీస్ అనే రైస్ మిల్ నడుపుతున్నాడు. తన భార్య శ్యామల, కూతురు, అల్లుడితో కలిసి నాలుగు రోజుల క్రితం కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లాడు. బుధవారం ఆలయానికి వెళ్లి దర్శించుకున్న తర్వాత అనారోగ్య సమస్యతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మరణవార్త తెలియగానే కుటుంబ సభ్యులు హరిద్వార్‌కు చేరుకున్నారు. మృతదేహాన్ని కేదార్‌నాథ్ నుంచి హరిద్వార్‌కు తీసుకొచ్చి అక్కడే శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహించారు.

రేషన్ ‘రైస్’ రగడ

- జమ్మికుంట శ్రీశక్తి మిల్లులో రీసైక్లింగ్ చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదు
- ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు
- సివిల్ సప్లై గోదాం వద్ద లారీల బియ్యం శాంపిల్ సేకరణ
- అధికారుల పొంతనలేని సమాధానాలు


మార్కెట్‌లో బియ్యం లారీలు

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటలో నాలుగు రోజులుగా రేషన్ రైస్‌పై రగడ కొనసాగుతోంది. శ్రీశక్తి ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌లో రేషన్ రైస్ రీసైక్లింగ్ జరుగుతుందని స్థానిక వ్యాపారి కొండ్లే పాపయ్య రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా ఈ తతంగం బహిర్గతమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మిల్లులో తనిఖీలు చేపట్టి వివరాలు సేకరించారు. అనంతరం సివిల్ సప్లై గోదాం వద్దకు చేరుకున్న బియ్యం ఏసీకే లారీలను నిలిపివేసి బియ్యాన్ని పరిశీలించి శాంపిల్ సేకరించారు. లారీలను స్వాధీనం చేసుకొని స్థానిక మార్కెట్ యార్డులో పెట్టించారు. ఈ ఘటనపై ఒక్కో అధికారి ఒక్కో రకంగా స్పందిస్తున్నారు. కాగా ఇవి రేషన్ బియ్యమా.. సీఎంఆర్ బియ్యమా అనేది తేల్చాల్సి ఉంది. హుజురాబాద్‌లోని ఓ మిల్లు వే బిల్లు ద్వారా శ్రీశక్తి రైస్‌మిల్లు యజమానులు బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించారని తెలుస్తోంది. నిజాలు వెలుగులోకి వస్తే రెండు మిల్లుల సీజ్‌తోపాటు నిర్వాహకులపై కేసులు నమోదు అయ్యే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

జరిగింది ఇది..

శ్రీశక్తి రైస్‌మిల్లులో సీఎంఆర్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం అమ్ముకొని వాటి స్థానంలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి రీసైక్లింగ్ ద్వారా సివిల్ సప్లైకి పెడుతున్నారని కొండ్లే పాపయ్య ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గత సోమవారం రాత్రి తనిఖీ చేపట్టారు. సివిల్ సప్లై గోదా వద్ద లారీల్లో బియ్యం శాంపిల్ సేకరించి, ల్యాబ్‌కు పంపాలని జిల్లా సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్‌కు సమాచారం అందించారనే విషయం తెలిసిందే.

పొంతన లేని సమాధానాలు

ఈఘటనపై జమ్మికుంట సివిల్ సప్లై గోదాం మేనేజర్ రాజేందర్ మాట్లాడుతూ, గత 21న హుజురాబాద్‌లోని ఓ మిల్లు చెందిన 8లారీలు బియ్యం దిగుమతి చేసుకొని పరిశీలించామని, 4 లారీలు రిజెక్టు చేశామన్నారు. కాగా రిజెక్టు అయితే మిల్లు యజమాని సదరు బియ్యం ఎందుకు తీసుకపోలేదనే అనుమానాలు తావిస్తున్నాయి. గోదాం మేనేజర్ శాంపిల్ పరిశీలించి బియ్యం తీసుకున్నారు. కానీ రిజెక్టు చేశామని పేర్కొంటున్నాడు. గత సోమవారం మరో 8 లారీలు రాగా ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారి తనిఖీలు చేసి లారీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా డీఎం శ్రీకాంత్‌కు వివరాలు అందించామని, శాంపిల్ టెస్ట్ చేయాలని తెలిపామని ఓఎస్‌డీ ప్రభాకర్ పేర్కొంటున్నారు. కానీ గత నాలుగు రోజులుగా కొత్త మార్కెట్‌లో లారీలు నిలిపి ఉన్నాయి. ఈఘటనపై నిజాలు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

రిజెక్టయిన లారీల తరలింపు

జమ్మికుంట సివిల్ సప్లై గోదాంలో వివాదాస్పదమైన 4 లారీల బియ్యం దిగుమతి చేసుకున్నారు. అనంతరం ఆ లారీల్లోని బియ్యాన్ని పరిశీలించి, ఈ నెల 24న రిజెక్ట్ చేశారు. సంబంధిత మిల్లు యజమాని బియ్యాన్ని గురువారం తరలించారు. కాగా రిజెక్టయిన బియ్యంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, బియ్యంలో నూకలు, డ్యామేజ్, డిస్‌కలర్‌గా ఉన్నాయని అందుకే రిజెక్ట్ చేశామని అధికారులు పేర్కొన్నారు. హుజురాబాద్‌కు చెందిన ఓ మిల్లు వే బిల్లుపై బియ్యం వచ్చాయని, సదరు మిల్లు యజమాని రిజెక్టయిన బియ్యాన్ని తీసుకెళ్లాడని సివిల్ సప్లై జమ్మికుంట మేనేజర్ రాజేందర్ తెలిపారు. కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వివరాలు సేకరించిన లారీల్లోని బియ్యాన్ని సివిల్ సప్లై గోదాం వద్ద అధికారుల ఆదేశాల మేరకు టెస్టింగ్ కోసం తీసుకోనున్నట్లు గురువారం పేర్కొన్నారు.

విచారణ చేసి చర్యలు తీసుకోవాలి



శ్రీశక్తి మిల్లులో సీఎంఆర్‌కు సంబంధించి 50 లారీల ధాన్యం నిల్వలు తక్కువ ఉన్నాయి. రేషన్ బియ్యం కొనుగోలు చేశారనే ఫిర్యాదుతో బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి అధికారులకు దొరకకుండా వేరే మిల్లు వే బిల్లులు సృష్టించి లారీలను గోదాంకు పంపారు. ఈఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కొండ్లే పాపయ్య, ఫిర్యాదుదారు, జమ్మికుంట

3 నుంచి శుభముహూర్తాలు

- మే, జూన్ నెలల్లో మొత్తం 23 రోజులు..
- మళ్లీ ఆగస్టు 19 నుంచి డిసెంబర్ 31 వరకు మంచి రోజులు

విద్యానగర్(కరీంనగర్): మే నెల నుంచి పెళ్లి మంత్రాలు, బాజాబజంత్రీలు మారుమోగనున్నాయి. గురు మూఢం కారణంగా ఏప్రిల్ నెలలో శుభముహూర్తాలు లేక పెళ్లి పేరంటాలకు బ్రేక్ పడింది. మే 3 బుధవారం నుంచి శుభముహూర్తాల నేపథ్యంలో జిల్లాలో పెళ్లిసందడి నెలకొంది. పెళ్లి సామగ్రి దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుండగా, పెళ్లి మంటపాలు ముస్తాబవుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా, ఈవెంట్ ఆర్గనైజర్లు పెళ్లి కార్డుల ఆధారంగా పెళ్లివారిని సంప్రదిస్తున్నారు. వంటవారు, బాజాబజంత్రీలు, నాదస్వరం, పురోహితులు రెడీగా ఉన్నారు.

శుభ ముహూర్తాలు ఇలా..

వచ్చే నెల 3 నుంచి వరసగా 4,5,6,7,8,10,11,12,13,21,26,27,28,30,31, జూన్‌లో 1,3,7,8,9,10,11 తేదీల్లో ముహూర్తాలు ఉండడంతో జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో శుభకార్యాలు జరుగనున్నాయి. కాగా జూలై ఆషాఢం అధిక శ్రావణం కావడంతో ముహూర్తాలు లేవు. మళ్లీ ఆగస్టు 19 నుంచి మంచి రోజులు ప్రారంభమై డిసెంబర్ 31 వరకు ఉన్నాయి.

వ్యాపారవర్గాల్లో సందడి..

పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు, పెళ్లి వస్తువుల దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. ఏప్రిల్‌లో శుభకార్యాలు లేక వ్యాపారాలు సరిగా సాగలేదు. ఇప్పటికే కరీంనగర్‌తో పాటు చుట్టూ 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫంక్షన్ హాల్స్ బుక్ అయినాయి. ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో వేదబ్రాహ్మణులు, బ్యాండ్ మేళం వారు, సౌండ్ సిస్టమ్, లైటింగ్, డెకరేషన్ వాళ్లు, క్యాటరింగ్, వంటలు చేసేవారు, ఈవెంట్ ఆర్గనైజర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో 23 రోజులు..



గత నెల రోజులుగా ముహూర్తాలు లేకపోవడం వల్ల చాలా పెళ్లిళ్లు మే, జూన్ నెలలో ఉన్న మంచి రోజుల్లో జరుగనున్నాయ. రెండు నెలల్లో మొత్తం 23రోజులు శుభ ముహూర్తాలున్నాయి. జూలైలో మంచి రోజులు లేవు.

– మంగళంపల్లి శ్రీనివాసశర్మ, కరీంనగర్ నగర వైదిక పురోహితుడు

ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2022–23 సంవత్సరానికి జిల్లాలోని శారీరక వైకల్యం, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగుల సహాయార్థం ఉపకరణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.సబితకుమారి ప్రకటనలో తెలిపారు. ఆదాయ పరిమితి అర్బన్ ఏరియాలో రూ.2 లక్షలు, రూరల్ ఏరియా వారికి రూ.1,50,000 ఉండాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో మే 5 లోపు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ నియమ నిబంధనల మేరకు పరిశీలించి అర్హత గల దివ్యాంగులను ఎంపిక చేసి సదరు జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపడం జరుగుతుందన్నారు. అర్హులకు ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేయబడునని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న వారు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులను జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో సమర్పించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం కార్యాలయ పనివేళల్లో నేరుగా సంప్రదించాలని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

కరీంనగర్: కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, మాతాశిశు హాస్పిటల్‌లో ఉద్యోగ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఉద్యోగాలు భర్తీ చేసిన సిబ్బందిని గుర్తించి న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2015 నుంచి నేటి వరకు ఎవరైతే ఉద్యోగాల నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఉద్యోగాలు భర్తీ చేశారో నిజనిర్ధారణ కమిటీ వేసి న్యాయ విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. నోటిఫికేషన్‌లో మెరిట్ ప్రాతిపదికన లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులను ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేస్తామని చెప్పి విరుద్ధంగా భర్తీ చేయడం ద్వారా అర్హత గల అభ్యర్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందించి తక్షణమే న్యాయ విచారణ జరుపుతానని తెలిపారని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నరేష్, సునీల్, నవీన్ తదితరులు ఉన్నారు.


కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోళ్లు త్వరగా చేపట్టాలి

కొత్తపల్లి(కరీంనగర్): వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి త్వరితగతిన ధాన్యం కాంటా వేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. కొత్తపల్లి మండలం కొత్తపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోని కేంద్రాలను గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈదురుగాలులు, వడగండ్ల వాన వల్ల యాసంగి వరిపంటకు తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి త్వరగా కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు కేంద్రాల్లో తాటిపత్రులను అందుబాటులో ఉంచాలన్నారు. వరి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, పత్తికి రూ.50 వేలు, మామిడి తోటలకు రూ.75వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వే పేరిట కాలయాపన చేయకుండా వెంటనే నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇక్కడి వనరులను ఇతర రాష్ట్రాల రైతులకు ఖర్చు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆరీఫ్, రియాజొద్దీన్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

తడిసిన వరి ధాన్యం కొనాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: రైతులు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయడం లేదని, అలసత్వం ప్రదర్శిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మానకొండూర్ మార్కెట్ యార్డు, ముంజంపల్లి, దేవంపల్లిలో కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా పరదాలు లేవని మండిపడ్డారు. తాలు పట్టుటకు యంత్రాలు కూడా లేవన్నారు. యంత్రాలకు మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, ఎంపీటీసీ చలిగంటి సంపత్, జిల్లా నాయకులు తాళ్లపల్లి సంపత్‌గౌడ్, రామిడి తిరుపతి, కొత్తకొండ శంకర్, గసిగంటి సంపత్, మర్రి ఓదెలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

ఉద్యోగాలకు కావాల్సిన స్కిల్స్ పెంచుకోండి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- శాతవాహన వీసీ ప్రొఫెసర్ మల్లేశం
- శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే అదనపు నైపుణ్యాలు పెంచుకోవాలని, ఉద్యోగాలకు కావాల్సిన స్కిల్స్ పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శాతవాహన వీసీ ప్రొఫెసర్ మల్లేశం అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి తమ లక్ష్యంపై దృష్టి పెట్టాలని, కోర్సులు పూర్తవగానే ఉద్యోగాలు సాధించేలా సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం ప్రతిభ గల విద్యార్థులకు వీసీ చేతుల మీదుగా బహుమతులు అందించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నష్టం సర్వే చేసి పరిహారం అందించాలి

రామడుగు(చొప్పదండి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటల సమగ్ర సర్వే చేసి ఎకరాలకు రూ.50 వేల పరిహారం అందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వెదిర గ్రామంలో కరీంనగర్– జగిత్యాల ప్రధాన రహదారిపై వివేకానంద చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ రామడుగు మండలంలో పర్యటించి నెల రోజులు దాటినా పంట నష్ట పరిహారం అందించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రవిశంకర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. కాగా మేడిపల్లి సత్యంను చొప్పదండి సీఐ రవీందర్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు వెన్న రాజమల్లయ్య, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరవేని తిరుపతి, పురమల్ల మనోహర్, చిలివేరి నారాయణ, చర్ల పద్మ, దుబ్బాసి బుచ్చయ్య, కోల రమేష్, జవ్వాజీ హరీష్, పులి ఆంజనేయులుగౌడ్, రామిడి రాజిరెడ్డి, కాడె శంకర్, జీవన్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్, రాములుగౌడ్, శంకర్, లక్ష్మణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

119 మంది విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తదితరులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో వివిధ కంపెనీల్లో 119 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. మొదట హాజరైన విద్యార్థుల పేర్లు నమోదు చేసుకొని తర్వాత దశల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ సీహెచ్.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సంపత్‌కుమార్ రెడ్డి, జి.శ్రీధర్‌రావుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


నితిన్‌సాయి(ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి నితిన్‌సాయి(16) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు గురువారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. దూడం లావణ్య– శ్రీనివాస్ దంపతుల కుమారుడు నితిన్ ఈ నెల 17న స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కరీంనగర్‌లోని ఉజ్వలపార్కు వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నితిన్‌ను వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతిచెందాడు. కాగా నితిన్ ఇటీవలే నగునూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాశాడు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందగా, తల్లిదండ్రులకు తీరని కడుపు కోత మిగిలింది.


జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించే కంటి వెలుగు శిబిరాల వివరాలను డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్ నగరంలో 2,9,23,24,25,26,34,38,43,52,59వ డివిజన్‌లలో, హుజురాబాద్ పట్టణంలో 21వ వార్డు, అదే మండలంలోని రాంపూర్, సింగపూర్ శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణం 15వ వార్డు, అదే మండలంలోని కోరపల్లి, మాచినపల్లి, వీణవంక మండలం మల్లన్నపల్లి, వల్భాపూర్, చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి, నవాబుపేట, చొప్పదండి మండలం ఆర్నకొండ, మంగళపల్లి, ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లి, గంగాధర మండలం తాడిజెర్రి, గట్టుబూత్కూర్, రామడుగు మండలం వెలిచాల, వెంకట్రావుపల్లి, కొత్తపల్లి మండలం చింతకుంట, ఖాజీపూర్, కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్, మానకొండూరు మండలం గట్టుదుద్దెనపల్లి, అన్నారం, దేవంపల్లి, సైదాపూర్ మండలం జాగీర్‌పల్లి, రాయికల్, కేశవపట్నం మండలం అంబాల్‌పూర్, ధర్మారం, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, నేదునూరు, నర్సింగాపూర్, గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుకు (రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే ఉద్యోగ ప్రకటనలకు) నిరుద్యోగ అభ్యర్థులకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.నతానియేలు ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు 70 సీట్లు, ఎస్టీలకు 10 సీట్లు, బీసీలకు 20 సీట్లు, మహిళలకు 33.3 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని పేర్కొన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం, బీటెక్, బీఎస్సీ(అగ్రి), బీఫార్మసీ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈనెల 28 నుంచి మే 14 వరకు జ్టిఇ// ట్టుఠీఛిజీటఛి ్స. ఛౌ. జీఝ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. మే 21న ఎంట్రన్స్ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు, మరిన్ని వివరాలకు 98852 18053, 95734 01227, 91776 05511 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎవరెస్ట్‌ను అధిరోహించిన సరిత


బేస్ క్యాంపు వద్ద సరిత

కరీంనగర్: కరీంనగర్‌కు చెందిన అన్నంరాజ్ సరిత రెండు దశాబ్దాల క్రితం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డారు. ఆమెకు పర్వతారోహనపై ఆసక్తి ఉండగా, ఈ నెలలో ప్రారంభమైన ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లారు. ఈనెల 8న ప్రారంభించి 19వ తేదీన ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కి చేరారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 5,364 మీటర్లు ఉంటుంది. గతంలో కూడా సౌత్ అమెరికాలోని మచ్– పిచ్ కొండలను అధిరోహించారు. తిరుగు ప్రయాణంలో ఖాట్మండు నుంచి కరీంనగర్‌కు చేరుకున్నారు. సరిత భర్త అన్నంరాజ్ వెంకటేశ్వరరావు జిల్లా పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకొని అమెరికాలో ఇంజినీర్‌గా స్థిరపడ్డారు. సరిత వెల్స్‌ఫార్గో బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సరితను మిత్ర బృందం ఐత మంజుల, రాచవరం పద్మ, జిల్లా పరిషత్ ఉద్యోగ మిత్ర బృందం ఐత కిషన్ ప్రసాద్, నీలగిరి దివ్యదర్శనరావు, జెట్టి సంపత్‌కుమార్, తదితరులు అభినందించారు.

పోచమ్మ బోనాలు



కరీంనగర్ కల్చరల్: జిల్లా కేంద్రంలో బీరప్ప–మహంకాళమ్మ ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కురుమ కులస్తులు గురువారం పోచమ్మ బోనాలు తీశారు. విద్యానగర్, సంతోష్ నగర్, నవీన కురుమవాడ, జ్యోతినగర్‌కు చెందిన మహిళలు కోతిరాంపూర్, జ్యోతినగర్, నవీన కురుమవాడల్లోని అమ్మవారి ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. ఐదేళ్లకోసారి నిర్వహించే బీరప్ప–కమరాతి కల్యాణ మహోత్సవంలో భాగంగా బోనాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కర్రె అనిల్ కుమార్, ముఖ్య సలహాదారు కర్రె ప్రవీణ్ కుమార్, సలహాదారులు కర్రె రాజు, బీర్ల నర్సయ్య, అధ్యక్షుడు బీర్ల బీరయ్య, ప్రధాన కార్యదర్శి అవురగొండ రవి, ఉపాధ్యక్షులు బీర్ల పెద్ద కనకయ్య, ఎలుకపెల్లి బీరయ్య తదితరులున్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



కొత్తపల్లి: మండలంలోని బద్దిపల్లిలో గల స్వయంభూ శ్రీ అలివేలు మంగ శ్రీలక్ష్మీ సహిత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం ఆలయ గోపురానికి మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం నూతనంగా నిర్మించిన పుష్కరిణి ప్రతిష్ఠ జరిపి, స్వామివారికి చక్రస్నానం చేయించారు. జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు మారుతిస్వామి, అచ్యుత్ స్వామి తదితరుల వేదమంత్రోచ్చరణల మధ్య బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరిగాయి. సర్పంచ్ రాచమల్ల మధు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి, టి.శ్రీనివాస్, రాజు, శ్రీకాంత్, నారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



హోమం చేస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, స్వామివారి విగ్రహానికి ఫలరస పంచామృతాభిషేకం, విశేషాలంకారం చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. సాయంత్రం పడిపూజ జరిపారు. కార్యక్రమంలో ఈవో కొన్న కాంతారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వచ్చే నెలలో కరీంనగర్‌లో ఎంఐఎం అధినేత పర్యటన

విద్యానగర్: వచ్చే నెలలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కరీంనగర్‌లో పర్యటిస్తారని పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. గురువారం నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల శంఖారావం పూరించడానికి అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేసేలా చూడాలని సూచించారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఫిరోజ్ అఖిల్, కార్పొరేటర్ ఎండీ.శర్ఫుద్దీన్, నాయకులు ఆతీన, అలీబాబా తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమాఖ్య అధ్యక్షుడికి సన్మానం



కోటేశ్వర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తపల్లి: జాతీయ చేనేత సమాఖ్య కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపల్లి పట్టణానికి చెందిన డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మంచికట్ల కోటేశ్వర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు గురువారం కొత్తపల్లిలో ఘనంగా సన్మానించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్, కౌన్సిలర్ ఎం.వేణుగోపాల్, జెడ్పీ కో–ఆప్షన్ మాజీ సభ్యుడు జమీలొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ఎస్కే.బాబా, మునావర్ ఖాన్, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు దూస మునీందర్, పద్మశాలీ సంఘం పట్టణ శాఖ కోశాధికారి కట్ల సుధాకర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు కె.వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుంటి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మంకమ్మతోటలో గల సహస్ర జూనియర్ కళాశాలలో సామాజిక అసమానతలు అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనం ఆలోచింపజేసింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు తొలగితేనే రాజ్యాంగం ఆశించిన సమసమాజ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. నేడు మనం అనుభవిస్తున్న మార్పు ఫలితాలు మరింత ప్రగతితో భావితరాలకు అందించాల్సిన బాధ్యత కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులపై ఉందని తెలిపారు. కూకట్ల తిరుపతి మాట్లాడుతూ.. సామాజిక అంశాలపై స్పందిస్తూ కవిత్వం రాయాలన్నారు. అనంతరం కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రమణాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్, రాంనారాయణ, పురుషోత్తం సతీశ్, చల్లూరి రవి, మియాపురం శ్రీనివాస్, దేవదాసు, రాజయ్య, రాజేశ్వర్, రవి, విజయశ్రీ, సవ్యసాచి, దేవధనం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బహదూర్‌ఖాన్‌పేట, చామనపల్లి, ఎలబోతారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య గురువారం ప్రారంభించారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు భూమయ్య, బోగొండ లక్ష్మి, కట్ల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రామక్క, ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ చలమయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం భార్గవ, ఐలయ్య, లింగారెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్.. విలేజ్ టు సిటీ

- ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో కళకళ
- కార్పొరేషన్‌లో విలీనమై ఈస్ట్, వెస్ట్ జోన్లుగా విభజన
- ఆ రోజులు తిరిగి రావంటున్న స్థానికులు



కిసాన్‌నగర్‌లోని జంబి గద్దె

విద్యానగర్: కిసాన్‌నగర్ ఒకప్పుడు పంట పొలాలు, ఎడ్లు, నాగళ్లతో, ధాన్యాన్ని నింపుకున్న ఎడ్ల బండ్ల రాకపోకలతో కళకళలాడిన ప్రాంతం. ఎటు చూసినా పచ్చని చెట్లు, పొలాల గట్లు, కాలిబాటలు, మట్టి బాటలే కనిపించేవి. పక్షుల కిలకిల రావాలు, పొలాల్లో పని చేసే కష్టజీవుల పాటలతో ప్రకృతి పరవశించేది.

జై కిసాన్ నినాద స్ఫూర్తితో..

కిసాన్ నగర్ కరీంనగర్ శివారు ప్రాంతంగా గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. అప్పటి వార్డు సభ్యుడు మెంగని హన్మంతు జై కిసాన్ నినాద స్ఫూర్తితో ఈ ప్రాంతానికి కిసాన్‌నగర్ అని పేరు పెట్టి, అట్టముక్కలపై రాయించాడు. ప్రధాన రహదారిపై, మెంగని, సిరిపురం ఇంటి పేర్లు ఉండే వాళ్లు నివసించే ప్రాంతాల్లో, గాండ్ల పెద్దన్న ఇంటి వద్ద ఉండే పెద్ద వేప చెట్టుకు తగిలించాడు. అప్పటి పెద్ద మనుషులు మెంగని నారాయణ, మంచాల కొమురయ్య, పసుల నారాయణ, మొగిలి నరసయ్య, కడార్ల శంకరయ్య, పసుల సాయిరెడ్డి, సింగిరెడ్డి చొక్కారెడ్డి తదితరులవే ఈ ప్రాంతంలో వ్యవసాయ కుటుంబాలు. ప్రత్యేకించి ఆకుల వంశస్తులు కిసాన్ నగర్ పేరును ప్రాచుర్యంలోకి తీసుకురాగా చివరికి అదే స్థిరపడిపోయింది.

జీపీ నుంచి కార్పొరేషన్‌లో విలీనం..

కిసాన్ నగర్ శివారు ప్రాంతాలు రోజురోజుకూ విస్తరిస్తుండటంతో గ్రామ పంచాయతీలు అయిన రాంపూర్, రాంనగర్ 1987లో మున్సిపాలిటీలో కలిశాయి. తర్వాత కాలంలో పట్టణ విస్తరణ జరిగి, 32 వార్డులు గల మున్సిపాలిటీగా క్రమంగా 50 డివిజన్లుగా, పరిసర గ్రామాల విలీనం వల్ల ప్రస్తుతం 60 డివిజన్లతో కార్పొరేషన్‌గా ఉంది. కిసాన్‌నగర్ 25వ డివిజన్ పరిధిలోకి రాగా ప్రస్తుతం కార్పొరేటర్‌గా ఎడ్ల సరిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

జోన్‌లుగా విభజన.. సూచికల ఏర్పాటు

కిసాన్ నగర్ పరిధి విస్తరించడంతో డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల సరిత కిసాన్ నగర్‌ను ఈస్ట్, వెస్ట్ జోన్లుగా విభజించారు. మైత్రి కన్వెన్షన్ నుంచి రైల్వే ట్రాక్ వరకు ఎడమ భాగం వైపు ఉన్న ప్రాంతాన్ని పశ్చిమ జోన్‌గా, సూర్యుడు ఉదయించే వైపు ఉన్న ప్రాంతాన్ని తూర్పు జోన్‌గా విభజించి, సొంత ఖర్చుతో ప్రజల సౌలభ్యం కోసం ఏ వీధి ఏ జోన్ పరిధిలో ఉందో తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతీ బోర్డుపై రైతు బొమ్మను ముద్రించడం విశేషం.

సీసీరోడ్లు వేయించాం



కార్పొరేషన్ స్థాయి రావడంతో డివిజన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అన్ని వీధుల్లో సీసీరోడ్లు వేయించాం. అడ్రస్ పరంగా ప్రజలు ఇబ్బంది పడొద్దని డివిజన్‌ను ఈస్ట్, వెస్ట్ జోన్లుగా విభజించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయించాం.

– ఎడ్ల సరిత, 25వ డివిజన్ కార్పొరేటర్

చెట్ల కింద ఆడుకునేవాళ్లం



కిసాన్ నగర్ ప్రస్తుత జంబి గద్దె ప్రాంతంలో భారీ చింత చెట్లు ఉండేవి. బడికి సెలవు వచ్చిందంటే దోస్తులతో వచ్చి ఆ చెట్ల కింద ఆడుకునేవాళ్లం. ఇప్పుడు చింత చెట్లు కొన్ని ఉన్నప్పటికీ పొలాలన్నీ పోయి ఇళ్ల నిర్మాణం జరిగింది. – రావుల సుధాకర్, కిసాన్ నగర్

చింతకాయలు తెంపుకునేవాళ్లం



ఆదివారం వచ్చిందంటే చాలు నేను మా వాడలో ఉన్న నా స్నేహితులతో కలిసి కిసాన్ నగర్‌లోని పొలాలు, చెట్ల వెంట తిరిగేవాన్ని. ఎగిరెగిరి చింత చెట్లకు ఉన్న చింతకాయలు తెంపుకునేవాళ్లం. ఆ రోజులు గుర్తొస్తూ ఉంటాయి.

– తూము నారాయణ, సుభాష్‌నగర్

పూర్తి సిటీగా మారింది



కిసాన్‌నగర్ మొత్తం పంట పొలాలే ఉండేవి. పాలపిట్టలు, కొంగలు అరుస్తుంటే మేమూ వాటిలా అరిచేవాళ్లం. ఇప్పుడు ఈ ప్రాంతం పూర్తి సిటీగా మారింది. చెట్లు, పొలాలు ఏం లేవు. ఆ రోజులు ఎప్పటికీ తిరిగిరావు. – ఎండీ.ఆరిఫ్ అహ్మద్, కార్ఖానగడ్డ

చిత్ర కథ — ఇటుకలు కరిగె.. నష్టం జరిగె



ఇటీవల కురిసిన వర్షాలకు ఇటుక బట్టీలు అతలాకుతలమయ్యాయి. తయారీ తర్వాత ఆరబెట్టిన ఇటుకలు తడిసి ముద్దవడంతో యజమానులు తీవ్రంగా నష్టపోయారు. ఇరుకుల్ల వాగు సమీపంలో పలువురు ఏర్పాటు చేసిన బట్టీల్లో సగానికి పైగా ఇటుకలు మట్టిలో కరిగిపోయాయి. మిగిలిన ఇటుకలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్యాబోధన



కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని మారుతి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు మంగ, కృష్ణవేణి, రేవతి, మంజుల, శ్యామల, శ్రీదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

‘మానేరు’ విద్యార్థులకు మెడల్స్ ప్రదానం



సప్తగిరికాలనీ: ప్రస్తుత కాలంలో విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. గురువారం స్థానిక పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో 2022–23 విద్యాసంవత్సరానికి గాను వివిధ స్థాయిల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు బంగారు, రజత, కాంస్య పతకాలను ప్రదానం చేశారు. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. వేసవి సెలవులను నిర్లక్ష్యం చేయకుండా చక్కగా వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించి, చదువుకున్న పాఠశాలకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా ఇవ్వకుండా రాజకీయాలా?

- బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు ఒరగబెట్టిందేమీ లేదు
- ఎంపీ బండికి చేతనైతే రూ.10 వేల పరిహారం ఇప్పించాలి
- మేయర్ వై.సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: రైతుల పట్ల బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మొసలి కన్నీరు కార్చడం చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం గురించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి నేర్చుకోవాల్సిన దుస్థితిలో బీఆర్ఎస్ పార్టీ లేదన్నారు. 65 ఏళ్ల దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు రైతులకు ఒరగబెట్టిందేమీ లేదని ఆరోపించారు. తెలంగాణలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలు దేశంలోని మిగతా రాష్ట్రాల్లో అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి రాజకీయాలు చేయడం దురదృష్టకమని అన్నారు. గతంలో పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.1,000, రూ.2 వేలు కొంతమంది రైతులకే ఇచ్చి, చేతులు దులుపుకొని, గొప్పలు చెప్పుకున్న చరిత్ర బీజేపీ, కాంగ్రెస్ పార్టీలదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో 2014లో అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 3.87 లక్షల మంది రైతులకు రూ.1,600 కోట్ల పంట రుణాలు మాఫీ చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. ఎంపీ సంజయ్ నిత్యం రాజకీయాలు చేయడం, గగ్గోలు పెట్టడం మానుకొని, చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని సవాల్ విసిరారు. బీజేపీ ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచి, రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, కంసాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, జంగిలి సాగర్, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల అశోక్, నక్క కృష్ణ, గందె మహేశ్, కాశెట్టి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్, కుంభం అనిల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

కరీంనగర్ సిటీ: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 43వ డివిజన్ సవరన్ స్ట్రీట్‌లో ఆయన పర్యటించారు. కార్పొరేటర్ సరిళ్ల ప్రసాద్‌తో కలిసి మరో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల్లో అంధత్వాన్ని దూరం చేయాలన్న గొప్ప సంకల్పంతో ప్రారంభించిన ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో 1.50 లక్షల మందికి కంటి పరీక్షలు చేసి, వారి సమస్యలను దూరం చేశామన్నారు. ఇప్పటివరకు 45 డివిజన్లలో శిబిరాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. రూ.400 కోట్లు ఖర్చు చేసి, ప్రజల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి




కొత్తపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. కొత్తపల్లి పట్టణంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఫక్రుద్దీన్, కౌన్సిలర్లు సత్యనారాయణరెడ్డి, ఎం.వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ.జమీలొద్దీన్, ఎస్కే.బాబా, కట్ల సుధాకర్, మునావర్‌ఖాన్, రైతుబంధు సమితి అధ్యక్షుడు కె.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కరీంనగర్: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాద్రీ ప్రకటనలో డిమాండ్ చేశారు. హైకోర్టులో కేసు నడుస్తున్నదని, జూన్ 13కు వాయిదా పడిందని ప్రభుత్వం తాత్సారం చేస్తున్న విషయం ఉపాధ్యాయులకు అవగతమై నిరాశ, నిస్పృహ, అసహనానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు వాయిదాను ముందుకు జరిపేలా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేయాలన్నారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక అర్హులైన ఉపాధ్యాయులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ చైతన్యపురి ఫీడర్ పరిధిలోని చైతన్యపురి, మీసేవ ఆఫీసు, స్పెన్సర్ వెనుక ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

అన్నదాతలకు పరిహారం చెల్లించాలి



రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రైతులను వెంటనే ఆదుకోవాలని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. రోడ్డుకిరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కరీంనగర్ రూరల్ ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి తరలించి, రాకపోకలను పునరుద్ధరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ నాయకుడు మేన్నేని రోహిత్‌రావు మాట్లాడారు. వడగళ్ల వానకు వరిపంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని, తడిసిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సొంత నియోజకవర్గంలో అకాల వర్షాలకు రైతులందరూ నష్టపోతే ఆదుకోకుండా సర్వేల పేరిట కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్, కనకయ్య, సంజీవ్, హరీశ్, రాకేశ్, శంకరయ్య, నారాయణగౌడ్, గిరిప్రసాద్, మల్లేశం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

మానకొండూర్: అన్నారం గ్రామానికి చెందిన రామగిరి వేణు, మానకొండూర్‌కు చెందిన వీణవంక రాజమౌళి ఇటీవల తమ సెల్‌ఫోన్లు పొగొట్టుకున్నారు. సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు వాటిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. బాధితులకు సీఐ రాజ్‌కుమార్ గురువారం అందజేశారు. రైటర్ శ్రీనివాస్, కానిస్టేబుల్ తిరుపతి పాల్గొన్నారు.

ఆసుపత్రి భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం: ప్రమాదవశాత్తు ఓ ఆసుపత్రి భవనం పైనుంచి పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రాగినేడు గ్రామానికి చెందిన బొజ్జ సమ్మయ్య(64) ఏడాదిగా కంటి చూపు సమస్యతో బాధ పడుతున్నాడు. ఈ నెల 24వ తేదీన ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు ఒక కంటికి ఆపరేషన్ చేశారు. మరో కంటికి పరీక్ష చేయాలని చెప్పారు. దీంతో అతను ఆసుపత్రిలోనే ఉన్నాడు. 26 రాత్రి 11 గంటలకు అందరూ పడుకున్న తర్వాత దవాఖాన భవనం పైకి ఎక్కి, ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఉదయం సమ్మయ్య భార్య భూదేవి లేచిచూడగా అతను కనిపించలేదు. దీంతో ఆమె సెక్యూరిటీగార్డుకు సమాచారమిచ్చి, చుట్టూ వెతకగా కింద గాయపడి కనిపించాడు. వెంటనే వైద్యులకు చూపించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు

- వైఎస్ వివేకా హత్య కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని సూచన

సాక్షి, హైదరాబాద్ : మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ–1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయి ల్‌ను రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. వచ్చే నెల 5లోగా సీబీఐ ఎదుట లొంగిపోవాలని గంగిరెడ్డిని ఆదేశించింది. ఒకవేళ అతను లొంగిపోకుంటే అరెస్టుచేయవచ్చని స్పష్టం చేసింది. జ్యుడీషియల్ రిమాండ్‌ను జూన్ 30 వరకు విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచికత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీచేసింది. వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు గంగిరెడ్డి బెయిల్ రద్దుచేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత బుధవారం వరకు వాదనలు విన్నారు. గతంలో రెండుసార్లు గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ పిటిషన్ దాఖలు చేయగా, కడప కోర్టు, ఏపీ హైకోర్టు ఆ పిటిషన్లను కొట్టివేశాయని.. మళ్లీ ఇప్పుడు అదే పిటిషన్‌ను ఈ కోర్టులో దాఖలు చేయడం చట్ట విరుద్ధమని అతని తరఫున సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు, న్యాయవాది సి.శరణ్ రెడ్డి వాద నలు వినిపించారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు బయట ఉండి సాక్షులను ప్రభావితం చేస్తున్నాడని, భయపెడుతున్నాడని సీబీఐ పీపీ వాదించారు. ఇంప్లీడ్ పిటిషన్ వేసిన సునీత తరఫున టి.స్వేచ్ఛ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ రద్దుచేస్తూ ఉత్తర్వులిచ్చారు.

‘షెహజాదిపై దాడి చేసింది ఎంఐఎం గూండాలే’

సాక్షి, హైదరాబాద్: జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు షెహజాదీపై దాడి చేసింది ఎంఐఎం గూండాలేనని, ఆమెపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్ రెడ్డి అన్నారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మైనారిటీల అభివృద్ధి కోసం దేశమంతా తిరుగుతూ ముస్లిం ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్న ఆమెపై ఓర్వలేకే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం మహిళలపై దాడులు చేస్తుంటే లౌకికవాద ముసుగులేసుకున్న పార్టీలు ఎందుకు స్పందించడం లేదని మనోహర్ రెడ్డి ప్రశ్నించారు.

ఇదేం విశ్వనగరం?

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ విశ్వనగరమంటూ కేటీఆర్ చెబుతున్నారని, అయితే చిన్నపాటి వర్షానికే జలమయమౌతూ విషాద నగరంగా మారుతోందని బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి విమర్శించారు. నాలాల గుండా వెళ్లాల్సిన నీరు రోడ్లపై పారుతోందని పేర్కొన్నారు. ఇళ్లలోకి నీరు రాకుండా సర్కార్ చేపట్టిన కార్యాచరణ ఏమిటని ప్రశ్నించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నాలాల్లో పూడిక తీసి వ్యర్థాలను అలాగే వదిలేయడంతో.. వర్షం పడగానే అదంతా నాలాల్లోకే వెళ్తోందన్నారు.

కొత్తగా 48 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 6,022 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 48 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది.

ఏకపక్షంగా విచారణ

వివేకా హత్యపై సోషల్ మీడియాలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో వైరల్

- ఏ 4ను పావుగా వాడుకొని సునీతమ్మ, సీబీఐ మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు
- కిరాయి హంతకుడు అదే డబ్బు కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడడా?
- సునీతక్క తన భర్తను కాపాడుకునే క్రమంలో మా వ్యక్తిత్వాలను నాశనం చేస్తోంది
- సీబీఐపై నమ్మకంతో, పెదనాన్న గురించి కొన్ని విషయాలు చెప్పలేక మూడేళ్లు మౌనంగానే ఉన్నా
- పెదనాన్న హత్యకు ఎంపీ టికెట్ మోటివ్‌గా చెప్పడం అత్యంత హాస్యాస్పదం
- కుట్రలను పటాపంచలు చేస్తాం.. అంతిమంగా న్యాయమే గెలుస్తుంది

సాక్షి ప్రతినిధి, కడప: ‘సీబీఐ పెద్ద సంస్థ... నేను ఆ సంస్థ మొత్తాన్ని నిందించే పెద్దవాడిని కాదు గానీ వివేకం పెదనాన్న హత్య కేసులో విచారణ చేస్తున్న రామ్‌సింగ్ ఏకపక్షంగా వ్యవహరించారు. ఫ్యాక్ట్ టార్గెట్ కాకుండా పర్సన్‌ను టార్గెట్ చేస్తూ విచారణ చేస్తున్నారు. కట్టుకథల ఆధారంగా అబద్ధాల కట్టడాలను కడుతోంది. మా అక్క సునీతమ్మ తన భర్తను కాపాడుకునే క్రమంలో నన్ను, మానాన్న వ్యక్తిత్వాలను నాశనం చేస్తోంది. సునీతమ్మను పావుగా వాడుకుని ఎల్లో మీడియా, చంద్రబాబు నాయుడు, బీజేపీలో చేరిన టీడీపీ నేతల ద్వారా వైఎస్సార్ సీపీపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు’ అని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ (ఐవో) ఏకపక్ష వైఖరి, ఎల్లో మీడియా కట్టుకథలపై ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో వివరాలు ఇవీ..



మూడేళ్లుగా మాట్లాడాలనుకున్నా..

సీబీఐ విచారణ గురించి ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ వీడియో చేస్తున్నా. మూడేళ్లుగా చాలా సందర్భాల్లో మాట్లాడాలనుకున్నా.. సీబీఐపై నమ్మకంతో, వివేకం పెద్దనాన్న గురించి కొన్ని విషయాలు మాట్లాడలేక, చనిపోయిన వ్యక్తి కుమార్తె, అల్లుడు గురించి మాట్లాడలేక ఎన్ని ఆరోపణలొచ్చినా మౌనంగానే ఉన్నా. విచారణ తప్పుదారిలో వెళ్తున్నా భరించా. సీబీఐ వేసిన రెండు చార్జిషీట్లు, 248 మంది సాక్షుల స్టేట్‌మెంట్లు, కోర్టుల్లో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లు, వ్యక్తిగతంగా నా విచారణను బేస్ చేసుకొని నేను మాట్లాడుతున్నా.

పథకం ప్రకారం వ్యక్తిత్వ హననం..

వాచ్‌మెన్ రంగన్న ప్రత్యక్ష సాక్షిగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు. నలుగుర్ని గుర్తు పట్టి వారి పేర్లు కూడా చెబుతాడు. మరి నలుగురిలో ఒకర్ని అప్రూవర్‌గా మార్చాల్సిన అవసరం ఉందా? కిరాయికి హత్య చేసిన వ్యక్తి, డబ్బు కోసం మంచి మనిషిని చంపిన వ్యక్తి, అదే డబ్బు కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడడా? హత్యలో స్వయంగా పాల్గొన్నానని చెప్పిన దస్తగిరి ముందస్తు బెయిల్‌కు సీబీఐ నో అబ్జెక్షన్ అని చెబుతోంది. రెండేళ్లుగా కోర్టులో ఎవరు బెయిల్ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అవుతున్న సునీతమ్మ మరి దస్తగిరి ముందస్తు బెయిల్ పట్ల ఎందుకు మౌనంగా ఉన్నారు? ఇది అతడిని పావుగా వాడుకొని మమ్మల్ని టార్గెట్ చేయడం కాదా? అప్రూవర్ అనే అబద్ధాల కట్టడంలో అత్యున్నతస్థాయి విచారణ సంస్థ ఇన్వెస్టిగేషన్ అధికారి రామ్‌సింగ్ దిగజారి ప్రవర్తించారు. కీలక అంశాలను మరుగున పరుస్తూ సిల్లీ అంశాల ఆధారంగా విచారణ కొనసాగించారు.

నిజాలను మరుగునపరచి..

ఘటనా స్థలంలో ఉన్న వాస్తవాన్ని ఎందుకు దాచిపెట్టాల్సి వచ్చింది? వైఎస్ వివేకానందరెడ్డిది హత్య అని తెలిసీ, డెత్ నోట్ చదివి వినిపించిన పీఏ కృష్ణారెడ్డిని ఎవరికీ చూపించకుండా లేఖ దాచిపెట్టాలని అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశించారు. వాస్తవాలు చెప్పకుండా ఘటన స్థలంలోకి నన్ను వెళ్లమని నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఫోన్‌లో చెప్పారు. జమ్మలమడుగు వెళ్తున్న నేను అక్కడికి వెళ్లి చూసిన ఘటనను ముందుగా పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటి సీఐకి ఫోన్ చేసి వివేకం పెద్దనాన్న చనిపోయారు, చాలా రక్తం ఉంది, బెడ్ రూమంతా రక్తం ఉంది, త్వరగా రండి సార్.. అని చెప్పా. అది హత్య అని తెలియడానికి లెటర్ క్లియర్ ఎవిడెన్స్. లెటర్ కంటెంట్ విన్న వెంటనే నర్రెడ్డి రాజశేఖరరెడ్డి పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? కనీసం నాకైనా చెప్పాలి కదా? హత్య విషయాన్ని ఎందుకు దాచిపెట్టారు. ఇలాంటి వాస్తవాలను రామ్‌సింగ్ మరుగునపరిచి ఏకపక్షంగా వ్యవహరిస్తారు. సునీతమ్మ తన భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలను కేసు నుంచి కాపాడుకునేందుకు ఆరాటం చూపుతోంది.

అన్ని వేళ్లు వాళ్ల వైపే...

ఘటనాస్థలంలో దొరికిన లెటర్‌తో పాటు వేళ్లన్నీ వాళ్ల వైపే చూపుతున్నాయి. వివేకం సార్ 2010లో ఇస్లాం మతం స్వీకరించి మహమ్మద్ అక్బర్‌గా పేరు మార్చుకొని షమీమ్ అనే మహిళను వివాహం చేసుకున్నారు. వారికి షహెన్‌షా అనే అబ్బాయి కూడా ఉన్నాడు. సునీతమ్మ, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, షమీమ్ స్టేట్‌మెంట్లు పరిశీలిస్తే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది. షమీమ్‌కు ఒక విల్లా కొనుగోలు చేసి ఇచ్చి, అబ్బాయిని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని, ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారి జీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వివేకం పెదనాన్న అనుకున్నారు. బెంగళూరు డీల్ రూ.8 కోట్లు వస్తే ఆ మొత్తం వారికి ఇవ్వాలనుకున్నారు. అయితే బెంగళూరులో డబ్బు వచ్చే అవకాశమే లేదని 8 మంది సాక్షుల ద్వారా వెల్లడైంది. తన వాటా ఆస్తిగా వచ్చిన 25 శాతం భాగాన్ని షమీమ్ కుటుంబానికి చెందేలా వివేకం సార్ విల్లు రాయించారు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఇది తెలిసి ఎర్ర గంగిరెడ్డి ద్వారా పథక రచన చేశారు. రెండో పెళ్లి వ్యవహారంతో 2013 నుంచి సునీతమ్మకు, పెదనాన్నకు మధ్య మాటలు కూడా లేవు. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి కూడా ఆ విషయాన్ని విచారణలో వెల్లడించారు. వివేకం సార్‌కు ఉన్న చెక్ పవర్‌ను కూడా రద్దు చేశారు. హత్య అనంతరం ఎర్ర గంగిరెడ్డి డాక్యుమెంట్లు, స్టాంపు పేపర్లు తీసుకెళ్లినట్లు ఏ–4 చెబుతున్నాడు. ఇవన్నీ కూడా వేళ్లు వారివైపే చూపుతున్నాయి. ఏ–2, ఏ–3 కుటుంబ సభ్యుల కారణంగా వివేకం సార్‌తో తీవ్రమైన విభేదాలున్నాయి. ఎర్రగంగిరెడ్డి ద్వారా నర్రెడ్డి రాజశేఖరరెడ్డి వీరందర్నీ వాడుకున్నారు. ఇది పూర్తిగా మర్డర్ ఫర్ గెయిన్. రాజశేఖరరెడ్డిని తప్పించి దస్తగిరిని పావుగా చేసుకొని మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు.

అప్రూవర్ కట్టుకథ....

సీబీఐకి సాక్షుల స్టేట్‌మెంట్లు పరిశీలిస్తే (ఎల్‌డబ్ల్యూ 10, 34, 37, 38, 50, 86, 94, 98) బెంగళూరు సెటిల్‌మెంట్ ఫెయిల్ అయింది. రాధాకృష్ణమూర్తివి ఫేక్ డాక్యుమెంట్లు, డబ్బులు రావని స్పష్టంగా చెప్పారు. ఏమాత్రం డబ్బులు రాని విషయం గురించి వాదోపవాదనలు చేసుకుని చంపినట్లు చెప్పడం కట్టుకథ కాదా? అది స్పష్టంగా తెలియడం లేదా? వివేకం పెదనాన్న హత్యలో సిట్ నాలుగైదు కోణాల్లో విచారణ కొనసాగించింది. వివేకం సార్ రెండో వివాహం, బతికున్న సమయంలో బలపనూరులో షమీమ్‌కు కట్టించిన ఇంటిని కూడా రాయించుకోవడం, మర్డర్ ఫర్ గెయిన్ అన్న విషయం వెలుగు చూస్తున్న సమయంలో.. నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలను కాపాడుకునేందుకు సునీతమ్మ సిట్ వద్దు సీబీఐ విచారణ కావాలని కోరుతోంది. అంతకంటే వేరే మతలబు లేదు.

సునీతమ్మది పోరాటం కాదు...ఆరాటం

వివేకం సార్ హత్య కేసులో సునీతమ్మది పోరాటం కాదు, ఆరాటం మాత్రమే. భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఈ హత్య కేసులోంచి బయటికి రావాలి. అమె భర్త స్థానంలో నన్ను, మా నాన్నను ఇరికించాలి. అది అసూయతోనే. ఇంకో కారణం లేదు. మాకైతే సునీతమ్మపై గౌరవం ఉంది. అమెను బాధ పెట్టాలని కాదు.. వాస్తవాలు తెలియాలి కాబట్టి చెబుతున్నాం. సుప్రీంకోర్టులో నాపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ పిటిషన్ వేశారు. రామ్‌సింగ్‌ను సపోర్టు చేస్తూ కౌంటర్ పిటిషన్ వేస్తారు. పర్సన్‌ను టార్గెట్ చేస్తూ తీవ్రమైన ఆరోపణలు చేస్తారు. మాజిల్లా వాసులందరికీ తెలుసు. ఎంపీ టికెట్ మోటివ్ అన్నది హాస్యాస్పదం. వైఎస్ వివేకా ముందు రోజు కూడా మైదుకూరు నియోజకవర్గంలో డోర్ టు డోర్ ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. సంబంధం లేని వారి జీవితాలను ఇందులోకి లాగి ఎందుకు నాశనం చేయాలనుకున్నారు? ఈ విషయాన్ని సీబీఐని అడుగుతున్నా. సునీతక్కను కూడా అడుగుతున్నా. నేను చేసే ప్రతి కార్యక్రమాన్ని వివేకం పెదనాన్న బలపర్చేవారు. నా కార్యక్రమాలకు వచ్చేవారు. నా కోసం ఫైట్ చేసే వ్యక్తిని నేను చంపాననడం ఎంతవరకూ లాజికల్ అనేది ఆలోచించండి. 2014లో వేంపల్లెలో వీధి వీధిలో తిరుగుతూ మా ఇద్దరు కుమారులు జగన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిలను గెలిపించాలని ప్రచారం చేశారు.

ఎల్లోబ్యాచ్ పావుగా సునీతమ్మ....

సీబీఐ ఎంతో పెద్ద ఏజెన్సీ. కానీ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది. ఏ–4 దస్తగిరిని పావుగా చేసుకొని సునీతమ్మ మమ్మల్ని టార్గెట్ చేస్తోంది. సునీతమ్మను పావుగా చేసుకొని లబ్ధి పొందేందుకు ఎల్లో బ్యాచ్ ప్రయత్నిస్తోంది. వాళ్లకు నేను, మానాన్న టార్గెట్ కాదు. వైఎస్సార్‌సీపీనే టార్గెట్. ఎందుకంటే మాద్వారా వైఎస్సార్‌సీపీ డీఫేమ్ కావాలి. ఎల్లో మీడియా, చంద్రబాబునాయుడు, మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, బీజేపీలో ఉన్న టీడీపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. వారికి ప్రజల్లోకి వెళ్లే దమ్ము, ధైర్యం లేదు. డీఫేమ్ చేయడంలో ఎల్లోబ్యాచ్ ఎక్స్‌పర్ట్. ఎన్టీ రామారావు లాంటి మహానుభావుడినే డీఫేమ్ చేసి రోడ్డున పడేశారు. మీ కుట్రలను పటాపంచలు చేస్తాం. న్యాయ పోరాటం చేస్తాం. న్యాయ వ్యవస్థపైన మాకు నమ్మకం ఉంది. అబద్ధాల కట్టడాలు న్యాయస్థానంలో నిలబడవు. నిజం పునాదిపై ఉన్నాం. చివరకు న్యాయమే గెలుస్తుందన్న విశ్వాసం ఉంది.

స్వదేశీ యుద్ధ విమానం గర్జన!

- 2028 నాటికి ఏఎంసీఏ ఫేజ్ – 1 ఎయిర్‌క్రాఫ్ట్ సిద్ధం
- అత్యాధునిక జీఈఎఫ్ 414 ఇంజన్‌తో తయారీ
- ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో భారత్ చేరడం గర్వకారణం
- నేవల్ బాలిస్టిక్ మిసైల్ ప్రయోగం విజయవంతం కావడం శుభపరిణామం
- రక్షణ రంగంలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- స్పేస్‌టెక్ రంగంలో ఎంఎస్ఎంఈలు, ప్రైవేట్ సంస్థలకు ఆహ్వానం
- ‘సాక్షి’తో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్



సాక్షి, విశాఖపట్నం: రక్షణ పరిశోధన సాంకేతిక రంగంలోకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పేస్ పాలసీలో భాగంగా రక్షణ రంగంలో ప్రధానంగా స్పేస్ టెక్‌లో ప్రైవేట్ పరిశ్రమలు, పరిశోధన సంస్థలకు అవకాశాలు కల్పించినట్లు వివరించారు. విశాఖలోని నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)లో గురువారం ప్రారంభమైన కండిషన్ మానిటరింగ్ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ‘సాక్షి’తో పలు అంశాలపై మాట్లాడారు.



అంతరిక్ష పరిశోధనలపై దృష్టి

స్పేస్ పాలసీలో భాగంగా పరిశోధనలపై దృష్టి సారించాం. ముఖ్యంగా రక్షణ శాఖతో పాటు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి పెట్టాం. రాకెట్ లాంచింగ్, శాటిలైట్స్ అభివృద్ధి.. ఇలా ఎలాంటి హద్దులు లేకుండా ప్రైవేట్ సంస్థలు ముందుకు రావచ్చు. దీనిద్వారా అగ్రదేశాలతో పోటీ పడే స్థాయికి వేగంగా చేరుకుంటాం. అంతరిక్ష ఆధారిత నిఘా, అంతరిక్ష పరిస్థితులపై మన అవగాహన సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి.

అంకుర సంస్థలకు ప్రోత్సాహం

రక్షణ రంగంలో స్టార్టప్స్‌ని ప్రోత్సహిస్తున్నాం. డిఫెన్స్ సిస్టమ్, టెక్నాలజీపై పని చేస్తున్న స్టార్టప్స్‌కు ప్రాధాన్యమిస్తున్నాం. పరిశోధన అభివృద్ధి(ఆర్ అండ్ డీ) బడ్జెట్‌లో 25 శాతం వరకూ పరిశ్రమలు, స్టార్టప్స్, విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించడం శుభ పరిణామం. అందుకే స్టార్టప్స్, ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం.

2028లో తొలి దేశీయ యుద్ధ విమానం ఎగరనుంది

మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మన సాయుధ బలగాల్లో చాలా వ్యవస్థలు స్వదేశీ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోనున్నాయి. ఇందులో భాగంగా ఎల్‌సీఏ ఎంకే–2 ఇండక్షన్‌కు సిద్ధమవుతున్నాం. జీఈఎఫ్ 414 ఇంజన్‌తో కూడిన ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియమ్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) ఫేజ్–1 యుద్ధ విమానాన్ని 2028లో ఎగురవేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నాం. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతోంది. దీనికి సంబంధించి అనుమతుల కోసం వేచి చూస్తున్నాం.

17 వేల అడుగుల ఎత్తు వరకు ‘యూఏవీ’

మానవ రహిత వైమానిక వాహనం (యూఏవీ)పై ప్రధానంగా దృష్టి సారించాం. ఇందుకోసం గైడెన్స్ కిట్, సీట్ ఎజెక్షన్ సిస్టమ్, పైరోటెక్నిక్ కాట్రిడ్జ్ అభివృద్ధి చేసే పనిలో ఉన్నాం. ‘యూఏవీ తపస్’ కోసం 180 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఇంజన్‌ను దేశీయంగా అభివృద్ధి చేశాం. దీని ద్వారా యూఏవీ 17 వేల అడుగుల ఎత్తు వరకూ ఎగరగలదు.

ఎలైట్ క్లబ్‌లో చేరడం గర్వకారణం

ఇటీవల ‘సీ బేస్డ్ ఎండో అట్మాస్ఫియరిక్ ఇంటర్‌సెప్టర్ మిసైల్’తొలి విమాన ప్రయోగం విజయవంతం కావడంతో రక్షణ సామర్థ్యాల విషయంలో మన దేశం చరిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. నేవల్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ) సామర్థ్యంలో అగ్రదేశాల సరసన నిలిచి ఎలైట్ క్లబ్ ఆఫ్ నేషన్స్‌లో చేరడం గర్వకారణం. యుద్ధనౌకలు, ఉపరితలం నుంచి బాలిస్టిక్ క్షిపణులను నిలువరించే సామర్థ్యాన్ని భారత్ అభివృద్ధి చేసింది. అంతకుముందే భూ ఆధారిత క్షిపణి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించాం. ఈ జంట విజయాలతో సుదూర అణు క్షిపణులు, హైపర్ సోనిక్ మిస్సైల్స్, గ్లైడర్స్, శత్రు విమానాల్ని అడ్డుకోగల సామర్థ్యాన్ని మన దేశం సొంతం చేసుకుంది.

అవినాశ్ అరెస్టుకు సీబీఐ అత్యుత్సాహం

- ఆయన లక్ష్యంగానే దర్యాప్తు
- కిరాయి హంతకుడు బయట..
- దర్యాప్తు సంస్థ తీరు చట్టవిరుద్ధమన్న ఎంపీ అవినాశ్ న్యాయవాది
- మాటమార్చిన సునీత
- లేఖను ఎందుకు దాచారన్న దానిపై దర్యాప్తు ఏదీ?
- ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టుకు విజ్ఞప్తి
- వివేకా హత్య కేసులో అవినాశ్ పిటిషన్‌పై వాదనలు
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్ : మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కిరాయి హంతకుడు బయట తిరిగేందుకు పూర్తిగా సహకరిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ).. ఎలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని అతని తరఫు సీనియర్ న్యాయవాది టి. నిరంజన్‌రెడ్డి వాదించారు. అవినాశ్‌ను లక్ష్యంగా చేసుకుని మాత్రమే దర్యాప్తు చేస్తోంది తప్ప.. ఇతర కీలక అంశాలను పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్ వివేకా హత్య కేసును సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సురేందర్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను శుక్రవారానికి (నేటికి) వాయిదా వేశారు.

‘హియర్ సే ఎవిడెన్స్’ ఆమోదం కాదు..

నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ‘సీబీఐ ప్రధానంగా నాలుగు అంశాలను ప్రస్తావిస్తూ అవినాశ్‌ను అరెస్టుచేయాలని చూస్తోంది. కానీ, అందులో ఏ ఒక్క దానికీ ఆధారాల్లేవు. అన్నీ ఊహాజనితాలు, కల్పితాలే. ఏ–4 నిందితుడు దస్తగిరి వాంగ్మూలం, గూగుల్ టేక్‌అవుట్, ఎమ్మెల్సీ ఎన్నికల కారణం, సాక్ష్యాలను చెరిపివేసే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు చేస్తోంది. ఇందులో ఏ ఒక్కటీ చట్టప్రకారం సరికాదు. మన వెనుక వైఎస్ అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి ఉన్నారని గంగిరెడ్డి చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలాన్ని ఇచ్చాడు. అయితే, ఈ వ్యాఖ్యలను గంగిరెడ్డి తన వాంగ్మూలంలో ఖండించాడు. తను ఎవరి పేరు చెప్పలేదని వెల్లడించాడు. అంతేకాక.. దస్తగిరి రెండుసార్లు వాంగ్మూలం ఇచ్చాడు. మొదటిసారి చెప్పిన దాంట్లో ఎవరి పేరూలేదు. రెండోసారి చెప్పిన దాంట్లో ఈ పేర్లు చెప్పాడు. ఇలా ఎందుకు చెప్పాడని సీబీఐ దర్యాప్తు చేయడంలేదు. అతన్ని ప్రశ్నించడంలేదు. ‘హియర్ సే ఎవిడెన్స్’ అంటే.. ఎవరో చెప్పింది విని చెప్పడం. ఇది చట్టప్రకారం ఆమోదయోగ్యం కాదు. అంతేకాదు.. కేసును ఏపీ హైకోర్టు సీబీఐకి బదిలీ చేసిన తర్వాత దస్తగిరి దాదాపు రెండునెలలు ఢిల్లీలో ఉండి వచ్చాడు. తాను సీబీఐ వారిని కలిసివచ్చానని కూడా బయట చెప్పాడు. అక్కడ జరిగిన ఒప్పందంలో భాగంగానే ఈ పేర్లు ప్రస్తావించాడు. తానే హత్యచేశానని చెప్పిన కిరాయి హంతకుడికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ సహకరించడం గతంలో ఎప్పుడూ జరగలేదు. అలాగే, గూగుల్ టేక్‌అవుట్ ప్రామాణికం కాదు. ఒక వ్యక్తి తన స్నేహితుడి ఫోన్‌లోని గూగుల్‌ను అతని జీమెయిల్‌తో తెరిస్తే.. స్నేహితుడు ఎక్కడికి వెళ్లినా ఇతను అక్కడ ఉన్నట్లే చూపిస్తుంది. అందుకే గూగుల్ టేక్‌అవుట్‌ను గూగుల్ కూడా సర్టిఫై చేస్తూ లేఖ ఇవ్వదు. కేంద్ర ప్రభుత్వం కూడా దాన్ని సర్టిఫై చేయదు. దస్తగిరి చెప్పిన వాంగ్మూలానికి, గూగుల్ టేక్‌అవుట్ సమాచారానికి వివరాల్లో తేడా ఉంది. ఇందులో ఏదీ సరైందో సీబీఐ ఎలా నిర్ణయించుకుంది,, ఎలా చెబుతుంది?’.. అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

అవినాశ్‌పై ఎలాంటి కేసుల్లేవు

అనంతరం, సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. అవినాశ్‌పై పలు కేసులు ఉన్నాయని, ఎన్నికల అఫిడవిట్‌లో అతను పేర్కొన్నారని చెప్పారు. దీనిపై నిరంజన్‌రెడ్డి జోక్యం చేసుకుని.. అవినాశ్‌పై ఎలాంటి కేసుల్లేవని, తాజాగా సమాచార హక్కు చట్ట ప్రకారం తీసుకున్న డాక్యుమెంట్లను కోర్టుకు చూపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వివాదానికీ సాక్ష్యాల్లేవు..

ఇక వివేకా.. అవినాశ్‌కు బాబాయి. అవినాశ్ ఎంపీగా పోటీచేసినప్పుడు అతని ప్రచారంలో, గెలుపులో వివేకా కీలకపాత్ర పోషించారు. తర్వాత జరగబోయే ఎన్నికల్లో కూడా అవినాశ్ గెలుపు కోసం ప్రచారంలో పాల్గొనడానికి ఆయన సిద్ధమై ఉన్నారు. ఇదే విషయాన్ని వివేకా మృతిచెందిన దాదాపు 10 రోజుల తర్వాత ఆయన కుమార్తె సునీత కూడా మీడియాకు వెల్లడించింది. తర్వాత ఏం జరిగిందో.. మాట మార్చారు. ఇక సాక్ష్యాలను మార్చడం విషయానికొస్తే.. మార్చి 15, 2019 ఉదయం అవినాశ్‌రెడ్డి జమ్మలమడుగు బయల్దేరారు. మధ్యలో ఉండగా వివేకా అల్లుడు ఫోన్‌చేసి, గుండెపోటుతో మృతిచెందినట్లు చెప్పారు. దీంతో ఆయన ఉ.6 తర్వాత అక్కడికి చేరుకున్నారు. కొంత సమయం అక్కడి ఉండి వెళ్లిపోయారు తప్ప.. సాక్ష్యాలను చెరిపివేసే ప్రయత్నం చేయలేదు. ఇది కూడా కల్పితమే. అవినాశ్, భాస్కర్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకునే సీబీఐ దర్యాప్తు సాగిస్తోంది. వివేకా రాసిన లేఖను సాయంత్రం వరకు ఎందుకు దాచాల్సి వచ్చిందో చెప్పమని అతని అల్లుడిని సీబీఐ కనీసం ప్రశ్నించలేదు. సీబీఐ దర్యాప్తు చేపట్టిన నాటి నుంచి పిలిచిన ప్రతీసారి అవినాశ్ విచారణకు హాజరవుతున్నారు. ఎప్పుడూ తప్పించుకునే ప్రయత్నం చేయలేదు. ఆర్టికల్–21ను ఉల్లంఘిస్తూ.. అవినాశ్ ప్రాథమిక హక్కును కాలరాస్తున్నారు. సీబీఐ కోరిన రోజున.. ఉదయం నుంచి సాయంత్రం వరకు (కస్టడీ) విచారణకు హాజరుకావడానికి అవినాశ్ సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి’ అని నిరంజన్‌రెడ్డి న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

గురుకుల కొలువుల్లో ‘ఆమె’కు అందలం!

అత్యధిక పోస్టులు మహిళలకే రిజర్వ్ చేస్తూ నోటిఫికేషన్లు జారీ

- ప్రకటించిన 9210 ఉద్యోగాల్లో అతివలకు దక్కినవి 77.62శాతం
- బాలుర విద్యా సంస్థల్లో ఏకంగా 54.83 శాతం పోస్టులు మహిళలకే
- బాలికల విద్యా సంస్థల్లో నూరుశాతం పోస్టులు వారికే కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మహిళా అభ్యర్థులకు అద్భుత అవకాశంలా పరిణమించింది. సాధారణంగా ఉద్యోగాల భర్తీలో మహిళలకు 33శాతం పోస్టులు రిజర్వ్ చేస్తూ ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. కానీ తాజాగా తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ద్వారా భర్తీ చేస్తున్న గురుకుల విద్యా సంస్థల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యత దక్కింది. నూతన జోనల్ విధానం అమలు తర్వాత రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో ఏకంగా 9,231 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా టీఆర్ఈఐఆర్‌బీ ఈనెల 5వ తేదీన ఒకేసారి 9 నోటిఫికేషన్లను వెబ్‌నోట్ ద్వారా విడుదల చేసింది. తాజాగా పూర్తిస్థాయి నోటిఫికేషన్లను కూడా గురుకుల నియామకాల బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. ప్రకటించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ల ద్వారా 9,210 పోస్టులు మాత్రమే భర్తీ చేయనుంది. ఈ ఉద్యోగ ఖాళీల్లో మహిళలకు ఏకంగా 77.62శాతం పోస్టులు రిజర్వ్ కావడం గమనార్హం. ఆర్ట్ టీచర్ కేటగిరీలో 2 పోస్టులు తగ్గగా... క్రాఫ్ట్ టీచర్ కేటగిరీలో 4 పోస్టులు, టీజీటీ కేటగిరీలో 14 పోస్టులు తగ్గాయి.

అక్కడా ఇక్కడా అత్యధికమే...

గురుకుల విద్యా సంస్థల్లో బాలుర గురుకులాలు, బాలికల గురుకులాలు విడివిడిగా ఉన్నాయి. రెండు కేటగిరీల్లో ఉన్న విద్యా సంస్థల్లోనూ మహిళలకు అత్యధిక పోస్టులు రిజర్వ్ అయ్యాయి. బాలికల విద్యా సంస్థల్లో ఉన్న ఉద్యోగాలన్నీ పూర్తిగా మహిళలతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బాలికల గురుకుల విద్యా సంస్థల్లో 4,647 ఉద్యోగాల భర్తీకి టీఆర్ఈఐఆర్‌బీ నోటిఫికేషన్‌లో ప్రకటించింది. ఇక బాలుర విద్యా సంస్థల్లో 4,563 ఉద్యోగ ఖాళీలను చూపగా... ఇందులో జనరల్ కేటగిరీకి కేవలం 2,061 పోస్టులు మాత్రమే రిజర్వ్ కాగా... మిగతా 2,502 పోస్టులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. ఈ లెక్కన జనరల్ కేటగిరీకి 45.17శాతం పోస్టులు, మహిళలకు 54.83శాతం పోస్టులు దక్కాయి. నూతన జోనల్ విధానం అమల్లోకి రావడంతో రాష్ట్రంలో నియామకాల ప్రక్రియ రోస్టర్ పాయింట్ మొదటి నుంచి ప్రారంభమైంది. దీనికి తోడు మహిళలకు హారిజాంటల్ విధానంలో పోస్టుల కేటాయింపు జరగడంతో మహిళలకు ఎక్కువ పోస్టులు కేటాయించినట్లయింది. గురుకుల విద్యా సంస్థల్లో మొత్తం 9,210 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల కాగా.. ఇందులో మహిళలకు 7,149 పోస్టులు రిజర్వ్ కాగా... జనరల్ కేటగిరీలో 2,061 పోస్టులు మాత్రమే రిజర్వ్ అయ్యాయి. ప్రకటించిన మొత్తం పోస్టుల్లో జనరల్ కేటగిరీకి కేవలం 22.38శాతం పోస్టులు దక్కగా... మహిళలకు మాత్రం 77.62శాతం ఉద్యోగాలకు దక్కనున్నాయి. ఇక అర్హత పరీక్షల్లో మెరిట్ సాధించిన వారిలో మహిళలుంటే జనరల్ కేటగిరీలోని పోస్టులు సైతం వారికి దక్కే అవకాశం ఉంది. ఈలెక్కన ప్రస్తుతం రిజర్వ్ అయిన పోస్టులకంటే మరిన్ని ఎక్కువ ఉద్యోగాలు మహిళలకు దక్కే అవకాశం ఉంది.

బాలికల విద్యా సంస్థలు

కేటగిరీ	మహిళలు/మొత్తం
జూనియర్ లెక్చరర్	970
ఫిజికల్ డైరెక్టర్(జూ.కా.)	17
లైబ్రేరియన్(జూ.కా.)	31
డిగ్రీ లెక్చరర్	504
ఫిజికల్ డైరెక్టర్(డి.కా.)	29
లైబ్రేరియన్(డి.కా.)	26
క్రాఫ్ట్ టీచర్	50
ఆర్ట్ టీచర్	54
పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్	650
ఫిజికల్ డైరెక్టర్	139
లైబ్రేరియన్	210
మ్యూజిక్	96
ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	1871
మొత్తం	4647

కేటగిరీల వారీగా పోస్టులు ఇలా... బాలుర విద్యా సంస్థలు



కేటగిరీ	జనరల్	మహిళ	మొత్తం
జూనియర్ లెక్చరర్	454	500	954
ఫిజికల్ డైరెక్టర్(జూ.కా.)	6	11	17
లైబ్రేరియన్(జూ.కా.)	8	11	19
డిగ్రీ లెక్చరర్	101	188	289
ఫిజికల్ డైరెక్టర్(డి.కా.)	3	7	10
లైబ్రేరియన్(డి.కా.)	3	7	10
క్రాఫ్ట్ టీచర్	10	28	38
ఆర్ట్ టీచర్	20	58	78
పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్	310	316	626
ఫిజికల్ డైరెక్టర్	45	91	136
లైబ్రేరియన్	102	122	224
మ్యూజిక్ టీచర్	4	23	27
ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	995	1140	2135
మొత్తం	2061	2502	4563

ఫ్యాషన్

ఫ్రీగా.. వెరైటీగా...









**వేడి కాలం.. ఉక్కపోత కాలం..
వదులైన దుస్తులను ఎంచుకునే కాలం.
కానీ, స్టైలిష్‌గా లేకపోతే
స్పెషల్ లుక్‌తో కనిపించకపోతే
డల్‌గా మనలేం అనుకునేవారు
ఈజీగా సెలక్ట్ చేసుకునే
డ్రెస్ ఖఫ్తాన్.
సింగిల్‌పీస్ డ్రెస్‌గా పేరున్న
ఖఫ్తాన్ స్టైల్‌కి
బోలెడన్ని హంగులు ఉన్నాయి.**

పలాజో, ధోతీ, జీన్స్, ట్రౌజర్, లెగ్గింగ్, జెగ్గింగ్.. ఇలా బాటమ్ ఏదైనా ఖఫ్తాన్ టాప్ సరైన ఎంపిక అవుతుంది. లేదంటే లాంగ్ ఖఫ్తాన్‌తో కంఫర్ట్‌లుక్‌లోకి ఈజీగా మారిపోవచ్చు. ఇతర అలంకరణలేవీ లేకుండా హాయిగా వేసవిని మరింత స్టైలిష్‌లుక్‌తో మెరిపించవచ్చు.

కొత్త దారి

ఉద్యోగం ఊరికే ఎవరూ మానెయ్యరు.
సవాలక్ష కారణాలు ఉండవచ్చు.
ఉద్యోగం మానేయడం ఎంత తేలికో, తిరిగి ఉద్యోగంలో చేరడం అంత కష్టం.
ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు తమ కెరీర్‌ను రీస్టార్ట్ చేయడానికి బెంగళూరు కేంద్రంగా 'జాబ్స్ ఫర్ హర్' ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది నేహా బగరియా.
ఆ ప్లాట్‌ఫామ్‌ను 'హర్ కీ' పేరుతో రీబ్రాండ్ చేసి రెండడుగులు ముందుకు వేసింది నేహా...

ఉద్యోగ పర్వం

రీస్టార్ట్

రకరకాల కారణాల వల్ల ఉద్యోగాలు మానేస్తున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. కరోన కరకు కాలంలో ఉద్యోగం మానేసిన వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. అలా ఉద్యోగాలు మానేసిన వారు కెరీర్ రీస్టార్ట్ చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తోంది నేహా బగరియా.



నేహా బగరియా

కొన్ని కంపెనీలు అప్పుడే కాలేజీ విద్యను పూర్తి చేసుకున్న అమ్మాయిలకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. కుటుంబ బాధ్యతల వల్ల ఉద్యోగ విధులు సరిగ్గా నిర్వహించలేరేమో అనే భయం వల్ల పెళ్లయిన మహిళలకు ఉద్యోగం ఇవ్వడానికి వెనకాడుతున్నారు. అయితే అది అపోహ అని చరిత్ర చెబుతూనే ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జాబ్స్ ఫర్ హర్' అనే ఆన్‌లైన్ పోర్టల్ స్టార్ట్ చేసింది నేహా.

ఉద్యోగం మానేసిన ఎంతోమంది మహిళలు తిరిగి ఉద్యోగంలో చేరడానికి ఈ ప్లాట్‌ఫామ్ ఎంతో ఉపయోగపడింది. కంపెనీలకు, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న మహిళలకు మధ్య వారధిగా మారింది.

'తమను తాము తిరిగి నిరూపించుకోవాలనే పట్టుదల చాలామంది మహిళలలో కనిపించింది' అంటుంది నేహా.

'జాబ్స్ ఫర్ హర్' ద్వారా ఉద్యోగంలో చేరిన మహిళలలో ముంబైకి చెందిన శ్రీప్రియ ఒకరు.

అమెరికాలోని వార్టన్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన నేహా హెచ్ ఆర్‌లో ఫైనాన్స్, మార్కెటింగ్ రంగాలలో పనిచేసింది.

2010లో తన కెరీర్‌కు బ్రేక్ వచ్చింది.

తిరిగి మూడు సంవత్సరాల తరువాత ఉద్యోగంలో చేరింది. 'కెరీర్ రీస్టార్ట్ చేయకపోతే ఎంతో నష్టపోయేదాన్ని' అని తనలో తాను అనుకుంది. అదే సమయంలో ఉద్యోగాలు మానేసి ఇంటికే పరిమితమైన ఎంతోమంది మహిళా ఉద్యోగులు గుర్తుకు వచ్చారు.

వారు అనాసక్తతతోనో, వ్యతిరేకతతోనో ఉద్యోగాలు మానేసి ఉండరు.

ఒకానొక నిర్దిష్టమైన సమయంలో తప్పనిసరి పరిస్థితులలో ఉద్యోగం మానేసి ఉంటారు. వారు తిరిగి ఉద్యోగంలో చేరాలకుంటున్నా దారి కనిపించి ఉండదు.

'పురుషులతో పోల్చితే మహిళలకు ఉద్యోగ అవకాశాలు అనే కిటికీ చాలా చిన్నది' అంటుంది నేహా.

'వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగం మానేసిన నేను కాస్త ఆలస్యంగా అయినా తిరిగి ఉద్యోగం చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. అయితే అది అంత సులువైన విషయం కాదని తెలిసిపోయింది. ఈ పరిస్థితులలో జాబ్స్ ఫర్ హర్ చుక్కానిలా కనిపించింది' అంటుంది శ్రీప్రియ.

కొంత కాలం తరువాత...

'జాబ్స్ ఫర్ హర్' వెంచర్‌ను 'హర్ కీ' పేరుతో రీబ్రాండ్ చేసింది నేహా.

'హర్ కీ'కి కలారీ క్యాపిటల్, 360 వన్ ఎసెట్... మొదలైన సంస్థలు ఫండింగ్ చేశాయి.

'ఉద్యోగం మానేసిన మహిళలలో ఎనభై శాతం మంది తిరిగి ఉద్యోగం చేయాలనుకుంటున్నారు. అలాంటి వారికి హర్ కీ కొత్త దారి చూపుతుంది' అంటోంది '360 వన్ ఎసెట్' సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నిధి గుమాన్.

ఇంటిప్స్

గ్యాస్ స్టవ్ క్లీనింగ్



గోరువెచ్చని నీటిలో కొంచెం సర్ఫ్ బాగా కలిపి స్పాంజి ముంచి గ్యాస్ స్టవ్ టాప్ ని శుభ్రం చేయాలి. ఆ తర్వాత శుభ్రమైన పొడి వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాత గ్లాస్ స్టవ్ మీద బేకింగ్ సోడా చల్లి నిమ్మకాయ తొక్కతో శుభ్రం చేయాలి. బేకింగ్ సోడా, నిమ్మకాయ కఠినమైన మరకలను తొలగించటమే కాకుండా మురికిని, జిడ్డును తొలగిస్తాయి.

ఒక గిన్నెలో నీటిని పోసి డిష్ సోప్, బేకింగ్ సోడా సమాన భాగాలుగా వేసి బాగా కలిపి దానిలో బర్నర్ స్టాండ్స్ ఉంచాలి. 15 నిమిషాలు అయ్యాక శుభ్రమైన నీటితో కడిగితే జిడ్డు అంతా తొలగిపోయి శుభ్రంగా మారుతాయి.

బేకింగ్ సోడా, ఉప్పు సమాన భాగాలుగా తీసుకుని నీటితో పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ పేస్ట్‌ని గ్యాస్ స్టవ్ టాప్ మీద, బర్నర్స్ స్టాండ్ కి రాసి పది నిమిషాలు అలా వదిలేయాలి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేస్తే జిడ్డు, మరకలు, మురికి అన్ని తొలగిపోతాయి. పైన చెప్పుకున్న పద్ధతులలో మీకు సులువుగా అనిపించిన దానిని అనుసరించవచ్చు.

వంటిల్లు

మ్యాంగో మెనూ

**వేసవి అతిథి అందరిళ్లకూ వచ్చేసింది.
వంటగదిలో తన స్థానాన్ని పదిలపరుచుకుంది.
'మీరేదైనా వండండి... అందులో నేనుంటా...'
అని మారాం చేస్తోంది మామిడికాయ.
కచ్చాపచ్చాగా కారంకారంగా రోటి పచ్చడవుతుంది.
అన్నంలో కలిసి పుల్లపుల్లగా పులిహోరవుతుంది.
ఎండ నుంచి సేదదీర్చే ఆమ్ పన్నా అవుతుంది.
రొయ్యలతో జతకట్టి ఘుమఘుమలాడుతుంది.
పండే లోపు ఇలా వండుకోండని చెబుతోంది.**



మ్యాంగో పులిహోర

కావలసినవి:
బియ్యం– రెండు కప్పులు ;
మామిడికాయ తురుము – కప్పు ; పసుపు– టీ స్పూన్
ఉప్పు– టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; వేరుశనగ పప్పు – టేబుల్ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; శనగపప్పు – అర టేబుల్ స్పూన్ ; మినప్పప్పు – టీ స్పూన్ ; ఇంగువ – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; పచ్చిమిర్చి– 2 ; కరివేపాకు రెమ్మలు– 4.

తయారీ: ● బియ్యం కడిగి అన్నం పలుకుగా వండి వెడల్పు పాత్రలోకి మార్చాలి. వేడి తగ్గిన తరవాత అర టీ స్పూన్ పసుపు వేసి గరిటెతో కలియ తిప్పి అన్నాన్ని పూర్తిగా చల్లారనివ్వాలి. తర్వాత అన్నంలో ఉప్పు, మామిడి తురుము వేసి కలపాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అందులో వేరుశనగ పప్పు దోరగా వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో ఆవాలు, ఎండుమిర్చి, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేయించాలి. ఇప్పుడు పచ్చిమిర్చి, ఇంగువ, పసుపు, కరివేపాకు వేసి స్టవ్ ఆపేయాలి. ఈ పోపు అంతటినీ అన్నం–మామిడి తురుములో వేసి సమంగా కలిసే వరకు గరిటెతో జాగ్రత్తగా (అన్నం ముద్ద కాకుండా) కలపాలి. ఇప్పుడు వేయించి పక్కన పెట్టుకున్న వేరుశనగపప్పు వేసి కలిపి వడ్డించాలి.



రోస్టెడ్ ఆమ్ పన్నా

కావలసినవి: మామిడి కాయలు – 3 ; పుదీన ఆకులు– పావు కప్పు ; జీలకర్ర పొడి– టీ స్పూన్ (జీలకర్రను వేయించి పొడి చేయాలి) ; బ్లాక్ సాల్ట్ – అర టీ స్పూన్ ; చక్కెర – కప్పు.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రంగా కడిగి తేమ లేకుండా తుడవాలి. ● స్టవ్ మీద గ్రిల్ పెట్టి మామిడి కాయలను సన్న మంట మీద (బొగ్గుల్లో కాల్చినట్లు) కాల్చాలి. అన్ని వైపులా కాలిన తర్వాత పక్కన పెట్టి చల్లారనివ్వాలి. చల్లారిన తర్వాత తొక్కు ఒలిచి కాయను (గుజ్జును) చాకుతో ముక్కలు చేయాలి. ఇలా మూడు కాయల గుజ్జును ఒక పాత్రలో వేసుకోవాలి. అందులో పుదీన, జీలకర్ర పొడి, నల్ల ఉప్పు, చక్కెర వేసి స్పూన్‌తో కానీ హ్యాండ్ బ్లెండర్‌తో కానీ కలపాలి. మామిడి గుజ్జు, చక్కెర మొత్తం కరిగి మృదువుగా వచ్చేవరకు బ్లెండ్ చేయాలి. చేత్తో కలపడం కుదరకపోతే మిక్సీలో బ్లెండ్ చేయవచ్చు. ఆమ్ పన్నా రెడీ. తయారీలో నీరు వేయరాదు. ● తేమ లేని సీసాలో నిల్వ చేసుకోవాలి. గ్లాసునీటికి మూడు టేబుల్ స్పూన్‌ల ఆమ్ పన్నా కలుపుకోవాలి. ఇష్టమైతే తాజా పుదీనతో గార్నిష్ చేసుకోవచ్చు.

గమనిక: ● మామిడి గుజ్జుకు రెండింతలు చక్కెర ఉండాలి. గుజ్జు కొలతను బట్టి చక్కెర మోతాదు మార్చుకోవాలి. ● మామిడి రకాలను బట్టి పీచు ఎక్కువ – తక్కువ ఉంటుంది. బ్లెండ్ చేసిన తర్వాత కూడా పీచు ఎక్కువగా అనిపిస్తే వడపోసుకోవాలి. ● ఆమ్ పన్నాని ఫ్రిజ్‌లో పెట్టకపోయినా సరే తేమ తగలకుండా వాడితే వారం రోజులు తాజాగా ఉంటుంది. మామిడి పండే లోపు తాగ గలిగిన మ్యాంగో జ్యూస్ ఆమ్ పన్నా. ఇది మహారాష్ట్ర స్పెషల్. ● మామిడికాయలను కాల్చడం సాధ్యం కాకపోతే ఉడికించి కూడా చేసుకోవచ్చు.



ప్రాన్స్–మ్యాంగో కర్రీ (కేరళ స్టైల్)

కావలసినవి: రొయ్యలను మారినేట్ చేయడానికి: రొయ్యలు – 500 (పొట్టు వలిచినవి) ; పసుపు – అర టేబుల్ స్పూన్ ; మిరప్పొడి – టేబుల్ స్పూన్ ; నిమ్మరసం – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; జీడిపప్పు – పది.

కొబ్బరి మసాలా కోసం: కొబ్బరి తురుము – అర కప్పు ; చింతపండు – చిన్న నిమ్మకాయంత ; ఎండు మిర్చి– 3 ; ధనియాలు – అర టీ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు.

గ్రేవీ కోసం: పసుపు – అర టీ స్పూన్ ; మిరప్పొడి – అర టీ స్పూన్ ; కరివేపాకు రెమ్మలు – 2 ; పచ్చి మామిడి కాయ – 1 ; కొబ్బరి పాలు – కప్పు ; నూనె– టీ స్పూన్.

తయారీ: ● రొయ్యలను పొట్టు వలిచిన తరవాత శుభ్రంగా కడగాలి. పసుపు, ఉప్పు వేసి రుద్ది నీటితో శుభ్రం చేస్తే జిగట, వాసన వదులుతుంది. ఆ తరవాత రొయ్యలను ఒక పాత్రలో వేసి అందులో పసుపు, మిరప్పొడి, నిమ్మరసం, ఉప్పు వేసి కలిపి అరగంట సేపు పక్కన ఉంచాలి. ● పచ్చి మామిడి కాయను చెక్కు, టెంక లేకుండా ముక్కలు చేయాలి. ● కొబ్బరి తురుము, చింతపండు, ఎండు మిర్చి, ధనియాలు, ఉల్లిపాయ ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి జీడిపప్పు వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో పసుపు, మిరప్పొడి, కరివేపాకు, కొబ్బరి మసాలా పేస్ట్ వేసి ఐదు నిమిషాల సేపు సన్న మంట మీద వేగనివ్వాలి. ఇప్పుడు మారినేట్ చేసిన రొయ్యల మిశ్రమం, మామిడి ముక్కలు వేసి కలపాలి. మిశ్రమం ఉడకడం మొదలైన తర్వాత కొబ్బరి పాలు పోసి కలిపి సన్న మంట మీద ఉడకనివ్వాలి. ఐదారు నిమిషాలకు మసాలాలన్నీ కలిసి గ్రేవీ చిక్కబడుతుంది. రుచి చూసుకుని అవసరమైతే కొద్దిగా నీటిని పోసి వేడయ్యే వరకు మరిగించి జీడిపప్పు కలిపి దించేయాలి. ఇది అన్నం, చపాతీలోకి రుచిగా ఉంటుంది.



మామిడి కాయ రోటి పచ్చడి

కావలసినవి: మామిడి కాయలు – 3 (మీడియం సైజువి) ; ఎండు మిర్చి– 15 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఆవాలు – అర టీ స్పూన్ ; ధనియాలు – అర టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; నూనె– టేబుల్ స్పూన్.

పోపు కోసం: ఆవాలు – అర టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; ఎండు మిర్చి– 2 ; పచ్చి శనగ పప్పు – టీ స్పూన్ ; ఇంగువ – చిటికెడు ; కరివేపాకు – 2 రెమ్మలు ; వెల్లుల్లి రేకలు– 4.

తయారీ: ● మామిడి కాయలను శుభ్రం చేసి ముక్కలు చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి ఎండుమిర్చి, ఆవాలు, ధనియాలు వేసి వేయించి చివరగా ఇంగువ వేసి దించేయాలి. ● ఎండు మిర్చి వేడి తగ్గిన తరవాత రోలు లేదా మిక్సీలో వేసి పొడి చేయాలి. అందులో మామిడి ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. చివరగా ఉప్పు కలిపి ఒకసారి తిప్పి గిన్నెలోకి తీసుకోవాలి. ● ఎండుమిర్చి వేయించిన బాణలిలో మిగిలిన నూనెలో పోపు కోసం తీసుకున్న ఆవాలు, మెంతులు, పచ్చి శనగపప్పు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత ఇంగువ, కరివేపాకు, వెల్లుల్లి రేకలు వేసి దించేయాలి. ఈ పోపును మిక్సీలో వేసి సిద్ధంగా ఉంచిన మామిడికాయ పచ్చడిలో వేసి కలపాలి.





ఐపీఎల్ టోర్నీకి సుందర్ దూరం

తొడ కండరాల గాయంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆల్‌రౌండర్, భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఐపీఎల్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. తమిళనాడుకు చెందిన 23 ఏళ్ల సుందర్ ఈ ఐపీఎల్ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి 60 పరుగులు చేసి, మూడు వికెట్లు పడగొట్టాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలోనూ సుందర్ గాయాలబారిన పడ్డాడు. చేతి వేలి గాయంతో 2021 ఐపీఎల్ యూఏఈ దశ మ్యాచ్‌లకు... 2022లో నాలుగు ఐపీఎల్ మ్యాచ్‌లకు సుందర్ దూరమయ్యాడు.



బోపన్న జోడీ శుభారంభం

మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మాడ్రిడ్‌లో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్ బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 7–6 (7/4)తో రొబెర్టో బాటిస్టా అగుట్ (స్పెయిన్)–డేనియల్ ఇవాన్స్ (బ్రిటన్) జోడీపై విజయం సాధించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ఎబ్డెన్ పది ఏస్‌లు సంధించడంతోపాటు, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.

గ్రేడ్ 'సి'లో మేఘన, అంజలి

బీసీసీఐ మహిళా క్రికెటర్ల కాంట్రాక్ట్‌లు



సబ్బినేని మేఘన



అంజలి శర్వాణి

ముంబై: భారత మహిళల జట్టు తరఫున నిలకడగా రాణిస్తున్న ఇద్దరు ఆంధ్ర ప్రదేశ్ క్రికెటర్లు సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి లకు తొలిసారి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ లభించింది. కొత్తగా ప్రకటించిన జాబితాలో వీరిద్దరికి గ్రేడ్ 'సి'లో చోటు దక్కింది. బ్యాటర్ మేఘన ఇప్పటి వరకు భారత్ తరఫున 3 వన్డేలు, 17 టి20లు ఆడగా... లెఫ్టార్మ్ పేసర్ అంజలి 6 టి20ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. మూడు గ్రేడ్‌లలో కలిపి మొత్తం 17 మందితో బోర్డు వార్షిక కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించింది. గ్రేడ్ 'ఎ'లో ఇప్పటి వరకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన మాత్రమే ఉండగా కొత్తగా ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు అవకాశం లభించింది. మే 2021 తర్వాత మహిళా క్రికెటర్లకు కాంట్రాక్ట్‌లు ప్రకటించడం ఇదే తొలిసారి. గత జాబితాలో ఉండి ప్రస్తుతం రిటైర్ అయిన మిథాలీ రాజ్, జులన్ గోస్వామిలతో పాటు పూనమ్ యాదవ్‌ను కూడా తప్పించగా... 'బి' గ్రేడ్ జాబితాను 10నుంచి ఐదుకు కుదించారు. ప్రస్తుతం జట్టులో కీలకంగా మారిన రేణుకా ఠాకూర్, రిచా ఘోష్‌లకు ప్రమోషన్ దక్కగా, పూజ వస్త్రకర్ 'బి' నుంచి 'సి'కి పడిపోయింది.

కాంట్రాక్ట్‌ల జాబితా

గ్రేడ్ 'ఎ' (రూ. 50 లక్షలు): హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ. **గ్రేడ్ 'బి' (రూ. 30 లక్షలు):** రేణుకా ఠాకూర్, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, రాజేశ్వరి గైక్వాడ్. **గ్రేడ్ 'సి' (రూ. 10 లక్షలు):** మేఘనా సింగ్, దేవిక వైద్య, సబ్బినేని మేఘన, అంజలి శర్వాణి, పూజ వస్త్రకర్, స్నేహ్ రాణా, రాధా యాదవ్, హర్లీన్ డియోల్, యస్తిక భాటియా.

క్వార్టర్ ఫైనల్లో సింధు



దుబాయ్: ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మూడో పతకానికి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విజయం దూరంలో నిలిచింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21–12, 21–15తో తొమ్మిదో ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరింది. హాన్ యువెపై సింధుకిది నాలుగో విజయం కావడం విశేషం. 2014, 2022లలో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు నెగ్గిన సింధు నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో ఆడుతుంది. గతంలో ఆన్ సె యంగ్‌తో ఆడిన ఐదుసార్లూ సింధు ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ 21–16, 5–21, 21–18తో చికో ఔరా ద్వి వర్డోయో (ఇండోనేసియా)పై నెగ్గగా... కిడాంబి శ్రీకాంత్ 14–21, 22–20, 9–21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సియో సెయుంగ్ జే–చె యు జంగ్ (దక్షిణ కొరియా) జోడీ నుంచి సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జంటకు వాకోవర్ లభించడంతో క్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–13, 21–11తో జిన్ యోంగ్–నా సంగ్ సెంగ్ (కొరియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జంట గాయం కారణంగా బరిలోకి దిగకుండా ప్రత్యర్థి జోడీకి వాకోవర్ ఇచ్చింది.

రాజస్తాన్ ధనాధన్

- చెన్నైపై 32 పరుగులతో జయభేరి
- మెరిపించిన యశస్వి
- కూల్చేసిన జంపా, అశ్విన్
- దూబే పోరాటం వృథా



యశస్వి

జైపూర్: అప్పుడు చెన్నైలో... ఇప్పుడు సొంత ఇలాకాలో రాజస్తాన్ రాయల్స్ తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. గురువారం జరిగిన ఐపీఎల్ పోరులో రాయల్స్ 32 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై జయభేరి మోగించింది. మొదట రాజస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (43 బంతుల్లో 77; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించగా, తుషార్ దేశ్‌పాండే 2 వికెట్లు తీశాడు. అనంతరం చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులే చేసింది. శివమ్ దూబే (33 బంతుల్లో 52; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రుతురాజ్(29 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు కనబరిచారు. స్పిన్నర్ ఆడమ్ జంపా (3/22), అశ్విన్ (2/35) తిప్పేశారు.

విరుచుకుపడిన యశస్వి

రాజస్తాన్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ యశస్వి జైస్వాల్ తొలి బంతి నుంచే దూకుడుగా నడిపించాడు. ఆకాశ్ సింగ్ మొదటి ఓవర్లో మూడు బౌండరీలు బాదిన అతను మళ్లీ మూడో ఓవర్ వేసేందుకు వస్తే 4, 0, 6, 0, 4, 4లతో 18 పరుగులు పిండుకున్నాడు. బట్లర్ కూడా ఫోర్లు బాదడంతో పవర్ ప్లేలో రాయల్స్ 64/0 స్కోరు చేసింది. ఏడో ఓవర్లోనే జైస్వాల్ ఫిఫ్టీ (26 బంతుల్లో) పూర్తయ్యింది. కాసేపటికి బట్లర్ (21 బంతుల్లో 27; 4 ఫోర్లు) అవుటైనా... సంజూ సామ్సన్ (17)తో కలిసి యశస్వి తన జోరుకొనసాగించాడు. అయితే 14వ ఓవర్లో తుషార్ వీరిద్దరిని అవుట్ చేయగా, హిట్టర్ హెట్‌మైర్ (8) విఫలమయ్యాడు. ఈ దశలో స్కోరు వేగం మందగించగా... మళ్లీ డెత్ ఓవర్లలో ధ్రువ్ జురెల్ (15 బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), పడిక్కల్ (13 బంతుల్లో 27 నాటౌట్; 5 ఫోర్లు) దంచేయడంతో స్కోరు 200 దాటింది.

చెన్నై చతికిల...

కొండంత లక్ష్యం ఛేదించాల్సిన జట్టుకు మెరుగైన ఆరంభం కావాలి. కానీ రుతురాజ్‌కు తోడుగా దిగిన ఓపెనర్ కాన్వే (8), టాపార్డర్‌లో వచ్చిన రహానే (15) విఫలమయ్యారు. 11వ ఓవర్లోనే 73 పరుగుల వద్ద అంబటి రాయుడు (0) రూపంలో నాలుగో వికెట్ పడిపోవడంతోనే చెన్నై చతికిల పడింది. ఆరంభంలో ఓపెనర్ రుతురాజ్ తన ధాటిని కొనసాగించాడు. ఆ తర్వాత వచ్చిన వారిలో ఒక్క దూబే తప్ప ఇంకెవరూ అలా ఆడలేకపోయారు. అయితే వీళ్లిద్దరి మెరుపులు అంతపెద్ద లక్ష్యానికి ఏ మాత్రం సరిపోలేదు. మొయిన్ అలీ (12 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), రవీంద్ర జడేజా (15 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) మోస్తరు స్కోరే చేశారు.



జంపా

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) రహానే (బి) తుషార్ 77; బట్లర్ (సి) దూబే (బి) జడేజా 27; సామ్సన్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 17; హెట్‌మైర్ (బి) తీక్షణ 8; ధ్రువ్ (రనౌట్) 34; పడిక్కల్ (నాటౌట్) 27; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 202. వికెట్ల పతనం: 1–86, 2–125, 3–132, 4–146, 5–194. బౌలింగ్: ఆకాశ్ 2–0–32–0, తుషార్ 4–0–42–2, తీక్షణ 4–0–24–1, జడేజా 4–0–32–1, మొయిన్ అలీ 2–0–17–0, పతిరణ 4–0–48–0.

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) పడిక్కల్ (బి) జంపా 47; కాన్వే (సి) సందీప్ (బి) జంపా 8; రహానే (సి) బట్లర్ (బి) అశ్విన్ 15; దూబే (సి) బట్లర్ (బి) కుల్దీప్ 52; రాయుడు (సి) హోల్డర్ (బి) అశ్విన్ 0; మొయిన్ అలీ (సి) సామ్సన్ (బి) జంపా 23; జడేజా (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 170. వికెట్ల పతనం: 1–42, 2–69, 3–73, 4–73, 5–124, 6–170. బౌలింగ్: సందీప్ శర్మ 4–0–24–0, కుల్దీప్ యాదవ్ 3–0–18–1, హోల్డర్ 4–0–49–0, అశ్విన్ 4–0–35–2, ఆడమ్ జంపా 3–0–22–3, చహల్ 2–0–21–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	8	5	3	10	0.939
గుజరాత్	7	5	2	10	0.580
చెన్నై	8	5	3	10	0.376
లక్నో	7	4	3	8	0.547
బెంగళూరు	8	4	4	8	-0.139
పంజాబ్	7	4	3	8	-0.162
కోల్‌కతా	8	3	5	6	-0.027
ముంబై	7	3	4	6	-0.620
హైదరాబాద్	7	2	5	4	-0.725
ఢిల్లీ	7	2	5	4	-0.961

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.–నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మదుష్కా, కుశాల్ మెండిస్ డబుల్ సెంచరీలు



మదుష్కా



మెండిస్

గాలె: ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 3 వికెట్లకు 704 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 357/1తో నాలుగో రోజు ఆట కొనసాగించిన శ్రీలంక రెండు వికెట్లు చేజార్చుకొని 347 పరుగులు సాధించింది. నిషాన్ మదుష్కా (339 బంతుల్లో 205; 22 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (291 బంతుల్లో 245; 18 ఫోర్లు, 11 సిక్స్‌లు) కెరీర్‌లో తొలిసారి డబుల్ సెంచరీలు సాధించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 268 పరుగులు జోడించారు. ఏంజెలో మాథ్యూస్ (114 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ పూర్తి కాగానే లంక ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. టెస్టు ఇన్నింగ్స్‌లో శ్రీలంక 700 అంతకంటే ఎక్కువ పరుగులు చేయడం ఇది ఏడోసారి కావడం విశేషం. 212 పరుగులతో వెనుకబడిన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 54 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే మ్యాచ్ చివరిరోజు శుక్రవారం ఐర్లాండ్ మరో 158 పరుగులు చేయాలి.

'భారత్ పరువు పోతోంది'

- రెజ్లర్లకు క్రమశిక్షణ లేదు
- ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వివాదాస్పద వ్యాఖ్యలు





వినేశ్, సాక్షి

న్యూఢిల్లీ: తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధానిలో ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్న అగ్రశ్రేణి రెజ్లర్లకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి అనూహ్య స్పందన ఎదురైంది. వారి తీరును తప్పుపడుతూ ఐఓఏ అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. వారు వీధుల్లోకి వెళ్లకుండా ఉండాల్సిందని ఆమె సూచించింది. 'లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఐఓఏలో ఒక కమిటీతో పాటు అథ్లెటిక్స్ కమిషన్ కూడా ఉంది. వారంతా వీధుల్లోకి వెళ్లకుండా మా వద్దకు రావాల్సింది. కానీ వారు అలా చేయలేదు. కొంత క్రమశిక్షణ కూడా అవసరం. వారు చేస్తున్న పని ఆటకు మంచిది కాదు. ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు మంచి పేరు ఉంది. ఇలాంటి నిరసనల వల్ల దేశం పరువు పోతోంది. ఈ తరహా ప్రతికూల ప్రచారం దేశానికి మంచిది కాదు. ఏదైనా చట్టప్రకారం ఉండాలి. వారంతా ధర్నాలో కూర్చొని రాజకీయ పార్టీల మద్దతు కోరడం నన్ను తీవ్రంగా నిరాశపరుస్తోంది' అని పీటీ ఉష అభిప్రాయపడింది. ఉష మాటలపై స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'ఆమె స్వయంగా ఒక అథ్లెట్. పైగా మహిళ కూడా. మేం ఆమె మద్దతు కోరుకున్నాం. కానీ ఆమె నుంచి ఇలాంటి తీవ్రమైన స్పందన ఊహించలేదు. రెజ్లర్ల చర్య వల్ల భారత్ పరువు పోతోంది అని భావిస్తే గతంలో తన అకాడమీలో కొందరు గూండాలు తనను వేధిస్తున్నారంటూ ఆమె అందరి ముందు ఏడవలేదా. అప్పుడేం జరిగింది' అంటూ బజరంగ్ గుర్తు చేశాడు.

వారికీ అవకాశమిచ్చాం: క్రీడల మంత్రి ఠాకూర్

రెజ్లర్ల సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరుపుతోందని కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. తమ వైపు నుంచి అన్ని విషయాలను వెల్లడించేందుకు రెజ్లర్లకు తగినంత అవకాశం ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. మూడు నెలల క్రితం తొలిసారి వారు నిరసన జరిపినప్పుడు తాను స్వయంగా 12 గంటల పాటు వారితో చర్చలు జరిపానని... విచారణ కమిటీ 14 సార్లు సమావేశాలు నిర్వహించి ఆటగాళ్లు తమ బాధలు చెప్పుకునే అవకాశం ఇచ్చిందని ఠాకూర్ అన్నారు.

యువర్స్

• సక్సెస్ స్టోరీ



హర్ష్ అగర్వాల్, నిఖిత తివారి

శుభప్రద శూల్

నేల గుండె చప్పుడు వింటే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయి. నిఖిత తివారి, హర్ష్ అగర్వాల్‌లు 'శూల్' అనే సెన్సర్‌కు రూపకల్పన చేశారు. తక్కువ సమయంలోనే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. రైతుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారు...

మనిషికి ఆరోగ్యం ఉన్నట్లే, భూమికి కూడా ఉంటుంది. అయితే దాని బాగోగుల గురించి పట్టించుకునే సంప్రదాయం మన దగ్గర తక్కువగా ఉంది.

వ్యవసాయరంగమే వెన్నెముక అయిన మన దేశంలో భూమి, పంటలకు సంబంధించిన శాస్త్రీయ అవగాహన చాలా తక్కువమంది రైతులకు మాత్రమే ఉంది. మన దేశంలో ఆన్–ఫీల్డ్ ఎనాలటిక్స్‌కు సంబంధించిన కంపెనీలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. మరోవైపు ఆ సాంకేతిక జ్ఞానాన్ని అందిపుచ్చుకునే ఆర్థిక స్థోమత చాలామంది రైతులకు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్, 26 సంవత్సరాల నికిత తివారిలు 'నీర్‌ఎక్స్' అనే అగ్రిటెక్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టారు.

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన హర్ష్ అగర్వాల్ గుజరాత్‌లోని అహ్మదాబాద్ నిర్మ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశాడు. సాంకేతిక విషయాలపై ఆసక్తి ఉన్న అగర్వాల్‌కు కాలేజి స్టూడెంట్ ఆర్గనైజేషన్‌కు వైస్–ప్రెసిడెంట్‌గా పనిచేయడంతో మేనేజ్‌మెంట్ స్కిల్స్ అలవడ్డాయి. అవి తన స్టార్టప్ నడకలో ఉపయోగపడ్డాయి.

ఛత్తీస్‌ఘడ్‌లోని అంబికాపూర్‌కు చెందిన నికిత తివారి రాయ్‌పూర్‌లోని 'నిట్'లో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్‌లో బీటెక్ చేసింది. గుజరాత్‌లోని అమ్రాపూర్‌లో జరిగిన 'సృష్టి–సమ్మర్ స్కూల్: ఇన్నోవేషన్' ఆ ఇద్దరిని ఒకరికొకరు పరిచయం అయ్యేలా చేసింది. గ్రాస్‌రూట్ లెవెల్లో ఇన్నోవేషన్‌పై ఆసక్తి కలిగించేలా చేసింది.

కాలేజీ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదట ఇద్దరూ కలిసి 'శూల్' మొబైల్ అప్లికేషన్‌పై పనిచేశారు.

'వాతావరణంలో మార్పులు జరుగుతుంటాయి. కొన్నిసార్లు ఊహలకు అందవు. ఇలాంటి పరిస్థితులలో రియల్ టైమ్ అప్‌డేట్‌లను నిమిషాల వ్యవధిలో రైతులకు అందించాలనుకొన్నాం. మా కల ఫలించింది' అంటున్నాడు హర్ష్ అగర్వాల్.

'మా టెక్నాలజీలో ఎక్కువ శాతం అంతర్జాలం అవసరం లేకుండానే వాడుకోవచ్చు' అంటుంది నికిత తివారి.

> 'శూల్ సెన్స్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న రైతులకు ల్యాండ్ టోపాలజీ, వేసిన పంట, వాతావరణం, ప్రాంతం ఆధారంగా విలువైన సమాచారాన్ని అందిస్తోంది నీర్‌ఎక్స్.

భూసార పరీక్షకేంద్రాలతో ఫలితాలు తెలుసుకోవడానికి వారాలు పడుతుంది. అయితే శాటిలైట్ డాటా ద్వారా నిమిషాల వ్యవధిలోనే 'శూల్' ఫలితాలు అందిస్తోంది.

'శూల్ సెన్స్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న రైతులకు ల్యాండ్ టోపాలజీ, వేసిన పంట, వాతావరణం, ప్రాంతం ఆధారంగా విలువైన సమాచారాన్ని అందిస్తోంది నీర్‌ఎక్స్.

'సరియైన ఎరువులు వాడకపోవడం వల్ల భూమికి సంబంధించి సమస్యలు ఎదుర్కొన్నాను. ఈ సమయంలో నీర్‌ఎక్స్ మొబైల్ అప్లికేషన్ నాకు ఎంతో ఉపయోగపడింది' అంటున్నాడు ఛత్తీస్‌ఘడ్‌లోని బలరామ్‌పూర్‌కు చెందిన సంతోష్ పర్మార్ అనే రైతు.

కంపెనీ ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలలోని ఎంతోమంది రైతులతో కలిసి పనిచేసింది. దీనితోపాటు 60 ఆర్గనైజేషన్స్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లతో కలిసి పని చేసింది. ఈ స్టార్టప్‌కు పెద్దగా ఫండింగ్ లేకపోయినప్పటికీ స్టార్టప్ అప్లికేషన్ స్కీమ్‌లో భాగంగా గుజరాత్ ప్రభుత్వం గ్రాంట్ అందించింది.

'గ్రాంట్ డబ్బు ద్వారా తయారీ ఖర్చు తగ్గించడం, డివైజ్ ఎక్కువమంది రైతులకు అందుబాటులోకి వచ్చేలా చేయడంపై దృష్టి పెడుతున్నాం' అంటున్నాడు అగర్వాల్.

• గేమింగ్

అదిగో అక్కడే ఉన్నారు!

ఫస్ట్–పర్సన్ షూటర్ వీడియో గేమ్ 'రెడ్ ఫాల్' మే2న విడుదల అవుతుంది. ఫిక్షనల్ ఐలాండ్‌లో జరిగే ఫస్ట్ పర్సన్ షూటర్‌గేమ్ ఇది. వ్యాంపైర్స్‌తో పోరాటం చేయడానికి విభిన్న నేపథ్యాలు, శక్తిసామర్థ్యాలు ఉన్న నాలుగు క్యారెక్టర్‌లలో ఒకటిని ప్లేయర్ ఎంచుకోవాలి. ఆ క్యారెక్టర్స్...

డెవిందర్ క్రౌస్లే: ఇంటర్‌నెట్–ఫేమస్ పారానార్మల్ ఇన్వెస్టిగేటర్; **లైల్ల ఎలిసన్:** రెడ్‌ఫాల్ టెక్నికల్ యూనివర్శిటీ స్టూడెంట్; **జాకబ్ బోయర్:** మాజీ–మిల్ట్రీ షార్ప్ షూటర్ **రెమీ డెల రోజ్:** నేవీ రెస్క్యూ సర్వీస్‌లో పనిచేసే షార్ప్‌షూటర్. ఈ నాలుగు క్యారెక్టర్లకు ద్వీప పట్టణంతో తమదైన అనుభవాలు, అనుబంధాలు ఉంటాయి.



ప్లాట్‌ఫామ్: విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

జానర్: ఫస్ట్–పర్సన్ షూటర్ **ఇంజిన్:** అన్ రియల్ ఇంజిన్ 4

మోడ్స్: సింగిల్ ప్లేయర్, మల్టీ ప్లేయర్

• మ్యూజిక్ వరల్డ్

పాటల రెక్కలతో..



షల్మాలీ ఖోల్‌గాడే

ఎనిమిది సంవత్సరాల వయసులో తీయగా గొంతు సవరించి 'ఆహా' అనిపించింది ముంబైకి చెందిన షల్మాలీ ఖోల్‌గాడే. పదహారు సంవత్సరాల వయసులో సంగీత వేదికలపై పాడడం మొదలుపెట్టింది. ఇరవైలలో 'ఇష్క్‌జాదే' సినిమాతో బాలీవుడ్ ఆరంగేట్రం చేసింది. హిందీతో పాటు బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళం... మొదలైన భాషలలో పాడింది.

చిన్న వయసులోనే సింగర్‌గా పెద్ద పేరు తెచ్చుకున్న షల్మాలీ ఇలా అంటోంది...

'ఫిల్మ్ మ్యూజిక్ వల్ల తక్కువ టైమ్‌లోనే సుపరిచితం అవుతాం. నాకు కూడా అలాగే పేరు వచ్చింది. దీని కంటే నాకు బాగా సంతోషం ఇచ్చే విషయం సొంతంగా రాయడం. సంగీతం సమకూర్చడం... మొదలైనవి'.

సినిమాలకు నేపథ్యగీతాలు ఆలపించడం ఒక ఎత్తయితే, లైవ్ ఈవెంట్స్‌లో ప్రేక్షకులను ఆకట్టుకోవడం మరో ఎత్తు. లైవ్ ఈవెంట్స్‌లో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడంలో మంచి పేరు తెచ్చుకుంది షల్మాలీ.

'జనాల మధ్య పాడితే వచ్చే ఉత్సాహమే వేరు' అంటోంది.

అభిమానుల మాటలలో చెప్పాలంటే 'ఆమె పాటల రెక్కలతో అందమైన ఊహాలోకాల్లో సంచరించవచ్చు'.

• టెక్... టాక్

గెలాక్సీ ఎన్‌హ్యాన్స్–ఎక్స్ ఫొటో ఎడిటింగ్ యాప్



గెలాక్సీ ఎస్23 సిరీస్‌లో భాగంగా శాంసంగ్ గెలాక్సీ ఎన్‌హ్యాన్స్–ఎక్స్ ఫొటో ఎడిటింగ్ యాప్‌ను విడుదల చేసింది. ఈ ఫొటో అప్‌స్కేల్డ్ అండ్ మ్యాజిక్ ఎడిటర్ హెచ్‌ఆర్‌డీ ఇమేజ్‌లకు, వాటిని బ్రైటెన్ చేయడానికి, ఫిక్స్ బ్లర్, షార్పెన్, షాడోస్ రిఫ్లెక్షన్ తొలిగించడానికి, లెన్స్ డిస్ట్రాక్షన్ ఫిక్స్ చేయడానికి, పోట్రాయిట్ మోడ్ క్రియేట్ చేయడానికి ఉపయోగపడుతుంది. దీనిలో ఫేస్–రీటచింగ్ ఫీచర్స్ కూడా ఉన్నాయి.

రియల్‌మీ సీ55



డిస్‌ప్లే: 6.72 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 13; రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా: 8ఎంపీ (వైడ్)
మెమొరీ: 64జీబి 4జీబి ర్యామ్ 64జీబి 6జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ బరువు: 190గ్రా.

జీమెయిల్ లేబుల్స్



జీమెయిల్ లేబుల్స్ ద్వారా ఇమెయిల్స్‌ను రకరకాలుగా వర్గీకరించుకోవచ్చు. దీని ద్వారా ఇన్‌బాక్స్‌ను క్లీన్, క్లట్టర్ ఫ్రీగా చేసుకోవచ్చు. ఈజీ ఐడెంటిఫికేషన్ కోసం రంగులు ఇచ్చుకోవచ్చు.

కొత్త జీమెయిల్ లేబుల్ క్రియేట్ చేయడానికి (ఫ్రమ్ సైడ్ బార్): జీమెయిల్ డెస్క్‌టాప్ సైట్ లెఫ్ట్‌సైడ్‌బార్‌లో 'క్రియేట్ న్యూ లేబుల్ ఆప్షన్' కనిపిస్తుంది.

ఇమెయిల్స్‌కు లేబుల్స్ యాడ్ చేయడానికి (డెస్క్‌టాప్): ఇమెయిల్ ఓపెన్ చేసి టాప్‌లోని లేబుల్ ఐకాన్‌ను ట్యాప్ చేయాలి. లేబుల్ జాబితాలో నుంచి ఒకదాన్ని ఎంచుకొని క్లిక్ చేయాలి.

స్నాప్‌చాట్‌లో కొత్త టూల్స్



కాలిఫోర్నియాలో జరిగిన స్నాప్‌చాట్ సమ్మిట్ 2023లో కొత్త ఫీచర్స్, టూల్స్, ఇనోవేషన్‌లను ప్రకటించింది మల్టీ మీడియా ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ స్నాప్‌చాట్. ట్రివ్యక్వశ్చన్‌లకు జవాబులు ఇచ్చే, రెసిపీలకు సంబంధించి సలహాలు ఇచ్చే, ప్లాన్‌ట్రిప్‌కు హెల్ప్ చేసే 'మై ఏఐ' ప్లేఫుల్ చాట్‌బాట్‌లో, వాయిస్, వీడియో కాలింగ్, స్టోరీస్, స్నాప్‌మ్యాప్... మొదలైన వాటిలో కొత్త ఫీచర్స్‌ను తీసుకురానున్నారు.

స్టోరీ టెల్లింగ్‌ను బెటర్‌మెంట్ చేయడానికి క్రియేటర్ కమ్యూనిటీ కోసం సినిమాటిక్ టూల్స్, సరికొత్త సంగీత అనుభవాన్ని దగ్గర చేయడానికి ప్రపంచ ప్రసిద్ధ డీజే కైజో భాగస్వామ్యంతో కైజో ఎక్స్ స్నాప్‌చాట్‌ను తీసుకురానున్నారు.

• ఇంగ్లిష్ ఇడియమ్



బాయిల్ ది వోషియన్
చాలా కష్టం, అసాధ్యం అనుకున్న ప్రాజెక్ట్‌ను టేకప్ చేసినప్పుడు వాడుతారు.

కట్ కార్నర్స్
ఏదైన పనిని సులువుగా, తక్కువ ఖర్చుతో చేయడం.

టేక్ ఏ రెయిన్ చెక్... ప్లాన్‌ను పోస్ట్‌పోన్ చేసుకోవడం.

ఏ బోల్ట్ ఫ్రమ్ ది బ్లూ... ఊహించని, అనుకోకుండా జరిగిన సంఘటన.

బ్యాక్ టు స్క్వేర్ వన్... మళ్లీ తిరిగి పని ప్రారంభించడం. **ఫార్టీ వింక్స్...** చిన్నగా కునుకుతీయడం

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	349	60,649
నిఫ్టీ ▲	101	17,915

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,084	▲	230
డోజోన్స్	33,693	▼	392
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,832	▼	21
డాక్స్	15,800	▲	5
షాంఘై	3,286	▲	22
నికాయ్	28,458	▲	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (24 క్యారెట్)	60,515	▲	84
బంగారం (22 క్యారెట్)	60,273	▲	84
వెండి (కిలో)	74,415	▲	215

విప్రో లాభం ఫ్లాట్



క్యూ4లో రూ. 3,075 కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం నామమాత్ర వెనకడుగుతో రూ. 3,075 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో రూ. 3,087 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం వృద్ధితో రూ. 23,190 కోట్లను అధిగమించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం విప్రో నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 11,350 కోట్లకు పరిమితమైంది. అయితే మొత్తం ఆదాయం 14 శాతం పైగా ఎగసి రూ. 90,488 కోట్లను తాకింది. క్యూ4లో 1,823 మంది ఉద్యోగులు తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,56,921కు పరిమితమైంది.

అంచనాలు వీక్..: 2023–24 తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో ఐఎస్‌ఆర్‌ఈ సహా.. ఐటీ సర్వీసుల బిజినెస్ నుంచి ఆదాయం త్రైమాసికవారీగా 3–1% మధ్య క్షీణించవచ్చని విప్రో తాజాగా అంచనా వేసింది. వెరసి 275.3–281.1 కోట్ల డాలర్ల మధ్య ఆదాయం సాధించవచ్చని గైడెన్స్ ప్రకటించింది. బీఎఫ్ఎస్ఐ, రిటైల్‌లో మందగమన పరిస్థితులున్నా, డీల్ పైప్‌లైన్ పటిష్టంగా ఉన్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు.

షేర్ల బైబ్యాక్‌కు సై: సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు విప్రో తాజాగా వెల్లడించింది. దీనిలో భాగంగా షేరుకి రూ. 445 ధర మించకుండా 26,96,62,921 షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు తెలియజేసింది. ఇవి కంపెనీ ఈక్విటీలో 4.91 శాతం వాటాకు సమానం కాగా..ఇందుకు రూ. 12,000 కోట్లవరకూ వెచ్చించనున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ఎన్ఎస్ఈలో యథాతథంగా రూ. 375 వద్ద ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 2,601 కోట్లు
- షేరుకి రూ. 22 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 13% బలపడి రూ. 2,601 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,307 కోట్లు ఆర్జించింది. అమ్మకాల పరిమాణం, మార్జిన్లు మెరుగుపడటం లాభాల వృద్ధికి దోహదపడింది. నికర అమ్మకాలు 11 శాతం పుంజుకుని రూ. 14,926 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 13,468 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. సర్వీసులతో కలిపి మొత్తం రూ. 15,375 కోట్ల నిర్వహణ ఆదాయం సాధించినట్లు కంపెనీ పేర్కొంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 10,782 కోట్ల నుంచి రూ. 11,961 కోట్లకు పెరిగాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 22 చొప్పున తుది డివిడెండును ప్రకటించింది.

విభాగాలవారీగా: క్యూ4లో హెచ్‌యూఎల్ హోమ్ కేర్ విభాగం ఆదాయం 19% వృద్ధితో రూ. 5,637 కోట్లను తాకింది. సౌందర్యం, వ్యక్తిగత సంరక్షణ ఆదాయం 11% పుంజుకుని రూ. 5,257 కోట్లకు చేరింది. ఇక ఫుడ్స్, రిఫ్రెష్‌మెంట్ నుంచి 3 శాతం అధికంగా రూ. 3,794 కోట్లు నమోదైంది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హెచ్‌యూఎల్ కన్సాలిడేటెడ్ నికర లాభం 14% ఎగసి రూ.10,143 కోట్లను తాకింది. 2021–22లో రూ. 8,892 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 15% పైగా జంప్‌చేసి రూ.59,443 కోట్లయ్యింది. అంతక్రితం రూ.51,472 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.7 శాతం క్షీణించి రూ. 2,469 వద్ద ముగిసింది.

నష్టాల్లోకి యాక్సిస్ బ్యాంక్

- క్యూ4లో రూ. 5,728 కోట్ల నష్టం
- సిటీఇండియా రిటైల్ కొనుగోలు ఎఫెక్ట్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. జనవరి–మార్చి (క్యూ4)లో రూ. 5,728 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది (2021–2022 ఇదే కాలంలో రూ.4,118 కోట్ల నికర లాభం ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ.22,000 కోట్ల నుంచి రూ.28,865 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం సైతం రూ. 17,776 కోట్ల నుంచి రూ.23,970 కోట్లకు బలపడింది. బ్యాంకు బోర్డు వాటాదారులకు షేరుకి రూ.1 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ4లో రూ. 5,361 కోట్ల నికర నష్టం నమోదైంది. అంతక్రితం ఏడాది క్యూ4లో రూ. 4,417 కోట్ల నికర లాభం ఆర్జించింది. సిటీఇండియా రిటైల్ బిజినెస్ కొనుగోలు నేపథ్యంలో నష్టాలు నమోదైనట్లు బ్యాంక్ పేర్కొంది. ఈ ప్రభావాన్ని (రూ. 12,490 కోట్లు) మినహాయిస్తే నికర లాభం 61% వృద్ధి సాధించినట్లని బ్యాంక్ సీఈవో అమితాబ్ చౌదరీ చెప్పారు.

ఎన్‌పీఏలు డౌన్

క్యూ4లో యాక్సిస్ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 2.82 శాతం నుంచి 2.02 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.73 శాతం నుంచి 0.39 శాతానికి దిగివచ్చాయి. మొండిరుణాలు తగ్గడంతో ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 987 కోట్ల నుంచి తగ్గి రూ. 306 కోట్లకు పరిమితమయ్యాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.73 శాతం మెరుగై 4.22 శాతానికి చేరాయి.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు 0.8 శాతం క్షీణించి రూ. 881 వద్ద ముగిసింది.

పికప్ వాహన విభాగంలో ఎంఅండ్‌ఎం 2 కొత్త మోడళ్లు



హైదరాబాద్: సరకు రవాణాకు సంబంధించిన (పికప్) వాహన విభాగంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) రెండు కొత్త మోడళ్లను ఆవిష్కరించింది. రూ.7.85 లక్షల నుంచి రూ.10.33 లక్షల శ్రేణిలో ధరలు ఉన్న ఈ బొలెరో మ్యాక్స్ సామర్థ్యం 2 టన్నుల వరకూ ఉందని ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన తెలిపింది. రూ.24,999 చెల్లించి వీటిని బుక్ చేసుకోవచ్చని కూడా ప్రకటన వెల్లడించింది. 1.3 నుంచి 2 టన్నుల వరకూ పేలోడ్ సామర్థ్యంతో ఈ కొత్త శ్రేణి వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు ప్రకటన వివరించింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక పరిజ్ఞానం, సదుపాయాలతో ఈ వాహన శ్రేణి ఉత్పత్తి జరిగినట్లు వివరించింది. హెచ్‌డీ సిరీస్ (హెచ్‌డీ 2.0, హెచ్‌డీ 1.7, హెచ్‌డీ 1.3 లీటర్లు) , సిటీ సిరీస్ (సిటీ 1.3, 1.4 సీఎస్‌జీ) సిరీస్‌లలో వాహనాలు లభ్యం కానున్నట్లు తెలిపింది.

మార్కెట్లకు ఐటీ, టెలికం దన్ను

- నాలుగో రోజూ కొనసాగిన ర్యాలీ
- సెన్సెక్స్ 349, నిఫ్టీ 101 పాయింట్లు అప్



ముంబై: విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ఐటీ.. టెలికం స్టాక్స్‌లో కొనుగోళ్లు తదితర సానుకూల అంశాలతో స్టాక్ మార్కెట్లలో నాలుగో రోజూ ర్యాలీ కొనసాగింది. గురువారం సెన్సెక్స్ 349 పాయింట్లు పెరిగి 60,649 వద్ద, నిఫ్టీ 101 పాయింట్లు పెరిగి 17,915 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. నెలవారీ ఎక్స్‌పైరీ రోజున మార్కెట్ పటిష్టంగా ట్రేడయ్యిందని, అర శాతం పైగా లాభాలతో ముగిసిందని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సూచీలు ముందు ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ తర్వాత పుంజుకున్నాయని వివరించారు. రియల్టీ, ఐటీ, ఆటో తదితర రంగాల స్టాక్స్ లాభపడ్డాయని పేర్కొన్నారు.

ఇన్ఫీ, రిలయన్స్ అప్..: దిగ్గజాలైన ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లు .. మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, టైటాన్ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. హిందుస్తాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఎస్‌బీఐ, విప్రో, ఏషియన్ పెయింట్స్ మొదలైనవి నష్టపోయాయి. క్యూ4లో లాభాలు సుమారు 22 శాతం క్షీణించిన నేపథ్యంలో వోల్టాస్ షేర్లు గురువారం దాదాపు 6 శాతం క్షీణించాయి. సూచీలవారీగా చూస్తే రియల్టీ 1.57 శాతం, టెలికం 1.16 శాతం, ఐటీ 1.15 శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.72 శాతం మేర పెరిగాయి. అంతర్జాతీయంగా చూస్తే ఆసియా మార్కెట్లలో కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 1,653 కోట్లు, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 97 కోట్ల మేర కొనుగోళ్లు జరిపారు.

మ్యాన్‌కైండ్ ఐపీవో సక్సెస్

15 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్



గురువారం ముగిసిన మ్యాన్‌కైండ్ ఫార్మా పబ్లిక్ ఇష్యూకి 15.32 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. కంపెనీ 2.8 కోట్లకు పైగా షేర్లు ఆఫర్ చేయగా.. 42.95 కోట్లకు పైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో అత్యధికంగా 49.2 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 3.8 రెట్లు అధికంగా స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్లు మాత్రం 92 శాతానికే దరఖాస్తు చేశారు. ఇష్యూకి ధరల శ్రేణి రూ.1,026–1,080కాగా.. తద్వారా కంపెనీ రూ. 4,326 కోట్లు సమీకరించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ సోమవారం (24న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,298 కోట్ల పెట్టుబడులను సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. ఒక్కో షేరుకీ రూ. 1,080 చొప్పున 1.2 కోట్ల షేర్లను జారీ చేసింది. మే 9న కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టుకానున్నాయి.

బలహీన విధానాలతోనే
బ్యాంకింగ్ సంక్షోభం


- అమెరికాలో పరిణామాలకు ఇదే కారణం
- బలంగానే దేశీయ బ్యాంకులు
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: బలహీన వ్యాపార విధానాలే అమెరికాలో బ్యాంకింగ్ సంక్షోభానికి కారణమై ఉండొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు. ఈ నేపథ్యంలో దేశీయ బ్యాంకుల వ్యాపార విధానాలను తాము సునిశితంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో భారత బ్యాంకులు బలంగానే ఉన్నట్టు స్పష్టం చేశారు. అమెరికాలో ఇటీవలే సిలికాన్ వ్యాలీ బ్యాంకులో నిధుల సమస్య తలెత్తడం తెలిసిందే. డిపాజిటర్లలో అభద్రతకు దారితీసి, ఆ ప్రభావం ఇతర బ్యాంకులకూ విస్తరించడం తెలిసిందే. ఈ క్రమంలో శక్తికాంతదాస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ''అమెరికాలో ఇటీవలి పరిణామాలు చూస్తే అక్కడ విడిగా ఒక్కో బ్యాంకులవారీ వ్యాపార విధానాలు సరిగ్గానే ఉన్నాయా? లేవా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. భారత బ్యాంకుల వ్యాపార విధానాలను ఆర్‌బీఐ మరింత పరిశీలనగా చూడడం మొదలు పెట్టింది. ఒకవేళ లోపాలు ఉంటే అది సంక్షోభానికి దారితీయవచ్చు''అని శక్తికాంతదాస్ చెప్పారు. ముంబైలో ఓ అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన సందర్భంగా దాస్ ఈ అంశంపై మాట్లాడారు. ''బ్యాంకులు అనుసరించే వ్యాపార విధానాల వల్ల కొన్ని సందర్భాల్లో వాటి బ్యాలెన్స్ షీట్లలోని కొన్ని భాగాల్లో సమస్యలు ఏర్పడొచ్చు. అవి ఆ తర్వాత పెద్ద సంక్షోభానికి కారణం కావచ్చు. అమెరికా, యూరప్ బ్యాంకింగ్‌లో ఇటీవలి పరిణామాలు గమనిస్తే వాటి బ్యాలెన్స్ షీట్లలో సురక్షిత ఆస్తులు అనుకున్న వాటి నుంచే సమస్యలు ఎదురవుతున్నాయని తెలుస్తోంది''అని దాస్ పేర్కొన్నారు. అమెరికాలో సిలికాన్ వ్యాలీ బ్యాంకు సంక్షోభానికి ఆస్తుల, అప్పుల మధ్య అసమతుల్యత వల్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతుండడం తెలిసిందే.

సినిమా

అటు యాక్షన్.. ఇటు డబ్బింగ్


• చిరంజీవి

హీరో చిరంజీవి బరిలోకి దిగి, విలన్లను రఫ్ఫాడిస్తున్నారు. ఇదంతా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్' కోసమే. మెహర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా నటిస్తున్నారు. చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ కనిపించనుండగా, నటుడు సుశాంత్ లవర్ బాయ్ పాత్ర చేస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర 'భోళా శంకర్'ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని ఇంటర్వెల్ ఫైట్ చిత్రీకరణను హైదరాబాద్‌లో ప్రారంభించింది యూనిట్. చిరంజీవి, షావర్ అలీ, వజ్ర అండ్ ఫైటర్స్, ఇతర ప్రముఖ తారాగణంపై ఈ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. మరోవైపు డబ్బింగ్ పనులకు కూడా గురువారమే శ్రీకారం చుట్టారు. ''భోళా శంకర్' 'కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ. ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్‌తో పాటు ఐఫీస్ట్ అనిపించే పాటలు ఉంటాయి. చిరంజీవిని స్టైలిష్ మాస్ అవతార్‌లో చూపిస్తున్నారు మెహర్ రమేశ్. జూన్‌లో షూటింగ్ పూర్తవుతుంది. ఆగస్టు 11న సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

క్యారెక్టర్ హీరో

టాలీవుడ్‌లో టాప్ క్యారెక్టర్ ఆర్టిస్టులు ఎవరంటే సీనియర్లలో రాజేంద్రప్రసాద్, వీకే నరేశ్, రావు రమేశ్, మురళీ శర్మ ఉంటారు. మంచి క్యారెక్టర్లు చేస్తున్న ఈ నటుల్లో రాజేంద్రప్రసాద్, నరేశ్ ఒకప్పుడు హీరోలుగా చేసిన విషయం తెలిసిందే. ఇన్నేళ్లు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అలరిస్తున్న రావు రమేశ్ ఇప్పుడు హీరోగా చేస్తున్నారు. 'వీళ్లే చేయాలి' అనే తరహా లీడ్ రోల్స్‌లో ప్రస్తుతం రాజేంద్రప్రసాద్, నరేశ్, రావు రమేశ్ నటిస్తున్నారు. క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మంచి పాత్రలు చేస్తున్న ఈ ముగ్గురూ 'క్యారెక్టర్ హీరో'గా చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.


• రాజేంద్రప్రసాద్, అర్చన


రాజేంద్రప్రసాద్ షష్టిపూర్తి

తెలుగులో హాస్య కథా చిత్రాల హీరో అనగానే రాజేంద్ర ప్రసాద్ గుర్తుకొస్తారు. హీరోగా ప్రేక్షకులపై వినోదాల జల్లులు కురిపించిన ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేతిలో అరడజనుకు పైగా చిత్రాలతో దూసుకెళుతున్నారు. అడపా దడపా లీడ్ రోల్స్ కూడా చేస్తున్నారు రాజేంద్ర ప్రసాద్. ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్‌కి జోడీగా అర్చన నటిస్తున్నారు. 'లేడీస్ టైలర్' (1986) తర్వాత ఈ ఇద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. షష్టిపూర్తి కథాంశంతో న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో రూపేష్ కుమార్ చౌదరి మరో హీరోగా నటించడంతో పాటు నిర్మిస్తున్నారు. ఇళయ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం జూలైలో రిలీజ్ కానుంది.

వీకే నరేశ్ మళ్ళీ పెళ్లి

హీరోగా వీకే నరేశ్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. తనదైన హాస్యం, నటనతో ప్రేక్షకులను అలరించిన ఆయన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గానూ వైవిధ్యమైన పాత్రలతో బిజీగా ఉంటున్నారు. కాగా నరేశ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎంఎస్ రాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ జంటగా నటించారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మదువే' టైటిల్స్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. మేలో ఈ చిత్రం విడుదల కానుంది. అందులో భాగంగా సురేశ్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'ఉరిమే కాలమా..' అంటూ సాగే పాటని గురువారం విడుదల చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి పాడారు.


• నరేశ్, పవిత్ర


• రావు రమేశ్


• ఇంద్రజ

మారుతీనగర్‌లో రావు రమేశ్

విలక్షణమైన డైలాగ్ డెలివరీతో తనదైన శైలిలో విలనిజాన్ని పండించిన గొప్ప నటుడు రావు గోపాలరావు. తండ్రి వారసత్వంతో తెలుగు చిత్ర పరిశ్రమకి క్యారెక్టర్ ఆర్టిస్టుగా పరిచయమయ్యారు ఆయన తనయుడు రావు రమేశ్. విలన్, కమెడియన్, తండ్రి.. ఇలా పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి, విలక్షణ నటుడిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు రావు రమేశ్. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్ష్మణ్ కార్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో రావు రమేశ్‌కి జోడీగా ఇంద్రజ నటిస్తున్నారు. పీబీఆర్ సినిమాస్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రంలో నడి వయసులో ఉన్న ఒక మధ్య తరగతి నిరుద్యోగి పాత్రలో రావు రమేశ్ కనిపిస్తారు. ఆయన జీవితంలో క్షణ క్షణం జరిగే ట్విస్టులే చిత్ర కథాంశం. క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకులను అలరిస్తున్న రావు రమేశ్ తొలిసారి కథను నడిపే నాయకునిగా చేస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఉన్నాయి.

క్యారెక్టర్ ఆర్టిస్టులు కథానాయకులుగా చేస్తున్న ఈ మూడు చిత్రాలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచాయి.

ఆ ఆఫర్ స్కామ్ అనుకున్నాను
- సాక్షీ వైద్య



''తెలుగులో నా తొలి సినిమా 'ఏజెంట్'. మంచి సినిమాతో పరిచయం కావడం ఆనందంగా ఉంది'' అన్నారు సాక్షీ వైద్య. అఖిల్ హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఏజెంట్'. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో సాక్షీ వైద్య మాట్లాడుతూ – ''వృత్తి రీత్యా నేను ఫిజియోథెరపిస్ట్‌ని. కోవిడ్ సమయంలో ఖాళీగా ఉండటం ఇష్టం లేక సోషల్ మీడియాలో కొన్ని రీల్స్ చేశాను. అవి వైరల్ అయ్యాయి. ఆ తర్వాత నా స్నేహితుల సలహా మేరకు కొన్ని ఆడిషన్స్ ఇచ్చాను. కొన్ని అవకాశాలు వచ్చినా నచ్చలేదు. కాగా 'ఏజెంట్' ప్రొడక్షన్ టీమ్ నుంచి ఒకరు ఫోన్ చేసి హీరోయిన్ చాన్స్ గురించి చెప్పారు. ఈ ఆఫర్‌ను నేను మొదట్లో స్కామ్ అనుకున్నాను. కానీ ముంబైలో ఉన్న ఓ కాస్టింగ్ డైరెక్టర్ ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పెద్ద బేనర్ అని, పెద్ద దర్శకుడు, పెద్ద స్టార్ అని చెప్పగానే హైదరాబాద్ వచ్చి ఆడిషన్స్ ఇచ్చాను. 'ఏజెంట్' కంప్లీట్ యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రంలో పైలెట్ పాత్రలో కనిపిస్తాను. 'ఏజెంట్' నాకు మంచి అనుభూతిని ఇచ్చింది. ప్రస్తుతం వరుణ్ తేజ్‌తో 'గాండీవ దారి అర్జున' చేస్తున్నాను'' అన్నారు.

వినోదాల సామజవరగమన


• శ్రీవిష్ణు, రెబా మోనికా, రామ్ అబ్బరాజు, అనిల్ సుంకర, రాజేష్ దండా

శ్రీవిష్ణు హీరోగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సామజవరగమన'. రెబా మోనికా జాన్ హీరోయిన్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ– ''సామజవరగమన' చాలా మంచి కథ. హిలేరియస్‌గా ఉంటుంది. ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో చాలా సినిమాలొచ్చాయి. కానీ ఈ చిత్రంలో ఫ్యామిలీ ఎలిమెంట్స్‌ను డీల్ చేస్తూనే ఓ కొత్త కాన్సెప్ట్‌ను చెప్పే ప్రయత్నం చేశాం. సెకండాఫ్‌లో వచ్చే ట్వంటీ మినిట్స్ కామెడీ హైలైట్‌గా ఉంటుంది'' అని అన్నారు. ''శ్రీవిష్ణు కథల ఎంపిక ప్రత్యేకంగా ఉంటుంది. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను తప్పక అలరిస్తుంది. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకూ ఆడియన్స్ నవ్వుతూ ఉంటారనే గ్యారంటీ ఇవ్వగలం'' అన్నారు అనిల్ సుంకర. ''ఫ్యామిలీ అంతా కలిసి చూసే ఫన్ మూవీ ఇది'' అన్నారు రామ్ అబ్బరాజు. ''ఈ సినిమా కథ విన్నప్పుడు ఎంజాయ్ చేశాను. రామ్ చెప్పిన కథను చెప్పినట్లు తీశాడు'' అన్నారు రాజేష్ దండా.

అప్పుడు భయం వేసింది
- మిర్నా మీనన్



''నా చిన్నతనం నుంచే నేను యాక్టర్‌ని కావాలనుకున్నాను. యాక్టింగ్ క్లాసులకు వెళ్లాను. అయితే కెరీర్‌ను స్టార్ట్ చేసిన తక్కువ సమయంలోనే రజనీకాంత్, మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ వంటి సూపర్ స్టార్స్‌తో నటించే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు హీరోయిన్ మిర్నా మీనన్. 'నాంది' తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఉగ్రం'. ఈ చిత్రంలో మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మిర్నా మీనన్ మాట్లాడుతూ– ''క్రేజీఫెలో' చిత్రంతో తెలుగులో ఎంట్రీ ఇచ్చాను. రజనీకాంత్‌గారి 'జైలర్' సినిమాలో ఓ కీ రోల్ చేస్తున్నాను. సెట్స్‌లో రజనీగారు చాలా డౌన్ టు ఎర్త్ ఉంటారు. ఆ మాట, నడక అన్నింటిలో ఓ స్టైల్ ఉంటుంది. ఆయన స్టైల్‌తోనే పుట్టి ఉంటారనుకుంటున్నాను. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడే నాకు 'ఉగ్రం'కి అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో నేను కాలేజీ అమ్మాయిలా, గృహిణిలా, ఓ బిడ్డకు తల్లిలా పలు షేడ్స్‌లో కనిపిస్తాను. ఒకే సినిమాలో విభిన్న రకాల లుక్స్‌తో కనిపించడం చాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమాలోని ప్రతి సీన్‌కు ఓ మీనింగ్ ఉంటుంది. 'ఉగ్రం' కోసం దాదాపు 70 రోజులు వర్క్ చేశాను. ఇందులో 55 రోజులు నైట్ షూట్ చేశాం. కంటిన్యూస్‌గా 15 రోజులు నైట్‌షూట్‌లో పాల్గొన్నాను. ఓసారి బ్రేక్ లేకుండా 48 గంటలు వర్క్ చేశాను. ఇదో డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్. ట్రైలర్‌లో చూసిన కారు యాక్సిడెంట్ సీన్ మేం రియల్‌గానే చేశాం. ఆ సమయంలో నాకు చాలా భయం వేసింది. నరేశ్‌గారికి చిన్నపాటి గాయాలు కూడా అయ్యాయి. ప్రస్తుతం అమీర్‌గారి డైరెక్షన్‌లో ఓ తమిళ సినిమా చేస్తున్నాను. మలయాళంలో ఓ సినిమా కమిట్ అయ్యాను'' అన్నారు.

మదర్ థెరిస్సా సేవలతో..


• బనితా

భారతదేశంలో పేదలు, రోగులు, అనారోగ్యంతో మరణానికి దగ్గరైన వారికి 1940 మధ్యకాలంలో మదర్ థెరిస్సా అందించిన సేవల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'మదర్ థెరిస్సా అండ్ మీ'. ఈ సినిమాలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ మహిళ కవిత కథను కూడా ఆవిష్కరించారు. జాక్వెలిన్ ఫిట్జీ కోర్నాజ్, బనితా సంధు, దీప్తి నావెల్ ప్రధాన పాత్రలు చేశారు. మదర్ థెరిస్సాగా జాక్వెలిన్ నటించగా, కవితగా బనితా సంధు కనిపిస్తారు. 'కర్రీ వెస్టన్, మిలియన్స్ కెన్ వాక్' ఫేమ్ కమల్ ముసలే దర్శకత్వం వహించారు. క్రౌడ్ ఫండింగ్‌తో ఈ సినిమాను నిర్మించామని, వచ్చే లాభాలను స్వచ్ఛంద సేవా సంస్థలకు అందిస్తామని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాను తొలుత హిందీ, ఇంగ్లిష్ భాషల్లో, ఆ తర్వాత స్పానిష్‌లో డబ్ చేయాలనుకుంటున్నారు.

గోల్కొండలో 'మన్ కీ బాత్' సౌండ్ అండ్ లైట్ షో

- ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు
- దేశవ్యాప్తంగా 13 చారిత్రక కట్టడాలు ఎంపిక
- మన్ కీ బాత్ 100 వ ఎపిసోడ్ ప్రసారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు


సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ నగరంలోని గోల్కొండ కోటలో ఈ నెల 29న 'మన్ కీ బాత్' థీమ్‌తో ప్రత్యేకమైన సౌండ్ అండ్ లైట్ షోను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ నెల 30 న ఆల్ ఇండియా రేడియో ద్వారా ప్రసారం కానున్న మన్ కీ బాత్ 100 వ ఎపిసోడ్ సందర్భంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనుంది. మన్ కీ బాత్‌కు సంబంధించిన ఎంపిక చేసిన కొన్ని థీమ్స్‌ను పురావస్తు శాఖ అధీనంలో దేశవ్యాప్తంగా ఉన్న 13 చారిత్రక కట్టడాల్లో సౌండ్ అండ్ లైట్ షో ద్వారా ప్రదర్శించనున్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని ఎర్రకోట, గ్వాలియర్ కోట, సూర్య దేవాలయం, వెల్లూరు కోట, గేట్ వే ఆఫ్ ఇండియా, నవ్‌నతన్ ఘడ్ కోట, రాంనగర్ ప్యాలెస్, ది రెసిడెన్సీ భవనం, గుజరాత్‌లోని సూర్య దేవాలయం, రాంఘడ్ కోట, చిత్తోర్‌ఘడ్ కోట, ప్రధాని సంగ్రహాలయతో పాటు హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలోనూ 'మన్ కీ బాత్'కు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను చేపట్టనున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ గురువారం తెలిపారు.

'మన్ కీ బాత్ ఆర్ట్ ఎగ్జిబిషన్'

మరోవైపు మన్ కీ బాత్ థీమ్ ఆధారంగా దేశంలో ప్రసిద్ధి పొందిన 12 మంది చిత్రకారులు వేసిన పెయింటింగ్స్, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 30 న ఢిల్లీలో ప్రారంభించనున్నారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో నీటి పొదుపు, నారీశక్తి, కోవిడ్‌పై అవగాహన, స్వచ్ఛ భారత్, వాతావరణ మార్పు, రైతాంగం–వ్యవసాయం, యోగా – ఆయుర్వేదం, సైన్స్–ఖగోళ శాస్త్రం, క్రీడలు–ఫిట్‌నెస్, భారత్ ఎట్ 75 అమృత్ కాల్, ఈశాన్య రాష్ట్రాలు అనే 12 రకాల థీమ్స్ ఉంటాయి. దీంతో పాటు 12 అమర్‌చిత్ర కథ కామిక్స్‌లో మొదటి కామిక్‌ను ఈ నెల 30 న విడుదల చేయనున్నట్లు గోవింద్ మోహన్ పేర్కొన్నారు.

సూడాన్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరుల కోసం హెల్ప్ డెస్క్

సాక్షి, హైదరాబాద్: సూడాన్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులను స్వరాష్ట్రానికి తరలించేందుకు ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తరలించేందుకు ఆపరేషన్ కావేరి నిర్వహిస్తుండటం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్ డెస్క్ ద్వారా తెలంగాణ పౌరులకు రాష్ట్ర అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నట్టు గురువారం పేర్కొన్నారు.



ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు క్లాడిమోనెట్ 'వాటర్ లిల్లీస్' పేరిట రూపొందించిన 250 చిత్రాలు పూర్తి చేయడానికి దాదాపు 30 ఏళ్లు పట్టింది. తన ఇంటి దగ్గర ఉన్న సరస్సులో లిల్లీపూల స్ఫూర్తిగా ఆయన వీటిని చిత్రించారు. వాటర్ లిల్లీస్‌లోని ఒక చిత్రం 2007లో సోత్‌బే వేలంలో 1.85 కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది. తరువాతి సంవత్సరం లండన్ క్రిస్టీ వేలంలో మరో చిత్రం 4.1 కోట్ల డాలర్లకు అమ్ముడుపోయింది. మోనెట్ చిత్రించిన వాటర్ లిల్లీస్‌ను ఓ మంచి ఫొటోగ్రాఫర్ అంతే అందంగా కొన్ని క్షణాల్లో కెమెరాలో బంధించగలడు కానీ వాటికి ఉండే విలువెంత?

దొడ్డ శ్రీనివాసరెడ్డి

19వ శతాబ్దంలో లాండ్ స్కేప్ ఆర్టిస్టులకు, ఫొటోగ్రాఫర్లకు మధ్య వివాదం చెలరేగింది. ఫొటోలను సృజనాత్మక కళగా గుర్తించగలమా అన్నది నాటి కళాకారుల ప్రశ్న. కానీ తదుపరి కాలంలో ఫొటోగ్రఫీ కూడా కళగా అవతరించింది. ఫొటోలు కూడా వందల కోట్ల డాలర్లు ఆర్జించిన సందర్భాలున్నాయి. ఇప్పుడు కళాకారుల మనుగడనే ప్రశ్నించే మరో ముప్పు కృత్రిమ మేధ (ఏఐ) రూపంలో వచ్చి పడింది. ఏళ్లకు ఏళ్ల చేసిన సాధన ద్వారా కళాకారులు సాధించిన నైపుణ్యాన్ని కృత్రిమమేధ క్షణాల్లో అనుకరిస్తోంది. నమూనాలను సృష్టిస్తోంది. కృత్రిమమేధ ఇకముందు కళలకు సమాధి కడుతుందా? మనిషి సృజనాత్మకతతో పోటీపడుతుందా? కారుచౌకగా ఏఐ కళారూపాలను సృష్టిస్తుంటే అసలు కళలకు ఆదరణ ఉంటుందా? ఏఐ రూపొందించే కళలకు విలువ ఉంటుందా? అన్నవి ఇప్పుడు కళా ప్రపంచంలో తలెత్తుతున్న ప్రశ్నలు. ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమించుకుంటున్న కృత్రిమమేధ ఇక సృజనాత్మక కళారంగాలనూ కబ్జా చేస్తుందని కళాకారులు ఆందోళన చెందుతున్నారు.

కృత్రిమ మేధ కళలకు వధ?

డాలీ.. డాలీ

కృత్రిమమేధ ఆధారంగా చాట్‌బాట్ 'చాట్ జీపీటీ' సృష్టించిన సంస్థ ఓపెన్ ఏఐ రూపొందించిన మరో ప్లాట్‌ఫామ్ డాల్–ఇ. ప్రఖ్యాత ఫ్రెంచ్ సర్రియలిస్ట్ పెయింటర్ సాల్వడార్ డాలీ పేరును పోలినట్లుగా ఉండే ఈ డాల్–ఇ ప్లాట్‌ఫామ్ కృత్రిమమేధను ఉపయోగించి అద్భుతమైన డిజిటల్ పెయింటింగ్స్‌ను సృష్టిస్తోంది. డాల్–ఇ మాదిరిగానే మిడ్ జర్నీ, స్టేబుల్ డిఫ్యూజన్ లాంటి మరికొన్ని ఏఐ ప్లాట్‌ఫామ్‌లు కూడా చిత్ర కళారంగంలో చొరబడి సంచలనం సృష్టిస్తున్నాయి. హేగ్ మ్యూజియంలో ఉన్న జొనెస్ వెర్మీర్ అద్భుత కళాఖండం 'గర్ల్ విత్ ఎ పెరల్ ఇయరింగ్' స్ఫూర్తిగా జులియన్ వాన్ డైకెన్ అనే ఆర్టిస్టు మిడ్ జర్నీ ప్లాట్‌ఫామ్‌పై కృత్రిమమేధను వినియోగించి రూపొందించిన 'ఎ గర్ల్ విత్ గ్లోయింగ్ ఇయరింగ్స్' చిత్రాన్ని ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఓ ప్రముఖ మ్యూజియంలో ప్రదర్శనకు పెట్టినప్పుడు చిత్ర కళారంగంలో అలజడి రేగింది. కంప్యూటర్ సృష్టించిన చిత్రాన్ని కళాఖండంగా ఎలా పరిగణిస్తారని ఆర్టిస్టులు ముక్తకంఠంతో ప్రశ్నించారు. ప్రింటింగ్, పబ్లిషింగ్ పరిశ్రమ కూడా ఇప్పుడు కృత్రిమమేధను ఆశ్రయించి కవర్ డిజైన్స్ రూపొందిస్తోంది. ప్రముఖ పత్రిక 'ది ఎకనామిస్ట్' ఇప్పుడు తన కవర్ డిజైన్ల సృష్టికి కృత్రిమమేధపై ఆధారపడుతోంది. అనేకమంది రచయితలు తమ నవలలు, పుస్తకాల కవర్ డిజైన్ల కోసం కృత్రిమమేధను ఉపయోగిస్తున్నారు. ఆర్కిటెక్ట్‌లు కూడా అద్భుతమైన కట్టడాలు, డామ్‌లు, స్టేడియాలు, గార్డెన్ల డిజైన్ల రూపకల్పనకు కృత్రిమమేధను ఆశ్రయిస్తున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలోకీ కృత్రిమమేధ అడుగుపెట్టింది. ది ఫ్యాబ్రికెంట్ లాంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అనూహ్యమైన వస్త్రాలు, ఆభరణాల డిజైన్‌లను ఏఐతో సృష్టిస్తున్నాయి. ఇవి ధరించడానికి పనికి రావు కానీ డిజిటల్ రూపంలో వర్చ్యువల్‌గా వీటిని ధరించి ఆనందించవచ్చు. అయితే వీటిని పొందడానికి మాత్రం 'నిజమైన' ధర చెల్లించాల్సిందే. కొన్ని వస్త్రాల డిజైన్‌లు పదివేల డాలర్ల వరకు ఉన్నాయి. ఇటీవల బీచ్‌లో సర్ఫింగ్ చేస్తున్న వారి ఫొటో ఒకటి ఆస్ట్రేలియాలో ప్రతిష్ఠాత్మకమైన ఫొటోగ్రఫీ పోటీల్లో విజయం సాధించింది. అయితే ఈ ఫొటో కృత్రిమమేధ ఆధారంగా తయారుచేసిందని తెలిసి ప్యానెల్ జడ్జీలు ఈ చిత్రాన్ని తొలగించి వేరే ఫొటోను ఎంపిక చేయాల్సి వచ్చింది. ఈ విషయంలో చెలరేగిన వివాదం ఫలితంగా పోటీలను రెండు విభాగాలుగా విభజించారు. ఒకటి కంప్యూటర్ సృష్టించే ఫొటోలకు, మరొకటి కెమెరా ద్వారా తీసిన ఫొటోలకి.

కదం తొక్కుతున్న కళాకారులు

వివిధ రంగాలకు చెందిన కళాకారులు, నిపుణులు ఏళ్ల తరబడి కృషితో సాధించిన నైపుణ్యాన్ని అచ్చుగుద్దినట్లు అనుకరిస్తున్న కృత్రిమమేధపై కదం తొక్కుతున్నారు. కళా నైపుణ్యాన్ని కూడా ఆటోమేషన్ చేస్తే తమ భవిష్యత్తు ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆర్టిస్టులు, డిజైనర్లు, ఫొటోగ్రాఫర్లు, రచయితలు, మ్యూజీషియన్లు తమ మనుగడను అంధకారంలోకి నెడుతోందని కృత్రిమమేధపై విరుచుకుపడుతున్నారు. కృత్రిమమేధ చొరబాటును అడ్డుకునేందుకు రకరకాల ఆయుధాలు సన్నద్ధం చేస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోకి చెందిన కార్టూనిస్టు సరా అండర్సన్, ఇల్లస్ట్రేటర్ కార్లో వోర్టిజ్ కాపీరైట్ చట్టం కింద న్యాయ పోరాటం చేస్తున్నారు. తమ బొమ్మలను అనుకరిస్తూ నకలు సృష్టిస్తున్న ఏఐ వేదికలు డ్రీమ్ అప్, మిడ్ జర్నీ, స్టేబుల్ ఫ్యూజన్‌పై వీరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ అనుమతి లేకుండా, పరిహారం చెల్లించకుండా తమ బొమ్మలను వాడుకుంటున్నందుకు కాపీరైట్ చట్టం కింద శిక్షించాలని కోరారు.



'గర్ల్ విత్ ఎ పెరల్ ఇయరింగ్' 'ఎ గర్ల్ విత్ గ్లోయింగ్ ఇయరింగ్స్'



ఏఐ సృష్టించిన బీచ్‌లో సర్ఫింగ్ ఫొటో

గుర్తింపు కావాలి

ఏఐ ఆధారిత కంప్యూటర్ ప్రోగ్రాంలు సొంతంగా ఏమీ సృష్టించలేవు. అవి సృష్టించే నకలుకి ఏదో ఒక అసలైన చిత్రమో, కళాకారులు లేదా రచయితల శైలి ఆధారం కావాలి. ఎలాంటి చిత్రం, ఫొటో, రచన కావాలన్నా ఎవరిశైలిలో కావాలన్నా కమాండ్ ఇస్తే వాటిని అనుసరించి కృత్రిమమేధ నకలును సృష్టించగలుగుతుంది. అలాంటప్పుడు వాటికి ఆధారమైన కళాకారులు, రచయితలు, ఫొటోగ్రాఫర్లకు తగిన రీతిలో పరిహారం చెల్లించడం, గుర్తింపు ఇవ్వాలనేది వారి వాదన. క్రిస్ కష్టనోవా అనే రచయిత్రి 'జోర్యా ఆఫ్ ద డాన్' పేరిట ప్రచురించిన కామిక్ నవలకు అమెరికా కాపీరైట్ ఆఫీసు తొలుత ఆమోదం తెలిపింది. అయితే ఈ కామిక్‌లో ఉపయోగించిన బొమ్మలు మిడ్‌జర్నీ ప్లాట్‌ఫామ్ ద్వారా సృష్టించినట్లు తరువాత వెల్లడైంది. దీనిపై వివాదం చెలరేగడంతో నవలలో కథకు మాత్రమే కాపీరైట్ ఇస్తున్నామని, కంప్యూటర్ సృష్టించిన బొమ్మలకు ఇవ్వలేదని కాపీరైట్ ఆఫీసు తన నిర్ణయాన్ని సవరించుకుంది. బొమ్మలు, కార్టూన్లు, చిత్రాలను కృత్రిమమేధ కాపీ కొట్టకుండా షికాగో యూనివర్సిటీకి చెందిన ఓ బృందం 'గ్లేజ్' అనే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. దీన్ని ఉపయోగిస్తే, అది చిత్రాలపై కంటికి కనిపించని ఒక తెరను కప్పేస్తుంది. దాంతో కృత్రిమమేధ ఈ చిత్రాన్ని కాపీ కొట్టడం కుదరదు. 'కృత్రిమమేధ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఈ తరుణంలో కొన్ని మార్గదర్శకాలు, ఆంక్షలు అవసరం' అని గ్లేజ్ సృష్టికర్త స్వాన్‌షాన్ అభిప్రాయపడ్డారు.

సహజీవనం తప్పదు

కృత్రిమమేధ విస్తృతిని ఆపడం ఎవరివల్లాకాదు. అన్ని రంగాల్లోకి అది చొచ్చుకుపోతోంది. ఇక కృత్రిమమేధను మన జీవితాల్లోకి ఆహ్వానించక తప్పదు. దాంతో సహజీవనానికీ మార్గం సుగమం చేసుకోవాల్సిందే అని విజ్ఞులు చెబుతున్నారు. సాల్వడార్ డాలీ సర్రియలిస్టు పెయింటింగ్స్‌ను, పికాసో అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్స్‌ను, బ్రాక్ క్యూబిజమ్‌ను మొదట్లో కళగా గుర్తించలేదు. కానీ ఇప్పుడవి అద్భుత కళాఖండాలుగా ఆవిష్కృతమయ్యాయి. కొత్తదనాన్ని స్వీకరించడానికి మనిషికి కొంత సమయం పడుతుంది. ఇప్పుడు కృత్రిమమేధ సృష్టించే కళారూపాల్ని ముందు ముందు మనం ఆమోదించి ఆహ్వానిస్తామేమో?.



ఈ మధ్య పోప్ ఫ్రాన్సిస్ తెల్లజాకెట్ వేసుకున్న చిత్రం ఒకటి సంచలనం సృష్టించింది. అద్భుతమైన ఈ ఫొటో తీసిందెవరని ఇంటర్నెట్‌లోలక్షలాదిమంది వెతికారు. ఈ ఫొటో పూర్తిగా కృత్రిమమేధ ఆధారంగా రూపొందించిందే కావడం కొసమెరుపు.

కానిస్టేబుల్ హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ గడువు నేటివరకే..

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించనున్న తుదిరాత పరీక్ష హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ గడువు శుక్రవారంతో ముగియనుంది. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ కోసం అర్హులైన అభ్యర్థులు 'టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ' వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ ఐడీల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో ఇబ్బందులున్న అభ్యర్థులు 9393711110, 9391005006 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కానిస్టేబుల్ పోస్టులకు ఈనెల 30న తుదిరాత పరీక్ష నిర్వహణకు రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

'గ్లోబల్ నేచర్ చాలెంజ్'కు హైదరాబాద్

స్వచ్ఛందంగా జీవ వైవిధ్యం చిత్రాల నమోదుకు పిలుపు

సాక్షి, హైదరాబాద్: తొలిసారిగా 'గ్లోబల్ నేచర్ చాలెంజ్'కు హైదరాబాద్ నగరం సిద్ధమైంది. ఏప్రిల్ 28 నుంచి మే 1 వరకు మహానగరంలోని జీవవైవిధ్యాన్ని స్వచ్ఛందంగా నమోదు చేసే ప్రక్రియ జరగనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 46 దేశాల్లోని 485 నగరాల్లో ఈ నేచర్ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా చూస్తే 30కి పైగా నగరాలు ఇందులో పాల్గొంటున్నాయి. కృత్రిమమేధ (ఏఐ), జీపీఎస్ ఆధారిత 'ఐ'నాచురలిస్ట్ యాప్ ద్వారా నగర పౌరులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి, పరిసరాలు, జంతువులు, పక్షులు, చెట్లు, తదితర రూపాల్లోని జీవవైవిధ్యాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. నాలుగురోజుల వ్యవధిలో ఏ నగరంలోనైతే అత్యధికంగా ప్రకృతిని ప్రతిబింబించే ఛాయాచిత్రాలు నమోదు చేస్తారో.. ఆ నగరం ఈ ఫ్రెండ్లీ పోటీలో నెగ్గుతుందని డబ్ల్యూడబ్ల్యూఎఫ్–ఇండియా స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.